

₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 9
పక్షపత్రిక మే 1-15, 2017

**రుణమాఫీ, ఉచితాల బదులు రైతులకు ‘ధరల స్థిరీకరణ నిధి’ని ఏర్పాటు చేయాలి : జేపీ**








## ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి: జేపీ

## ఫిరాయింపులు - వంశపారంపర్యాలు






## లోక్‌సత్తా ‘పౌర సేవల’ చట్టం బుక్‌లెట్ ఆవిష్కరణ







# పౌర సేవల చట్టంపై యూత్ వర్క్‌షాప్

ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమం పేరుతో ఎన్ని వేల కోట్లు ఖర్చు చేస్తున్నా నిజంగా అవి ప్రజలకు చేరి మేలు చేయాలంటే... ప్రభుత్వోద్యోగులు సక్రమంగా పనిచేయాలి. కానీ, పోలీస్ స్టేషన్‌కి వెళ్లి చిన్న ఫిర్యాదు చేయాలంటే ఇప్పటికీ మనలో చాలామంది వణికిపోతారు. చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు దళారుల్ని, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సులను ఆశ్రయిస్తుంటారు. ఇలా లంచాలు, వేధింపులు లేకుండా ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ప్రజలకు సకాలంలో, సేవాభావంతో జరిగేలా చేయటానికి లోక్‌సత్తా చాలా ఏళ్లుగా హక్కుగా 'పౌరసేవల' (రైట్‌టూ సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ) చట్టం కోసం పోరాడుతోంది. ఈ చట్టం అమలులోకి వస్తే.. సర్కారీ కార్యాలయాల్లో ప్రతి పనికీ ఒక గడువు పెట్టి 'సిటిజన్ ఛార్టర్ల' రూపంలో బోర్డు పెడతారు. ఆ టైంలోగా పని జరగకపోతే, దరఖాస్తు చేసుకున్నవారికి రోజుకు కనీసం రూ.250 పరిహారం చెల్లిస్తారు. పౌర సేవల చట్టంపై ఇటీవల లోక్‌సత్తా భావజాల యువనేతల బృందం హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ వర్క్‌షాప్‌లో... ప్రజల సాధికారత దిశగా చట్టంలో ఉన్న వివిధ ఏర్పాట్ల గురించి లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ వివరించారు. జేపీ నేతృత్వంలోని ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ఈ కార్యక్రమానికి నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా వ్యవహరించింది.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మే 1-15, 2017

సంపుటి - 8 సంచిక - 9

## లోపలి పేజీల్లో...

ఫిరాయింపులు- వంశపారం............. 5

అక్కడ ఇక్కడా అదే ప్రహసనం.............13

సభాపతి స్థానం సమస్యాత్మకం............ 16

పార్టీల ఫిరాయింపులు -స్పీకర్ పాత్ర..... 20

ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ............ 24

తెలంగాణ సుపరిపాలన ప్రస్థానంలో..... 25

రుణమాఫీ, ఉచితాల బదులు ధరల....... 27

రైతులు కలసివస్తే ఎంత పోరాటమైనా... 29

హామీలు అమలుచేయకుంటే ............. 30

స్థిరాస్తి చట్టం ఉపాధికి .................... 33

కుల, మత రాజకీయాలు ఆపి............ 34

సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్

ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం


బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి. కుటుంబరావు


బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


# కాశ్మీర్ ఓటమి – కింకర్తవ్యం?



**బా**బాసాహెబ్ అంబేద్కర్ 126వ జయంతి సందర్భంగా ఓ డిజిటల్ టీవీ యువ ప్రతినిధి నన్ను ఒక ప్రశ్న అడిగారు. "ఈమధ్య అంబేద్కర్‌కు ఆదరణ బాగా పెరుగుతోంది. విగ్రహాలు వేగంగా విస్తరిస్తున్నాయి. దేశానికి స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో ఎన్నికలలో ఓడిపోయిన అంబేద్కర్ ఇప్పుడు గనక వచ్చి పోటీచేస్తే గెలుస్తారా?" అని. "అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగబద్ధ విధానాలు, చట్టబద్ధపాలన మార్గంలో మార్పు కోసం కృషి చేస్తున్న లోక్‌సత్తా ఎందుకు విఫలమైంది?" అని ఇంకో ప్రశ్న కూడా వేశారు.. పాపం ఆ యువకుడిది తప్పు కాదు. తలనెరిసిన జర్నలిస్టులు, సమాజం కూడా.. ఎన్నికలలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న అభ్యర్థులు, పార్టీలు అని ఊదరగొడుతున్న వాతావరణంలో అలాంటి ప్రశ్నే తట్టింది. "ఎన్నికలలో గెలుపును బట్టి ఓ నాయకుడి గొప్పతనాన్ని అంచనా వేయకూడదు. లక్ష్యాన్ని సాధించటాన్ని బట్టి కూడా అంచనా వేయకూడదు. కొన్ని లక్ష్యాల కోసం కొన్ని తరాలు కూడా పనిచేయాల్సి రావచ్చు. ఒక ఎమ్మెల్యేగానో, ఎంపీగానో మనం ఊహించనుకూడా లేని గాంధీ ఇప్పటికీ తన లక్ష్యాలను సాధించలేకపోయారు. లోక్‌సత్తా విఫలమైందంటే.. అబ్రహాం లింకన్, గాంధీ, అంబేద్కర్ లాంటి వారంతా విఫలమైనట్టే. ఎన్నికలలో నెగ్గిన వారి కంటే అనేకరెట్లు ఫలితాలను సాధించింది లోక్‌సత్తా! చేయాల్సిన పని ఇంకా చాలా ఉందనటంలో సందేహం లేదు. కానీ విఫలమయ్యాయని అంబేద్కర్, గాంధీ, లోక్‌సత్తా వంటి శక్తుల విషయంలో భావించటం సరైన అవగాహన కాదు" అని సమాధానమిచ్చా.. ఎన్నికల్లో గెలుపే ప్రజాస్వామ్యం అనే పొరపాటు అభిప్రాయం ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి స్థాయిలోనూ కనిపిస్తోంది. పార్టీలు పనిముట్లు మాత్రమే, ఎన్నికలలో గెలిచేది, ఓడిపోయేది ప్రజలు తప్ప అభ్యర్థులు, పార్టీలు కాదు అనే అవగాహనను పైస్థాయిలోవారు సైతం కనబర్చకపోవటం మనదేశంలో మార్పులను ఆలస్యం చేస్తోంది. ప్రజలలో, సమాజంలో ఉన్న అమాయకత్వాన్ని, అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని.. పలువురు రాజకీయ నేతలు పార్టీల ప్రయోజనాలే దేశ ప్రయోజనాలు అని భ్రమింప చేస్తున్నారు. నరేంద్ర మోదీ 2014లో అసాధారణరీతి ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చాక అదే ఏడాది చివర్లో జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో మంచి విజయాన్ని నమోదుచేశారు. ధైర్యంగా పీడీపీతో సంకీర్ణాన్ని ఏర్పాటు చేశారు. కానీ క్రమంగా దేశం, ప్రజాస్వామ్యం దృష్టితో కాకుండా కేవలం పార్టీ దృష్టితో పనిచేసి చివరకు అక్కడ ఓ గొప్ప అవకాశాన్ని జారవిడిచారు. ఇటీవల జరిగిన శ్రీనగర్ లోక్‌సభ ఉప ఎన్నికలో కేవలం 7.13 శాతం మాత్రమే పోల్ అవటం, 38 పోలింగ్ కేంద్రాలలో జరిపిన రీ పోల్‌లో 2శాతంలోపే ఓటు వేయటం, కొన్ని బూత్‌లలో ఒక్క ఓటరు కూడా రాకపోవటం, జీహాదీ ధోరణులు మోదీ నాయకత్వ వైఫల్యాన్ని, ఆయన పార్టీ హ్రస్వదృష్టిని పట్టిస్తుంది. తమ కార్యకర్తలు మాత్రమే ఓట్లు వేయటానికి వీలుగా కాశ్మీర్‌లో పార్టీలే రాళ్లు వేయించాయన్న వాదనతో మరుగునపడే చిన్న వైఫల్యం కాదిది. జమ్మూకాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమనటంలో మరోమాటకు తావు లేదు. కానీ, 30-50శాతం వరకూ ఓట్లు వేస్తూ, 2014లో కూడా మోదీ పార్టీ వంక ఆశగా మొగ్గుచూపిన కాశ్మీరీలు.. ఇప్పుడెందుకు పూర్తిస్థాయి తిరస్కారాన్ని ప్రదర్శిస్తున్నారో ఆలోచించాలి. కాశ్మీరీల సమస్యల పరిష్కారానికి, వారి స్థానిక స్వయంపాలన ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు చొరవ చూపకుండా మోదీ పార్టీ స్వల్పకాల ఎన్నికల ప్రయోజనాలు, మూస, పిడివాద ధోరణులతో ఆధిపత్య, కేంద్రీకృత రాజకీయాలను చేయటం వైఫల్యానికి ప్రధాన కారణం. దేశంలోని రాష్ట్రాలన్నీ కేంద్రం చెప్పినట్టే చేయాలి, ముఖ్యమంత్రులందరూ మోదీలాగే వ్యవహరించాలి అంటే.. భారతదేశ భావనకే అర్థం ఉండదు. దేశ సమగ్రత పరిధిలో రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛను, స్వయంప్రతిపత్తిని ఇవ్వాలని, రాజ్యాంగాన్ని వికేంద్రీకరించి సొంత రాజ్యాంగం ఏర్పరచుకునే అధికారాన్ని కూడా ఇవ్వాలని లోక్‌సత్తా చాన్నాళ్లుగా డిమాండ్ చేస్తోంది. 'బలమైన కేంద్రం - రాష్ట్రాలు - స్థానిక ప్రభుత్వాల' మూడంచెల భారతదేశం కావాలిప్పుడు! లోక్‌సత్తా 'రాష్ట్రాల స్వయంప్రతిపత్తి' వాదనను ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు రిజర్వేషన్ల విషయంలో ప్రస్తావించారు. రిజర్వేషన్ల విషయంలో కేసీఆర్ వాదన అసంబద్ధంగా, వెనకబాటుతనాన్ని ఇంకా పెంచేదిగా ఉన్నప్పటికీ, రాష్ట్రాలకు స్వేచ్ఛవుండాలన్న డిమాండ్ విషయంలో ఆయన సరిగానే మాట్లాడారు. దేశంలోని అనేక సమస్యలకు కేంద్రీకృత పాలనే మూలమవుతోంది. బోలెండత సాంకేతికత, సమాచారం ఉంటుందిగానీ, పారదర్శకత, వాస్తవాలు మాత్రం ఉండవు. లోక్‌సభలో అడ్డగోలు వాదనలతో ఓ మంత్రి మీద మరో మంత్రి దౌర్జన్యానికి దిగినా.. ఇంత ఫలప్రదమైన సమావేశాలు గత 65ఏళ్లలోనే జరగలేదని మనం చదువుకోవాల్సి వస్తోంది. ఉత్తర-దక్షిణ అంటూ వివక్షాపూరిత వ్యాఖ్యానాలు చేసినా, హిందీని రుద్దుతున్నా, జయలలిత అవినీతిపరురాలని తీర్పు చెప్పటానికి సుప్రీంకోర్టు నిరాకరించినా.. దిద్దుబాటు సంకల్పం ఉండదు. మోదీ పార్టీలోనూ ఈ వాస్తవాలు తెలిసినవారున్నారు. కానీ వారి మాటల్ని వినిపించుకోవటంలా. పార్టీ ఎన్నికల విజయాలే దేశ విజయాలు అన్న భ్రమ నుంచి మోదీ ప్రభుత్వం త్వరగా బైటికి రావాలి. దేశవ్యాప్తంగా రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి. ఇలాంటి ఫెడరల్ ఫార్ములా, విద్య, ఉపాధి, మత ఛాందసాన్ని కట్టడి చేయటంతోనే కాశ్మీర్ సమస్య కూడా పరిష్కారమవుతుంది. అలాగే రాజకీయాలలో లక్ష్యాలను వేగంగా సాధించటానికి కీలకమైన ఎన్నికలలో సమర్థులు, నిజాయతీపరులు గెలిచేలా.. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణల్ని తీసుకురావాలి. ప్రజలు ప్రభుత్వం నుంచి కాకుండా పార్టీల నుంచి ఏదోకరకమైన సహాయాన్ని నిరంతరం కోరుకుంటుండటం, ఇందుకోసం పార్టీలు కోట్లాదిరూపాయలతో కిరాయి కార్యకర్తలు, నేతలను పోషించటం వంటి సమస్యల్ని కూడా పౌరసేవల చట్టం, స్థానిక ప్రభుత్వాలకు నేరుగా నిధులు-అధికారాలు వంటి ఏర్పాట్లతో పరిష్కరిస్తే.. గాంధీ, అంబేద్కర్ లాంటి మహనీయులకు వారసులు కాగలిగినవారు మోదీ పార్టీ నుంచి కూడా ఎన్నికవుతారు, రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తారు. చరిత్రకు సరైన పక్షాన నిలవాలంటే.. ఈ సంస్కరణల కోసం మోదీ సహా రాజకీయ వ్యవస్థ, పౌరసమాజం, మీడియా చేతల్లో స్పందించాలి.

మీ





"Meet Mr.Kim  Donald Jong Trump Un"

# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

ఫోన్ : **040-23310288**
ఫోన్ / ఫ్యాక్స్ : **040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# ఫిరాయింపులు - వంశపారంపర్యాలు

'అవినీతి సొమ్మును జప్తు చేస్తే చాలదు, అవినీతిపరుల ఆస్తులన్నిటినీ జప్తు చేయాలి' అని లోక్‌సత్తా తొలినుంచీ చట్టసవరణ డిమాండ్ చేయటానికి ఓ ప్రత్యేక కారణం ఉంది. అది – మనదేశంలోని వంశపారంపర్య ధోరణులు! కుటుంబ వ్యవస్థ మనకు బలమేకాదు, బలహీనత కూడా అని మన (ప్రజాస్వామ్య) రాజకీయ వ్యవస్థలోని వారసత్వ (రాచరిక) సంస్కృతి పదేపదే రుజువు చేస్తోంది. ఆస్తులు సంపాదించి కొడుకులు, కూతుళ్లు, మనవళ్లు, మనవరాళ్లకు అందించాలన్నదే మన సాంప్రదాయ రాజకీయ నాయకుల్లో అత్యధికుల తాపత్రయం. పట్టుబడినా, న్యాయవిచారణ జాప్యం వల్ల శిక్ష పడి కొన్నేళ్లు జైల్లో ఉన్నా, కూడా కుటుంబ సభ్యులకు కోట్ల రూపాయల స్థిరచరాస్తుల్ని నికరంగా అందించవచ్చన్న ధోరణి వారిని బరితెగించేలా చేస్తోంది. అందువల్లే రాజకీయ, ఉన్నతస్థాయి అవినీతి కేసుల్ని స్వతంత్ర ప్రాసిక్యూషన్‌తో, ప్రత్యేక కోర్టుల్లో వేగంగా విచారణ చేసి.. ఈ సొమ్ము, ఆ సొమ్ము అని తేడా లేకుండా అవినీతిపరుల ఆస్తులన్నిటినీ జప్తు చేయాలని లోక్‌సత్తా ప్రతిపాదించింది.



అవినీతికి పాల్పడితే, జైలుతోపాటు సొమ్ముపోయే శనీ పట్టే అన్నట్టు ఆస్తులన్నీ పోతాయి, కుటుంబ సభ్యులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వటానికి ఉండదు అనుకుంటే.. అవినీతికి పాల్పడటం మనదేశంలో బాగా తగ్గుతుందని లోక్‌సత్తా వాదన. పౌరసేవల చట్టం, స్థానిక అధికారాలు వంటి ఇతరత్రా ఏర్పాట్లు దీనికి తోడుగా ఉంటాయి. 2008లో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రతిపక్ష నేత, తెదేపా అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఇద్దరూ ఒకరి అక్రమాస్తులపై ఇంకొకరు ఆరోపణలు చేసుకుని కేవలం 'రాజకీయ అవినీతి' మీదే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు జరిపారు. ఆ సమావేశాలలో వైఎస్సార్, చంద్రబాబు ఇద్దరూ గాలిలో కత్తులు తిప్పుతూ షాడో బాక్సింగ్‌తో ఏదో యుద్ధం చేస్తున్నట్టు నటిస్తున్నప్పుడూ లోక్‌సత్తా ఇదే ప్రతిపాదన చేసింది. ఒక ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత.. బాధ్యతాయుత స్థానాలలో ఉన్న వీరిద్దరూ అక్రమాస్తులపై పరస్పరం చేసే ఆరోపణలు తేలిగ్గా తీసిపారేయదగినవి కావని, ప్రత్యేక కోర్టు+ఆస్తుల జప్తుతో విచారణ జరపాలని లోక్‌సత్తా డిమాండ్ చేసింది. కావాలంటే ఇందుకు కావలసిన డ్రాఫ్టును 24గంటల్లోగా సిద్ధం చేసి ఇస్తామని బహిరంగంగా తెలియచేసింది. మీడియాలో లోక్‌సత్తా ప్రతిపాదన స్పష్టంగా రిపోర్టయింది. కానీ చంద్రబాబుపై కేసుల్ని సుప్రీంకోర్టులో నుంచి వెనక్కి తీసుకున్న రీతిలోనే.. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలలోనూ వైఎస్సార్ వ్యవహరించారు. అవినీతిపై ప్రత్యేక కోర్టు, ఆస్తుల జప్తు అనగానే వైఎస్సార్, బాబు ఇద్దరూ రాజీపడి అవినీతిపై అసెంబ్లీని, ప్రజల్ని పక్కదోవ పట్టించారు. చంద్రబాబుపై అవినీతి ఆరోపణలతో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్ రాసిన లేఖలను పుస్తకంగా ప్రచురించిన ఓ సీనియర్ జర్నలిస్టుకయితే.. వైఎస్ అధికారంలోకొచ్చాక చంద్రబాబుతో వివిధ సందర్భాలలో కుదిరిన వ్యక్తిగత రాజీని చూసి ఏడుపొకటే తక్కువ. ఈ దేశంలో అవినీతిని అంతం చేయటం ఓ భ్రమ అనే నిర్వేదంలోకి జారిపోయారాయన.

అవినీతిపై షాడో బాక్సింగ్‌తో ప్రజల్ని మభ్యపెట్టిన వైఎస్, చంద్రబాబు మళ్లీ ఆ ఊసెత్తకుండా, 2009లో తెలంగాణ సెంటిమెంట్ వైపు ఎన్నికలను తిప్పారు.

కుటుంబ సభ్యులకు ఆస్తులను మూటగట్టి పంపిణీ చేసే అవకాశమే లేకపోతే, తెలుగునాట ఇన్ని పకడ్బందీ అవినీతి ఆరోపణలు వచ్చేవి కావు. అలా పంపిణీ చేయాలనే ఉద్దేశమే లేకపోతే.. ప్రత్యేక కోర్టులు, ఆస్తుల జప్తు, స్వతంత్ర ఏసీబీ, బలమైన లోకాయుక్త తదితర అంశాలతో జూన్, 2009న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రతిపాదించిన అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లును వైఎస్, చంద్రబాబు అణగదొక్కాల్సిన అవసరమే ఉండేది కాదు.

కానీ ఆస్తుల పంపిణీకే ఈ వారసత్వం పరిమితం కాలేదు. మన కుటుంబ వ్యవస్థలోని బలహీనత రాజకీయాల్లో ఇంకో దశకు చేరుకుంది. రాచరికంలోలా అధికారాల్ని, రాజ్యాల్ని కూడా ధారాదత్తం చేసే సంస్కృతి దాకా పెరిగిపోయింది. కాంగ్రెస్ పార్టీ వైఫల్యం, సమాజంలోని పెత్తందారీ ధోరణుల

**1967 నుంచీ..**

1967 తర్వాత దేశ రాజకీయాలలో ఏక పార్టీ (కాంగ్రెస్) పెత్తనం క్షీణించటం మొదలైంది. ఆ ఏడాది 16 రాష్ట్రాలలో ఎన్నికలు జరగగా.. ఒకే ఒక్క రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఇతర పార్టీలకు చెందిన ప్రభుత్వాలను అస్థిరపరిచే అనైతిక విధానానికి పునాది కూడా పడింది. 1967 నుంచి 1983 మధ్య కాలంలో వివిధ రాష్ట్రాలలో దాదాపు 2,700మంది పార్టీ ఫిరాయించారు. ఇందులో 212మందికి మంత్రి పదవులు దక్కాయి. ఫిరాయించి ముఖ్యమంత్రులైనవారు 15మంది. ఫిరాయింపులపై 1967లోనే అప్పటి హోంమంత్రి వైబీ చవాన్ నేతృత్వంలో కమిటీ వేశారు. 1973, 1978లలో ఫిరాయింపుల నిరోధక బిల్లును తీసుకురావాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇందిరాగాంధీ హత్యానంతరం కాంగ్రెస్‌కు 401 పార్లమెంటు సీట్లు రావటంతో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా ఫిరాయింపుల నిరోధక చట్టం తెచ్చింది. ఆర్టికల్స్ 102(2), 191(2)లను చేర్చి పార్టీ ఫిరాయింపులకు పాల్పడినవారిని చట్ట సభ్యత్వానికి అనర్హులుగా చేసే అంశాలను పొందుపరిచి.. దీన్ని రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో చేర్చారు. తద్వారా ఫిరాయింపు ఫిర్యాదులపై స్పీకర్ లేదా ఛైర్మన్ తీసుకునే చర్యలను న్యాయస్థానాలు ప్రశ్నించటానికి వీల్లేకుండా చేశారు. దీనివల్ల, 52వ సవరణ ద్వారా వచ్చిన ఫిరాయింపుల వ్యతిరేక చట్టం.. చివరికి ఫిరాయింపుల ప్రోత్సాహక చట్టంగా మారింది. భజన్‌లాల్ ఉదంతం తర్వాత 1985లో వచ్చిన 52వ రాజ్యాంగ సవరణ లోపాలను అధిగమించి బలోపేతం చేసే ప్రయత్నంలో లోక్‌సత్తా 91వ రాజ్యాంగ సవరణను (2003) సాధించింది. 52వ రాజ్యాంగ సవరణ ద్వారా మూడోవంతు మంది సభ్యులు అంగీకరిస్తే తప్ప పార్టీ మారటం చెల్లదు. కానీ 91వ సవరణలో పార్టీ మారటం చెల్లాలంటే మూడింట రెండు వంతుల మంది ఒప్పుకోవాలి. దీంతో ఎంతోకొంత పరిస్థితి మెరుగవుతుందనుకున్నా, స్పీకర్ల నిర్వాకం వల్ల ఈ సవరణ కూడా పెద్దగా ఫలితాలనివ్వలేదు. స్పీకర్‌ల పక్షపాత రాజకీయాలపై అనేక ఉదాహరణలు కనిపిస్తుండటంతో, ఫిరాయింపులపై నిర్ణయాన్ని స్పీకర్‌కు కాకుండా ఎన్నికల సంఘానికి ఇవ్వాలని అప్పుడు కూడా లోక్‌సత్తా ప్రతిపాదించినా 91వ సవరణలో అందుకు చోటు కల్పించలేదు.

వల్ల రాజకీయ వారసత్వాలు అంతకుముందు కూడా ఉన్నా.. వైఎస్సార్, చంద్రబాబు ఈ విషయంలో అన్ని గీతలనూ చెరిపేశారు. వారసత్వ రాజకీయాన్ని అడ్డంపెట్టుకుని తన మామ ఎన్టీరామారావును గద్దె దించి చంద్రబాబు ముఖ్యమంత్రి పదవిని చేపట్టగా, ఆ తర్వాత వచ్చిన వైఎస్సార్ తన కుమారుడు వైఎస్ జగన్మోహనరెడ్డిని పార్లమెంటు సభ్యుడు చేయటం కోసం సిట్టింగ్ ఎంపీగా ఉన్న తన సోదరుడి చేత రాజీనామా చేయించటానికి కూడా వెనకాడలేదు. రాష్ట్ర విభజన జరిగాక.. 'అధికారంతో అవినీతి, అవినీతితో అధికారం, అవినీతి సొమ్మును– అధికారాన్ని కుటుంబ సభ్యులకు వారసత్వ ఆస్తిగా పంపిణీ చేయటం' చాలా సాధారణ ఆనవాయితీగా మారిపోయింది. తెదేపా, వైకాపాలకు తోడు తెలంగాణలో అధికారంలోకొచ్చిన మరో ప్రాంతీయ పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి కూడా కుటుంబ రాజకీయాలకు చిరునామాగా మారింది.

ప్రజల్లోని భావోద్రేకాలను, ప్రత్యేక పరిస్థితులు గదా అని చూపిన ఉదారతను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు పూర్తిగా దుర్వినియోగం చేశారు. తాము వీలైనంత ఎక్కువ కాలం అధికారంలో కొనసాగుతూ పెత్తనం చేయటంతోపాటు.. తదనంతరం తమ కొడుకులకు ముఖ్యమంత్రి పదవులను కట్టబెట్టటం, కూతురు, మేనల్లుడు, ఇతర బంధుగణానికి కీలకస్థానాలను అప్పచెప్పటం కోసం పచ్చిగా ఫిరాయింపులకు పాల్పడ్డారు. ఇందుకోసం.. ప్రజాస్వామ్యాన్ని, ఏ రాజ్యాంగం ద్వారా అధికారంలోకి రాగలిగారో ఆ రాజ్యాంగ విలువల్ని తుంగలోతొక్కారు.

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ అవినీతి, వ్యవహారశైలి పట్ల భయంతో ప్రజలు చంద్రబాబును ముఖ్యమంత్రి చేశారు. కానీ అధికారంలోకొచ్చి రోజులు కూడా గడవక ముందే చంద్రబాబు.. జగన్ పార్టీలోని వారందరినీ తెదేపాలోకి లాగటం మొదలుపెట్టారు. కాకపోతే పైకి కనిపించకుండా చేసేవారు. ఇటీవల వైకాపా గుర్తుమీద గెలిచినవారికి మంత్రివర్గంలో స్థానం కల్పించటం ఫిరాయింపుల బరితెగింపునకు పరాకాష్ఠ. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలను అధికార టీఆర్ఎస్ పార్టీ లాక్కున్నప్పుడు.. పార్టీ మారిన వాళ్ల చేత రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికలు పెట్టకుండా ఫిరాయింపులను ప్రోత్సహించటం ప్రజాద్రోహమని చంద్రబాబు విమర్శించారు. అదే చంద్రబాబు ఇప్పుడు అదే తరహాలో ఫిరాయింపులు, మంత్రివర్గ కూర్పు చేశారు. అక్కడో నీతి, ఇక్కడో నీతా? అని విమర్శిస్తున్నవారి మీద ఎదురుదాడి చేస్తున్నారు. 'అప్పటి పరిస్థితులు వేరు, ఇప్పటి పరిస్థితులు వేరు' అని బుకాయిస్తున్నారు. ప్రజాస్వామ్యం, ప్రజల తీర్పు, రాజ్యాంగం, విలువలు తనకిష్టమొచ్చినట్టు మార్చేసుకుంటే ఇక ఆ నాయకుడి దిగజారుడితనానికి అంతమేముంటుంది? ప్రజలు

### నోరు నొక్కేస్తున్న 'విప్'

91వ రాజ్యాంగ సవరణ వచ్చాకైనా విప్ జారీ పేరుతో చట్టసభ సభ్యుల స్వతంత్ర అభిప్రాయాలకు అడ్డుకట్టవేయటం తగ్గుతుందనుకుంటే అది మరింత పెరిగింది. విప్‌ను ధిక్కరించి ఓటింగ్‌కు హాజరు కాకపోయినా 52వ రాజ్యాంగ సవరణ ప్రకారం సభ్యత్వం రద్దవుతుంది. కానీ 91వ సవరణలో విప్‌ను ధిక్కరించటం వల్ల సభలో ప్రాతినిధ్యం పోవాలనే నిబంధన లేదు. ఈ వెసులుబాటు ఉన్నా.. కేంద్రీకృత పాలన, సొంత ఎస్టేటుల్లా పార్టీల నిర్మాణం వల్ల ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతల చేతుల్లో ఆయా పార్టీల సభ్యులు బందీలుగా మారారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీలో, పార్లమెంటులో సొంత ఆలోచనతో స్పందించే అవకాశమే లేకుండా పోయింది. పార్టీ అధ్యక్షుడు/అధ్యక్షురాలు మాట్లాడనివ్వకపోతే నోర్మూసుకు కూర్చోవాల్సిందే. ఉదాహరణకి, ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చంద్రబాబు నాయుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ తప్ప ఇంకెవరూ పెద్దగా మాట్లాడేదేమీ ఉండదు. వారిద్దరే సభ అనే పరిస్థితి కొనసాగుతోంది. అలాగే తెలంగాణలో కేసీఆర్ ఎవరి ముఖమైనా చూడకూడదనుకుంటే.. వారిని సభ నుంచి సమావేశాలు అయ్యేంత వరకూ బహిష్కరించేలా చేయగలరు. నచ్చినవారే కాదు, నచ్చినట్టే మాట్లాడటం కూడా అవసరమని గుర్తుంచుకుని సభ్యులు మసలుకోవాలి. కాస్త అటూఇటుగా ప్రస్తుత పార్లమెంటులో కూడా ఇదే జాడ్యం కొనసాగుతోంది. ప్రభుత్వంలాగే పార్టీల్లో కేంద్రీకృత నిర్మాణం వల్ల తలెత్తిన దుష్పరిణామమిది.

అందుకే 91వ రాజ్యాంగ సవరణ తేవటానికి స్వయంగా కృషి చేసినా కూడా.. అందులోని లోపాల్ని జేపీ తరచూ విమర్శిస్తుంటారు.

ఓటు వేశారు కాబట్టే, రాజ్యాంగం ఉంది కాబట్టే.. తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది, ప్రజల ఓటుతో సంబంధం లేదంటే, ఇక ఆయన ముఖ్యమంత్రి కూడా కానక్కర్లా అని రేపు ఎవరైనా అడ్డగోలుగా వాదించవచ్చన్న శంక కూడా చంద్రబాబుకు కలగటం లేదు.

ఎన్నికలను డబ్బు రాజకీయంగా మార్చేసి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే దుష్టసంప్రదాయానికి కేంద్రంగా మార్చింది చంద్రబాబు అనటంలో సందేహం లేదు. కానీ మరీ ఇంత పచ్చిగా ఫిరాయింపులను ప్రోత్సహించే స్థాయికి దిగజారటం మాత్రం కొంత దిగ్భ్రమనే కలిగిస్తుంది. ఎందుకిలా? అంటే.. తెలుగుదేశం పార్టీ అనే కంపెనీ ద్వారా వంశపారంపర్య రాజకీయాలు చేయటం కోసం! వ్యక్తిగత ఆస్తులకు, అధికారంలో కొనసాగటానికి తన పార్టీకి ఎటువంటి ఢోకా లేకపోయినా.. ముస్ముందు తన కుమారుడు లోకేష్‌ను ముఖ్యమంత్రి చేయటానికే చంద్రబాబు ఇంతకు బరితెగించారు. తన వ్యక్తిగత లక్ష్యం కోసం.. తెలుగుదేశం తప్ప రాష్ట్రంలో మరే పార్టీ లేకుండా చేయాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండగా చేయలేదా? కేసీఆర్ చేయలేదా? జగన్ పార్టీ చేయలేదా? అంటూ సమర్థించుకోచూస్తున్నారు. తెలుగుదేశం పార్టీ తప్ప వేరే ఏ పార్టీ లేదన్న భావన కల్పించటం కోసం ఇప్పటిదాకా ప్రత్యేక హోదా సహా ఏ కీలక సమస్య మీద కూడా చంద్రబాబు అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయలేదు. తెలుగుదేశం పార్టీని బలంగా తయారుచేసి, కొడుక్కి ఆస్తులతోపాటు అధికార పీఠాన్ని అందించటంలో భాగంగానే ఆయన ఇవన్నీ చేసుకుంటూ వస్తున్నారు. తెలంగాణలో లోకేష్‌ను పెంచుదామని తొలుత భావించినా, ఓటుకు కోట్లు కేసుతో కథ అడ్డం తిరగటంతో చంద్రబాబు మనసు మార్చుకున్నారు.



ఇవి నా అక్రమాస్తులు కావు. మా నాన్నగారు అక్రమంగా సంపాదించి ఇచ్చాడు. అవి మాత్రమే నావి.

### పుట్టుకను బట్టే అవకాశం వచ్చిందని లోకేషే ఒప్పుకున్నారు

లోకేష్ రాజకీయాలలోకి రావటాన్ని మనమేమీ వ్యతిరేకించనక్కర్లా. ఓసారి జేపీని లోక్‌సత్తా పార్టీ సమావేశంలో ఓ మహిళ ప్రశ్నించింది. "మహిళలు రాజకీయాల్లోకి రావాలని మీరు చెబుతుంటారు, వచ్చినవారికి మంచి అవకాశాన్ని, పనిచేసేందుకు సంస్కారపూరితమైన వాతావరణాన్ని కూడా లోక్‌సత్తాలో కల్పిస్తున్నారు. ఇది గొప్ప విషయమే. కానీ మీ ఇంట్లో మహిళల్ని మాత్రం రాజకీయాల్లోకి ప్రోత్సహించరా?".

దీనికి జేపీ సమాధానం చెబుతూ, "రాజకీయాల్లోకి రావటం, రాకపోవటం వాళ్ల ఇష్టం. వస్తే మంచిదనే అనుకుంటాను. కానీ

## అరుణాచల్‌ప్రదేశ్‌లో బీజేపీ నిర్వాకం

సుపరిపాలన అందిస్తామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రులు, చివరికి ప్రధానమంత్రి పార్టీ కూడా ఈ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. ఓటు వేయటం తప్ప మీకేం అధికారం లేదంటూ ప్రజాస్వామ్యంలో సార్వభౌములైన ప్రజల్ని అవమానిస్తున్నారు. 2016 జులైలో అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా నియమితుడైన పెమా ఖండూ రెండు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీని ఖాళీ చేసి.. పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ (పీపీఏ)లో చేరారు. కాంగ్రెస్‌కు 45మంది సభ్యులుంటే.. 44మందితో ఖండూ పీపీఏలో చేరారు. మాజీ ముఖ్యమంత్రి నబోమ్ టుకీ ఒక్కరే కాంగ్రెస్‌లో మిగిలిపోయారు. పీపీఏ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి మిత్రపక్షం. 60 అసెంబ్లీ స్థానాలున్న అరుణాచల్‌లో ప్రజలు 2014లో కాంగ్రెస్‌కు మూడింట రెండొంతుల కంటే ఎక్కువే మెజారిటీ ఇచ్చారు. అవకాశవాద రాజకీయాల్లో ఆరితేరినవారు ఈ విస్పష్ట ప్రజాతీర్పును నిస్సిగ్గుగా కాలరాశారు. తాజాగా ఎన్నికలు జరిగిన మరో ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో కూడా ఇదే తరహాలో ఫిరాయింపులను బీజేపీ ప్రోత్సహిస్తోంది.

జేపీ కుటుంబసభ్యులు కాబట్టి అవకాశాలు మాత్రం ఎవరికీ ఉండవు. మిగతావారిలా పనిచేయాల్సిందే. సామర్థ్యముంటే వేగంగా ఎదిగే అవకాశాలు లభిస్తాయి. లోక్‌సత్తా జేపీ ఆస్తి కాదు, ప్రజల ఆస్తి అని ఎప్పుడో చెప్పాను" అన్నారు.

మరి నారా లోకేష్‌కి ఏ సామర్థ్యముందని ఇంత వేగంగా అవకాశాలు కల్పించారు. తనకంత సీన్‌లేదని ఇటీవల లోకేషే స్వయంగా ఒప్పుకున్నారు. లోకేష్ బాబు ఎమ్మెల్సీ, మంత్రి పదవులను అలంకరిస్తున్న సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్‌లో 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే' కార్యక్రమాన్ని నిర్వహించారు. లోకేష్ ఎంత తన హృదయాన్ని తెరిచారోగానీ, కార్యక్రమాన్ని ప్రజంట్ చేసిన ఛానల్ ఎండీ, సీనియర్ జర్నలిస్టు వేమూరి రాధాకృష్ణ (ఆర్కే) మాత్రం ఎంతో ఉదారంగా తన హృదయాన్ని తెరిచి మరీ లోకేష్‌ను పైకెత్తటానికి ఆరాటపడ్డారు. 'లీడర్రా బుజ్జీ' అనిపించేలా లోకేష్‌ను చూపేందుకు ఆర్కే ఎంత తాపత్రయపడి ప్రశ్నలడిగినా పెద్దగా పండలేదు. 'మీ నాన్న ముఖ్యమంత్రి కాబట్టి మీకు అవకాశమొచ్చింది అంటే కాదనగలరా?' అని చివరికి ఆర్కే అడిగారు. ఎన్టీఆర్ మనవడు, చంద్రబాబు నాయుడు కుమారుడు, బాలకృష్ణ అల్లుడు కాబట్టి తనకు అవకాశమొచ్చిందనే మాటను లోకేష్ తోసిపుచ్చలేదు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను అని మాత్రమే ముక్తాయించారు. తెలుగుదేశంలో తనకంటే సమర్థులు, నిజాయతీపరులు, యువకులు పలువురు ఉన్నారని లోకేష్‌కి స్పష్టంగా తెలుసు. అయినా అవకాశాలు ఇవ్వటమే అప్రజాస్వామికం, పెత్తందారీ రాజకీయం. లోకేష్ అసమర్థుడని అనటం లేదు. ఆయన హెరిటేజ్‌లో డైరెక్టర్‌గా మంచి లాభాలనే చూపించారు. కానీ జన రాజకీయాల సంగతి అలా వుంచి.. సాంప్రదాయ రాజకీయాలకు కూడా ఇప్పట్లో ఆయన స్థాయి పనికిరాదు. లోకేష్‌ను సమర్థుడిగా ముఖ్యమంత్రి పీఠంలో కూర్చోపెట్టి అతుక్కుపోయేలా చేయటానికే చంద్రబాబు అన్నిటికీ తెగిస్తున్నారు.




### ఏముందని తొలి సమావేశాలు గర్వకారణం?

భవనాలు కట్టే బిల్డర్ పని చేయటాన్ని కూడా ఘనకార్యంగా ప్రమోట్ చేసుకుంటూ అమరావతిలో శాసనసభ నిర్మాణం గురించి చంద్రబాబు గొప్పలు చెప్పుకున్నారు. కానీ శాసనసభలో అసలు చేయాల్సిన పని.. 'నిర్మాణాత్మక చర్చ' దగ్గరకొచ్చేసరికి తుస్సుమనిపించారు. ప్రజలకు అవినీతి లేకుండా, ఎమ్మెల్యేల మీద ముఖ్యమంత్రి అతిగా ఆధారపడాల్సిన అవసరం లేకుండా, ఎన్నికలలో ఖర్చు భారం కాస్త తగ్గేలా చేయగల హక్కుగా 'పౌర సేవల' చట్టం వంటివి చేసినా తొలి శాసనసభా సమావేశం చరితార్థమై ఉండేది. కానీ ఫిరాయింపుదారులు, రచ్చ, కాగ్ కడిగేయటం వంటి వాటితో అమరావతిలో శాసన అరంగేట్రం వైఫల్యంగా మారింది. ఇంత జరిగినా శాసనసభా సమావేశాలు చరిత్రాత్మకంగా జరిగాయని బాకాలూదుకున్నారు. ప్రాచుర్య మీడియా అందదండలు అందుకు బాగా సహకరిస్తున్నాయి.

### చంద్రబాబు, లోకేష్ భజన చేస్తే చాలు..

అలాగే పార్టీ కోసం పనిచేసినవారిని ప్రజల కోసం పనిచేసినవారిగా చంద్రబాబు భ్రమింపచేస్తూ ప్రోత్సాహకాలు ఇస్తున్నారు. ఉగాది రోజున ప్రభుత్వం పురస్కారాలు ఇచ్చినవారిలో పలువురు.. ప్రజలకు కాకుండా చంద్రబాబు,

లోకేష్ బాబుకు నచ్చేలా తెలుగుదేశం పార్టీకి సేవలందించినవారేనని చెవులు కొరుక్కుంటున్నారు. జాతీయ మహిళా పార్లమెంటును అమరావతిలో జరిపిన తీరును ఆకాశానికెత్తేస్తూ, ఆహా, ఓహో అంటూ ఓ పాత్రికేయ పెద్దాయన రాసిన వ్యాసం చూశాక.. ఈయనకేదో పదవో, పురస్కార పత్రమో రాబోతోంది అని ఓ మిత్రుడు చేసిన ఊహ గురి తప్పకుండా కరెక్టయింది. ఆయనకు కూడా ఉగాది పురస్కారం వచ్చింది. పాపం ఆ పెద్దాయనకు ఆ అవార్డును అందుకునే అన్ని అర్హతలూ ఉన్నా, తెదేపా ప్రచార ఉచ్చులో చిక్కుకుని నిందను మూటగట్టుకున్నారు. సొంత ఆస్తులు, వంశపారంపర్య రాజకీయాల చుట్టూనే రాజకీయం చేస్తుండటం వల్ల.. ఇట్లాంటి పనులు, ఫిరాయింపు రాజకీయాలు, అమరావతిపై ఎన్నికలచ్చేదాకా కాలక్షేపం చేయటం, ఇతర ప్రాంతాలవారికి ఏదో చేస్తున్నట్టు ఊరించటం, తాయిలాలు, కానుకలు ప్రకటించటం, ఆర్భాటపు ఈవెంట్లు చేయటం తప్ప ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆదాయం పెంచే కార్యక్రమాలేవీ చంద్రబాబు చేయటం లేదు.

## తెలంగాణలో ఫ్యామిలీ డ్రామా

ఇక తెలంగాణలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు తన కుమారుడు తారకరామారావు (కేటీఆర్)ను పీఠం మీద కూర్చుండబెట్టటానికి ఎప్పటి నుంచో మొదలెట్టిన ప్రయత్నాల్ని ఇటీవల ముమ్మరం చేశారు. జనహిత పేరుతో సభల్ని నిర్వహిస్తూ కేటీఆర్‌ను వేగంగా ప్రమోట్ చేస్తున్నారు. లోకేష్‌తో పోలిస్తే కేటీఆర్ తెలివితేటలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఎన్నో రెట్లు ఎక్కువనటంలో సందేహం లేదు. 2016లో జరిగిన గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో కేటీఆర్ సారథ్యంలో తెరాస పార్టీ పెద్ద విజయాన్ని సాధించి 150లో 99 డివిజన్లను సాధించి అందరినీ ఆశ్చర్యపరచింది. ఈ విజయం వెనక కేటీఆర్ సామర్థ్యంతోపాటు.. తెలుగుదేశం పార్టీ నుంచి పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు తెరాసలోకి ఫిరాయించటం కూడా కారణం. క్షేత్రస్థాయిలో తెరాసను పటిష్టం చేసి వారసత్వంగా కొడుక్కి అప్పచెప్పేందుకు వీలుగా ఫిరాయింపుల మార్గాన్ని ఎంచుకోవటానికి కేసీఆర్ తెదేపా సాకును చూపుతున్నారు.

## కొబ్బరి చెట్టు ఎందుకు ఎక్కావంటే..

2014లో తెలంగాణలో తెరాస ప్రభుత్వం ఏర్పడగానే దెబ్బకొట్టటానికి చంద్రబాబు నాయుడు పెద్దఎత్తున ఆపరేషన్ ఆకర్ష్‌ని ప్రారంభించారని, కోట్లు పంచారని కేసీఆర్ అన్నారు. నామినేటెడ్ శాసనసభ్యుడు స్టీఫెన్సన్ ఓటును ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొనుగోలు చేసేందుకు ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ద్వారా రూ.5కోట్లు ఆఫర్ చేసి చంద్రబాబు అడ్డంగా బుక్ అయ్యారు. ఫోన్‌లో స్టీఫెన్సన్‌తో బేరం గురించి మాట్లాడిన గొంతు తనది కాదని ఆయన ఇప్పటిదాకా చెప్పలేదు. అంత పక్కాగా సాక్ష్యాలను తెలంగాణ ప్రభుత్వం పట్టుకుంది. ఇలా తన ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నించటం వల్లే ఫిరాయింపులు ప్రారంభించామని, ఫిరాయింపుకి ఫిరాయింపుతోనే సమాధానం చెప్పామని కేసీఆర్ బుకాయించటం ప్రారంభించారు. జగన్ తమ ఎమ్మెల్యేలను లాక్కుని ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నందు వల్లే వైకాపా నుంచి ముందుగానే శాసనసభ్యుల్ని లాక్కున్నామని ఏపీలో చంద్రబాబు బుకాయించటం, ఎన్నికల్లో గెలవగానే చంద్రబాబు ఫిరాయింపుల్ని 'తెర వెనక నుంచి' ప్రోత్సహించటం వల్లే జగన్ దూకుడుగా వ్యవహరించారని వైకాపా అనటంలాంటిదే కేసీఆర్ బుకాయింపు కూడా! 'కొబ్బరి చెట్టు ఎందుకు ఎక్కావంటే.. దూడ మేత కోసం' అన్న చందంగానే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ ప్రజల్ని మోసం చేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీని పూర్తిగా ఖాళీచేయించేందుకు, ఓటర్లకు తెదేపా ఆప్షన్ లేకుండా చేసేందుకు దశలవారీగా కేసీఆర్ ప్రణాళికను అమలుచేస్తున్నారు. మంత్రిపదవులు, వ్యాపార లావాదేవీలు, ఇతరత్రా లాలూచీలతో తెదేపాలోని పలువురిని తెరాసలోకి లాగారు. మల్కాజిగిరి ఎంపీనీ ఆకర్షించారు. ఇంతటితో ఆగకుండా ఒకప్పుడు తెరాసను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించిన వైఎస్సార్ కుమారుడు జగన్ పార్టీలోని వారిని (ఇందుకు జగన్ కూడా పెద్దగా అభ్యంతర పెట్టలేదు), వామపక్ష పార్టీ వారిని కూడా అధికార పార్టీలోకి జమాయిస్తున్నారు. హరిహరాదులు వచ్చినా చంద్రబాబును ఓటుకు కోట్లు కేసు నుంచి తప్పించలేరు అని చెప్పిన కేసీఆర్.. ఆ తర్వాత ఓ బీజేపీ అగ్రనేత మధ్యవర్తిత్వంతో మెత్తపడ్డారని వినికిడి. నేను హైదరాబాద్ బాద్‌షాని, నువ్వు అమరావతి శాతకర్ణివి అనే రీతిలో ఇద్దరి మధ్య ఆ బీజేపీ నేత సంధి కుదిర్చాక.. కేసీఆర్, చంద్రబాబు సాంప్రదాయ, వంశపారంపర్య రాజకీయాలలో ఒకరినొకరు అనుకరిస్తూ ప్రశాంతంగా ఫిరాయింపు కార్యక్రమాలను అమలు చేసుకుంటున్నారు. వారి వారసులు కేటీఆర్, లోకేష్ కూడా అదేరీతిలో ఒకరినొకరు ప్రోత్సహించుకుంటున్నారు. ముఖ్యంగా లోకేష్ మంత్రిత్వశాఖల దగ్గర్నుంచీ కేటీఆర్‌ను ప్రమాణంగా తీసుకుంటున్నారు.

## లోకేష్ కంటే కేటీఆర్ బెటరే కానీ..

లోకేష్ కంటే కేటీఆర్ విషయపరిజ్ఞానంలో, ప్రజాసంబంధాల్లో, పార్టీ వ్యవహారాలు చక్కబెట్టటంలో దిట్టే అయినా.. ఇంతవరకూ తెలంగాణ ఉద్యమానికి తగ్గ స్థాయిలో రాష్ట్రానికి చేసిన మేలు శూన్యం! తాగునీరు, విద్యుత్ సరఫరా

## నీతులు చెప్పటానికే గవర్నర్

ఇక ఈ మొత్తం ఫిరాయింపుల ఎపిసోడ్‌లో సూత్రధారులు ఎవరైనా, చట్ట పరిధి పాత్రధారి మాత్రం రెండు తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్! క్రమం తప్పకుండా గుళ్లూగోపురాలను సందర్శించి దైవపూజలు చేస్తూ అధికారులను నిలదీస్తూ నీతులు చెబుతుండే ఈ గవర్నర్‌గారు.. తన బాధ్యత దగ్గరికొచ్చేసరికి మాత్రం మౌన ప్రేక్షకుడిలా మారిపోయారు. ముఖ్యమంత్రి ఎవరినైనా మంత్రిగా నియమించవచ్చు, సీఎం ఇచ్చిన జాబితా ప్రకారం మంత్రుల ప్రమాణ స్వీకారం చేయించటమే గవర్నర్ పని అని ఇక్కడ అనుకోవటానికి వీల్లేదు. వైకాపా నుంచి కూడా మంత్రివర్గంలోకి తీసుకునే అధికారం తెదేపా ముఖ్యమంత్రికి ఉంది. కానీ వాళ్లని ఆరకంగా కేబినెట్‌లోకి తీసుకోలేదని స్పష్టంగా కనిపిస్తోంది గదా! ఈ నేపథ్యంలో వాళ్ల రాజీనామాను స్పీకర్ ఆమోదించాకే వారి చేత గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించాల్సి ఉంటుంది. కానీ మన గవర్నర్ అలా చేయలేదు. గతంలో గవర్నర్‌గా ఉన్న ఎన్‌డీ తివారీ ఒకరకమైన అనైతికతకు పాల్పడితే, ప్రస్తుత గవర్నర్ మరో రకమైన.. చెప్పాలంటే వ్యవస్థీకృత అనైతికతకు పాల్పడ్డారు. సమాజానికి కృత్రిమ విలువలు లేకపోతే.. ఈపాటికే గవర్నర్‌కి అనేక ప్రశ్నలు ఎదురయ్యేవి. గవర్నర్ పదవిలో కొనసాగటానికి ఓటుకు కోట్లు కేసులో మౌనం వహించటం, ఫిరాయింపుదారులను మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించటం వంటివి నరసింహన్ అలవోకగా చేసేస్తున్నారు. చిత్తశుద్ధిలేని శివపూజ చేస్తున్నారు. ఎన్నికల సంఘం పర్యవేక్షణలో ఫిరాయింపుదారులపై చర్య తీసుకోకతప్పని పరిస్థితిని గవర్నర్‌లకు కల్పించటమే ఇలాంటి వ్యవస్థలో మార్గం.



వంటి సేవలు, చెరువుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాల్లో చెప్పుకోదగిన కృషి చేసినా.. మౌలికమైన మార్పును తెచ్చే ఒక్కటంటే ఒక్క అంశాన్ని కూడా ఆయన ఇంతవరకూ చేయలేకపోయారు. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉండి కూడా ప్రజల స్వయంపాలనకు కీలకమైన స్థానిక ప్రభుత్వాల సాధికారతకు ఇంతవరకూ ప్రయత్నం చేయలేదు. జేపీ లేఖ రాయటం, వ్యక్తిగతంగా తారసపడ్డప్పుడు, ఫోన్‌లోనూ చెబుతుండటంతో 'పౌర సేవల' చట్టానికి సూత్రప్రాయంగా అంగీకరించారుగానీ ఇంకా కొర్రీలు పెడుతున్నారు. గ్రామజ్యోతికి నిధుల వినియోగం లేదు. హైదరాబాద్ నగర పాలన తీసికట్టుగా మారింది. అవినీతి కట్టడి ప్రయత్నాలు లేవు. పైస్థాయిలో పర్సంటేజీలు, కిందిస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు యథేచ్ఛగా సాగుతున్నా స్పందన లేదు. ఏం చేస్తే భౌగోళిక తెలంగాణను జన తెలంగాణగా మార్చగలం అన్న ఆలోచనతో ప్రత్యేకించి కేటీఆర్ చేసింది శూన్యం. అందువల్ల లోకేష్ కంటే సమర్థుడు కావచ్చు కానీ, తెరాసలో కేటీఆర్ అన్ని రకాలుగా ముఖ్యమంత్రి పదవికి అర్హుడు అనుకోవాల్సిన పనిలేదు.

కేటీఆర్ కాకపోతే మేనల్లుడు హరీష్‌రావు (వారసత్వ పోరులో తనకు తగిన పదవి ఇవ్వకపోతే ఈయన బీజేపీలోనో, కాంగ్రెస్‌లోనో చేరటమో, వేరు కుంపటి పెట్టటమో చేస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి) లేకపోతే కుమార్తె కవితకు పదవి ఇవ్వటానికే కేసీఆర్ మొగ్గుచూపుతారు గానీ.. ఇతరులకు ఆ అవకాశం ఇవ్వటానికి అంగీకరించరు. దళితుడ్ని ముఖ్యమంత్రి చేస్తానని మాట తప్పిన వ్యక్తి వంశపారంపర్య రాజకీయాల కోసం ఈమాత్రం తెగించగలరనటంలో అనుమానం అక్కర్లేదు.

### విపరీత కేంద్రీకృత పాలన

రాష్ట్ర విభజన తర్వాత గందరగోళ పరిస్థితులను చక్కదిద్దుతున్నామన్న మునుగులోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఫిరాయింపుల పర్వానికి పెద్ద ఎత్తున తెరాస, తెలుగుదేశం పార్టీలు తెరతీశాయి. పార్టీని, అధికారాన్ని సొంత వ్యవహారంగా మార్చుకుని, సంపద పోగేసుకుని దీర్ఘకాలం ఎన్నికల్లో నెగ్గటం, తదనంతరం మొత్తాన్నీ కుటుంబ సభ్యులకు బదలాయించటం లక్ష్యంగా.. ముఖ్యమంత్రులు తమ చుట్టూ అధికారాన్ని విపరీతంగా కేంద్రీకరించుకోవటం మొదలుపెట్టారు. దీని వల్ల స్థానిక అవసరాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీ పనుల కోసం తమ మీద ఆధారపడుతున్న ప్రజలలో ఎమ్మెల్యేల ప్రాబల్యం ఇంకా ఎక్కువైపోయింది.

ప్రత్యర్థి పార్టీకి అవకాశమే లేకుండా సాధ్యమైనంత ఎక్కువమంది ఎమ్మెల్యేలను ఆకర్షించి రాజకీయాలను కుటుంబ ఆస్తిగా మార్చుకోవాలన్న ముఖ్యమంత్రుల కోరిక, గెలవటానికి కోట్లు ఖర్చు చేయటమేకాకుండా మనుగడకు కూడా కోట్లు ఖర్చు చేస్తున్న పలువురు ఎమ్మెల్యేలకు ప్రభుత్వంతో భారీ అవసరాలు.. కలగలిసి ఫిరాయింపులు జోరందుకున్నాయి. గంపగుత్త ఫిరాయింపుతో ఒకప్పుడు దేశాన్ని దిగ్భ్రమకు గురిచేసిన హర్యానా ముఖ్యమంత్రి భజనలాల్ 2.0 వెర్షన్‌లా

## 2014 ఎన్నికలకు ముందే నాటిన విషబీజాలు

చంద్రబాబు నాయుడు 2014లో ఎన్నికల్లో గెలిచిన వెంటనే పార్టీల ఫిరాయింపుల కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఏకైక ప్రతిపక్షం వైకాపా నుంచి ఎంపీల్ని ఆహ్వానించారు. అయితే అంతా అనధికారికంగా, పైకి కనిపించకుండా. ఆ క్రమంలోనే హైదరాబాద్‌లో ఒక తెలంగాణ ఎమ్మెల్సీని కొంటూ అడ్డంగా దొరికారు. అదే ఓటుకు కోట్లు కేసుగా దేశచరిత్రలో పేరుమోసింది. ప్రజలకు అర్థంకాలేదుగానీ, అసలు ఎన్నికలకు ముందే ఒకరకంగా ఈ ఫిరాయింపులకు చంద్రబాబు బీజం వేశారు. తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఒక పార్టీలో భారీ అవినీతికి, అనైతిక కార్యకలాపాలకు పాల్పడిన నేతల్నే తెలుగుదేశంలో చేర్చుకుని టికెట్లిచ్చారు. ప్రజాజీవితాన్ని ఛిన్నాభిన్నం చేసే వాగ్దానాలు, రకరకాల సమీకరణాలకు తోడు.. ఇలాంటి నేతల నుంచి వసూలు చేసిన వేలకోట్ల డబ్బును ఖర్చు చేసి గెలిచారు. పార్టీలకన్నా గెలుపే ముఖ్యం అని ఎన్నికలకు ముందే మొదలైన ఈ ధోరణి గెలిచాక ఫిరాయింపుల రూపంలోకి మారింది. పార్టీలు వేరు అని భావించి ప్రజలు ఓట్లు వేశారుగానీ, ఆ పార్టీల నాయకులకు అవేమీ లేవని తెలుగునాట 2014 ఎన్నికలు స్పష్టంగా రుజువుచేశాయి. సాగునీటి కాంట్రాక్టుల దగ్గర్నుంచీ రకరకాలుగా ఈ ఫిరాయింపు నేతలు రాష్ట్రాన్ని పిండుకుంటున్నారు. విషబీజాలు నాటితే అమృత ఫలాలు రావుగా! విధానాలను బట్టి కాకుండా అధికారం, అవకాశం కోసమే వాళ్లు పార్టీల్లో చేరుతున్నారు. ఇదేసమయంలో తెలంగాణలో కేసీఆర్ బాహాటంగానే ఫిరాయింపులకు తెరతీశారు. వైకాపా నేత వైఎస్ జగన్ గెలిచినప్పుడు ఆయన అవినీతి ప్రజలు ఆమోదించినట్టు కాదని వాదించినవారు కూడా.. హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తెరాస గెలిచాక ఫిరాయింపులకు ప్రజలు ఆమోదం తెలిపారని సూత్రీకరించారు. ఆహా, ఏమి నాయకత్వ చాతుర్యం అని కేసీఆర్ చర్యలను ప్రశంసించారు.

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రశేఖరరావు, చంద్రబాబు నాయుడు తయారయ్యారు.

- ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రలోభాలతో 66మందిలో 21మంది వైకాపా ఎమ్మెల్యేలకు తెలుగుదేశం కండువా కప్పారు (నంద్యాల ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి మృతితో ఫిరాయించిన ఎమ్మెల్యేలు ఇప్పుడు 20మంది ఉన్నారు). వీటిపై ఫిర్యాదులను స్పీకర్ నానుస్తున్నారు.
- తెలంగాణలో కేసీఆర్ 15మందిలో 12మంది తెదేపా ఎమ్మెల్యేలను చేర్చుకుని కొందరికి మంత్రిపదవులు కట్టబెట్టారు. ఇక్కడా స్పీకర్ వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారు.

దీంతో.. 'క్షమించాలి! ఇప్పుడు మీరు ఏ పార్టీలో ఉన్నారు?' అని ఇప్పుడు మన తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిపక్ష ప్రజాప్రతినిధులలో పలువురిని అడగాల్సి వస్తోంది.

ఇలా 'దీర్ఘకాలం అధికారంలో ఉండటం, సంపద పోగేసుకోవటం, వంశపారంపర్యంగా ఆ రెంటినీ అందించటం కోసం.. పార్టీని, ప్రభుత్వాన్ని మరింత కేంద్రీకరించటం - ఫిరాయింపులకు పాల్పడటం' ఇప్పుడు కలగలిసి తెలుగు రాష్ట్రాల రాజకీయాన్ని మరింత విషపూరితంగా మార్చాయి.

### నిజాయతీపరులు గెలవలేని ఎన్నికల వ్యవస్థతో వారికి రాచబాట

ముఖ్యమంత్రుల చుట్టూ కేంద్రీకృత పాలన, డబ్బే ఎన్నికలు అనే వ్యవస్థలో మనుగడ సాగించలేక సమర్థులు, నిజాయతీపరులు రాజకీయాలకు క్రమంగా దూరమైపోవటంతో వారసత్వ రాజకీయాలకు ఆటంకం లేకుండా పోయింది. వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా లోక్‌సత్తా పార్టీ 2008లో ఖైరతాబాద్, తెర్లాం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, తెదేపా, తెరాసకి వ్యతిరేకంగా పోటీచేస్తే.. "వంశపారంపర్య రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడటం మంచిదేగానీ, లోక్‌సత్తాది తొందరపాటు చర్య. ఇది ఇప్పుడే చేయాల్సింది కాదు" అని సీపీఎం సీనియర్ నేత రాఘవులు వ్యాఖ్యానించారంటే, ఆ రాజకీయాలు ఎంతలా సమాజంలో పాతుకుపోయి, మామూలే అనిపిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. భారతీయులు గర్వించదగ్గ తెలుగు రచయిత కేఎన్‌వై పతంజలి కూడా ఓ ప్రముఖ పత్రిక ఎడిటర్‌గా.. వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా లోక్‌సత్తా చేస్తున్న పోరాటాన్ని విమర్శిస్తూ సంపాదకీయం రాశారు.

కానీ ఈ జాడ్యాన్ని వదిలించుకోకపోతే, ఈ దేశంలో సమర్థులైన సామాన్య యువతకు రాజకీయాలలో వేగంగా ఎదిగే అవకాశాలు రావు. అలా రాకుంటే, ఇక ఈ ప్రజాస్వామ్యం ఎదగదు. మరోసారి భారతదేశం ఉచ్ఛస్థితిని అందుకునే అవకాశాన్ని కోల్పోవలసి వస్తుంది. డేవిడ్ కేమరాన్ 40వ పడిలోనే బ్రిటన్ ప్రధానమంత్రి కాగలిగారంటే, ఆయనకు నాలుగైదేళ్లలో వేగంగా ఎదిగే అవకాశాల్ని అక్కడి రాజకీయ వ్యవస్థ కల్పించింది. పరిణతి చెందిన ప్రజాస్వామిక దేశాలలో యువతకు ప్రత్యేకించి అనుబంధ విభాగాలు ఉండవు. వాటి అవసరం కూడా లేదు. సమర్థత, నిజాయతీ గల యువతీయువకులు అవరోధాలు లేకుండా ఎదగటానికి అక్కడ

అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. వంశపారంపర్య రాజకీయాల స్థానంలో యువభారతానికి అలాంటి అవకాశాలు కల్పించకపోవటం వల్ల.. అథమ, అప్రజాస్వామిక రాజకీయ శక్తులు రాజ్యమేలటం కొనసాగుతోంది.

**నోట్లవాడ షాకర్.. డబ్బు ప్రభావాన్ని దాటాలంటే సంస్కరణలే శరణ్యం**

పేరుకు మనదేశంలో రాజకీయ స్వేచ్ఛ ఉంటుందిగానీ, డబ్బు లేకపోతే ఎన్నికలలో పోటీ చేసే అవకాశాలు దాదాపు ఉండవు. గుడివాడలో 19వ వార్డుకు ఏప్రిల్, 2017లో జరిగిన ఉప ఎన్నికలో అభ్యర్థులు రూ. 3.5 నుంచి 4.5 కోట్ల దాకా (ఇందులో 80శాతానికిపైగా ఓట్ల కొనుగోలుకే) ఖర్చు చేశారని , ఎటువంటి అధికారాలూ లేని కౌన్సిలర్ పదవికి ఓటుకు రూ. 15,000 దాకా పంచారని (తెదేపా, వైకాపా కలిపి) మీడియాలో వార్తలు వచ్చాయి. తమిళనాడులోని ఆర్కేనగర్ ఉప ఎన్నికలో ఓటుకు అధికార పార్టీ నేతలు రూ. 4,000 చొప్పున ఇచ్చారని, 89కోట్లు ఖర్చు పెట్టారని వచ్చారని నోరెళ్లబెడుతున్న సమయంలోనే వచ్చిన గుడివాడ వార్డు వార్త ఇంకా పెద్ద షాకర్. భారతదేశంలోనే రికార్డు స్థాయి ఓట్ల కొనుగోలుతో గుడివాడను నోట్లవాడగా మార్చిన ఈ పరిణామం జాతీయస్థాయి వార్తగా మారకపోవటం విచిత్రం.. పరిస్థితి ఇంతగా పతనమైన ఈ దశలో వంశపారంపర్య రాజకీయాలు, ఫిరాయింపుల నుంచి మనదేశం బైటపడాలంటే ఎన్నికల వ్యవస్థను మార్చటం సహా కొన్ని కీలక సంస్కరణల్ని తెచ్చుకోవటం మినహా మార్గం లేదు. సరైన మార్పు దానంతటది సకాలంలో రావటానికి మనదేశంలోని అవిద్య, పేదరికం వల్ల సాధ్యం కాదు కాబట్టి.. ఈ సంస్కరణలే సరైన పరిష్కారం.

**ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక కీలక పరిష్కారం**

ఇందులో ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ఎన్నుకోవటమే కీలక పరిష్కారం. ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకోవాల్సి ఉంటే, ఎంత డబ్బున్న అభ్యర్థయినా వేలకోట్లు ఆ పదవి కోసం రిస్కు తీసుకోలేరు. ఎన్నికయ్యాక, ఎమ్మెల్యేలను కొనాల్సిన పరిస్థితి ఉండదు. ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రి పదవిలో ఐదేళ్లూ కొనసాగగలుగుతారు. అలాగే ఎమ్మెల్యేల నుంచే కాకుండా.. ప్రత్యక్షంగా ఎన్నికైన ముఖ్యమంత్రి సమాజంలోని అత్యుత్తములను (అమెరికా అధ్యక్షుడి తరహాలో) మంత్రివర్గంలోకి తీసుకోగలుగుతారు. దీనివల్ల మెరుగైన ప్రతిభాపాటవాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. ముఖ్యమంత్రి నియంతలా మారకుండా అసెంబ్లీ ద్వారా ఎమ్మెల్యేలు యధావిధిగా కట్టడి చేస్తుంటారు. దీంతోపాటు, ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే అనే ప్రస్తుత 'ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్' (ఎఫ్‌పీటీపీ) ఎన్నికల వ్యవస్థ స్థానంలో ప్రతి ఓటుకూ విలువనిచ్చే దామాషా ఎన్నికల పద్ధతిని రాష్ట్రాల్లో ప్రవేశపెట్టాలి. దీనివల్ల ఎన్నికలలో ఓట్ల కొనుగోలుకు, డబ్బు ఖర్చుకు కళ్లెం పడి, పార్టీలలో కూడా ప్రజాస్వామిక సంస్కృతి పెరిగి, అత్యుత్తమ యువత రాజకీయాలలోకి వచ్చి ఎన్నికలలో నెగ్గగలుగుతారు. ఫిరాయింపులకు నియంత్రణ ఏర్పడుతుంది.

**'పౌర సేవల' చట్టం**

మరోవైపు, ఎన్నికలలో ఏ పార్టీ గుర్తు మీద గెలిచినా, ఎమ్మెల్యేలందరి లక్ష్యమూ అధికార పార్టీగానే మారటానికి కీలకమైన పౌర సేవల వ్యవస్థను కూడా సంస్కరించాలి.

అసెంబ్లీకి ఎన్నికైన ప్రతినిధులకు చట్టాలు చేయటం తప్ప ప్రభుత్వంలో భాగంగా వ్యవహరించాల్సిన అవసరం ఉండదు. కానీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ జాగీరుదార్లుగా మారి ట్రాన్స్‌ఫర్లు, రోజువారీ ప్రభుత్వ సేవలు వంటి వాటినన్నింటినీ శాసిస్తుండటంతో ప్రభుత్వంలో భాగంగా మారటం వారికి ఓ అవసరంగా మారింది. అదేమంటే, ఎన్నికలలో బోలెడు డబ్బు పెట్టి గెలిచాం కాబట్టి, దండుకోవటానికి ఎమ్మెల్యే రాజ్యం ఉండాలిగానీ, బోడి అసెంబ్లీ ఎవడికి కావాలి అన్నట్టు మాట్లాడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు ఒక హక్కుగా చేయాల్సిన పనులను మీరు ఓటు/లంచాలు అడుగుతూ సిఫార్సుల ద్వారా చేస్తుంటే, మరి ప్రభుత్వోద్యోగులు ఏం చేస్తుంటారు? అది వాళ్ల పని కదా? అంటే మౌనం. అదంతే అన్నట్టు వ్యవహరిస్తారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా హక్కుగా సేవలు అందించేందుకు 'పౌర సేవల' (రైట్ టూ సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ) చట్టం తీసుకొస్తే ఎమ్మెల్యే రాజ్‌ని అంతం చేసి అధికారాన్ని స్థానిక ప్రభుత్వాలకు బదలాయించవచ్చు.

ఈ దేశాన్ని శాసిస్తోంది ప్రధాని మోదీయో, ఎంపీలో కాదు – ఎమ్మెల్యేలు శాసిస్తున్నారు!.. ఈ వాస్తవాన్ని మోదీ ఎంత త్వరగా గుర్తిస్తే అంత మేలు. జాతీయస్థాయిలో, రాష్ట్రాల్లో కూడా పౌర సేవల చట్టం అమలుచేసి, ఎమ్మెల్యేల విధులను, ప్రభుత్వ విధులను రాజ్యాంగంలో పేర్కొన్నట్టు వేరు చేయటం అవసరం.

ఇవన్నీ చేయకుండా.. నైతికతను అమలు చేయలేని నిస్సహాయ రాజకీయాలలో చిక్కుకున్నట్టు నటిస్తే, మున్ముందు సంక్షోభం ముదురుతుంది. ఈవేళ దేశంలో ఓట్లు, సీట్లు పొందిన పార్టీల మధ్య.. బీజేపీతో సహా, ఎటువంటి తేడా లేకుండా పోయింది. ఇది మున్ముందు ప్రజాస్వామ్యానికి పెనుప్రమాదంగా మారుతుంది. చెడ్డ రాజకీయాన్ని వీడలేక, మంచి రాజకీయాన్ని ఎన్నుకోలేక జనంలో గందరగోళం కొనసాగితే.. అవకాశాలు చేజారి కొత్త సమస్యలు తలెత్తుతాయి. తెదేపా, వైకాపా, తెరాస సహా సాంప్రదాయ పార్టీలు అంతరించి చివరికి రాజకీయాల్లోకి రోబోలు ప్రవేశించటం వంటి పరిణామాలు చోటుచేసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. పరిస్థితి చేజారకముందే పార్టీలు, పౌర సమాజం, మీడియా మేలుకోవటం మేలు. ఆ

# అక్కడా ఇక్కడా అదే ప్రహసనం..
# చెడును చెడు అని మీడియా అనకపోతే ఇంకెవరంటారు?

**- ఆలపాటి సురేష్ కుమార్,**
జర్నలిస్టు

రెండు తెలుగు రాష్ట్రాలలో వికృత రాజకీయ క్రీడ సాగుతున్నది. అభివృద్ధి ముసుగు తొలగించుకొని ప్రజాప్రతినిధులు నిస్సిగ్గుగా, నిర్లజ్జగా అధికార పక్షం చెంత చేరుతున్నారు. నిలదీసి అడిగే నాథుడు లేక ఈ ఫిరాయింపుల ప్రహసనం అడ్డూ ఆపూ లేకుండా రికార్డు స్థాయిలో కొనసాగుతోంది.

రెండు రాష్ట్రాలలోనూ ప్రాంతీయ పార్టీలే అధికారంలో ఉన్నాయి. అన్ని ప్రాంతీయ పార్టీలకుండే సహజ లక్షణాల ప్రకారం అటు టీఆర్ఎస్‌కు, ఇటు టీడీపీకి ఎదురులేని అధినాయకులు ఉన్నారు. వారి నాయకత్వానికీ, అధికారానికీ ఇప్పటికిప్పుడు వచ్చిన ప్రమాదమేమీ లేదు. అయినప్పటికీ తెలంగాణలో కేసీఆర్, నవ్యాంధ్రలో చంద్రబాబు నాయుడు జంకూ గొంకు లేకుండా ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు. అందుకోసం సామదాన భేద దండోపాయాలను ప్రయోగిస్తున్నారు.

అసాధ్యం అనుకున్న తెలంగాణ కలను సుసాధ్యం చేసిన తర్వాత నూతన రాష్ట్రంలో జరిగిన మొదటి ఎన్నికలలో 119 అసెంబ్లీ సీట్లకుగాను తెలంగాణ ప్రజలకు కేసీఆర్ పార్టీకి 63 సీట్లే అప్పగించారు. కేసీఆర్ బయటపడలేదుగానీ ఆయన మనస్తత్వానికి ఆ దెబ్బ సామాన్యంగా తగిలి ఉండదు. అందుకు ఆయన ఇప్పుడు ప్రతీకారం తీర్చుకుంటున్నారు. ప్రజల మీద కాదు, ప్రజలు ఎన్నుకున్న ప్రతిపక్షాల మీద.

తన చేష్టలను సమర్థించుకునేందుకు కేసీఆర్ చెబుతున్న మాట ఏమంటే, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దానిని కూలదోసేందుకు కుట్ర జరిగిందని. అది నిజమే అయి వుంటే ఆయన ఆ మాట అప్పుడే చెప్పాల్సింది, కుట్రదారులను ప్రజల ముందు నిలబెట్టాల్సింది. రెండేళ్ల తర్వాత ఆయన చెప్పే మాటలకు విలువ లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీకి గెలుపు సాధించిపెట్టిన చంద్రబాబుకు ఈ ఇబ్బంది కూడా లేదు. ప్రజలు ఆయనకు మంచి మెజారిటీ కట్టబెట్టారు. తెలంగాణలో టీడీపీ సభ్యులను నయానో భయానో టీఆర్ఎస్‌లోకి లాగుతూ ఉంటే ప్రజాస్వామిక విలువల గురించి మాట్లాడిన చంద్రబాబు, కాస్త ఆలస్యంగా తానూ అదే వికృత క్రీడకే తెరతీశారు. ఎంతోకొంత హుందాగా మసలుకుని, ఒక సమయంలో జాతీయ రాజకీయాలలో కూడా




కీలకపాత్ర పోషించిన చంద్రబాబు ఇప్పుడు సంయమనం కోల్పోయారు. రాజకీయాలలో మాటలను తూకం వేసి వదలాలన్న సంగతిని ఏనాడూ పట్టించుకోని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి వ్యవహారశైలి ఆయనను పురికొల్పింది. (అంతకుముందు శిల్పామోహన్‌రెడ్డి, ఓటుకు కోట్లు అంశాలలో కొంత రహస్య ధోరణి ఉన్నా) జగన్ మాటలకు లేనిపోని అర్థాలు ఊహించుకుని ఆయన ఫిరాయింపుల కత్తి బయటకు తీశారు.

ఎవరు ఏ కారణంతో పాల్పడుతున్నా ఫిరాయింపులకు సమర్థన అనేది ఉండదు, లేదు. తెలంగాణలో అధికార పక్షంలోకి ఫిరాయిస్తున్న ప్రతిపక్ష సభ్యులు బంగారు తెలంగాణ సాధన కోసం పార్టీ మారుతున్నామని అంటున్నారు. నవ్యాంధ్రలోని వారి సోదరులు అభివృద్ధి సాధన కోసమని చెబుతున్నారు. ప్రజలలో వ్యతిరేకత తగ్గించాలన్న ఉద్దేశంతో కాబోలు నియోజకవర్గం అభివృద్ధి అనే మాట కూడా చేరుస్తున్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం అధికార పక్షంలో చేరుతున్నామని ఎవరైనా అంటే ప్రతిపక్ష సభ్యులున్న నియోజకవర్గాలకు ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదనే అర్థం. అదే నిజమైతే ప్రతిపక్షం ఆ ప్రభుత్వం సంగతి తేల్చాలి. అలా చేయనపుడు ఆ ప్రతిపక్షం అధికారంలోకి వచ్చినపుడు తానూ అలాగే వ్యవహరిస్తుందని మనం అనుకోవచ్చు. అంటే అంతిమంగా నష్టపోయేది ప్రజలన్న మాట.

నిజానికి ఇక్కడ పనిచేస్తున్న చోదకశక్తి 'అభివృద్ధి' కాదు, .. ఆశ, అత్యాశ. అక్రమ ధన సంపాదనకు రాజకీయాలు

అన్నిటికన్నా దగ్గర దారి అనే దుస్థితి తాజా దిగజారుడుతనాన్ని మనం చూస్తున్నాం. ఎంత సంపాదించారన్నది తప్ప, ఆ సంపాదనకు అనుసరించిన మార్గాల మంచిచెడ్డల బేరీజు మాట మరచిపోయిన సమాజం దురవస్థ ఫలితాలను మనం అనుభవిస్తున్నాం.

తమ రాజకీయ దివాళాకోరుతనానికి రాష్ట్రాభివృద్ధి మంత్రాన్ని సిగ్గుబిళ్లగా అడ్డుపెట్టుకుంటున్న ప్రజాప్రతినిధులు గుర్తించాల్సిన విషయం ఒకటి ఉంది: అధికార పక్షాన్ని బలోపేతం చేసి ప్రతిపక్షాన్ని బలహీనపరచటం ద్వారా వారు ప్రజాస్వామ్య వ్యవస్థనే కాదు అభివృద్ధిని కూడా దెబ్బతీస్తున్నారు. ఎదురులేని బలం సంపాదించుకున్న ఏ ప్రభుత్వమూ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రగతిబాట పయనించిన దాఖలాలు చరిత్రలో పెద్దగా లేవు. 'అధికారం అవినీతికి దారి తీస్తుంది. అవధుల్లేని అధికారం అవధుల్లేని అవినీతికి దారితీస్తుంది'. నూటపాతిక ఏళ్ల క్రితం ఓ విజ్ఞుడు చెప్పిన మాట ఇది. ఇందుకు భిన్నంగా జరిగిన దాఖలా చరిత్రలో చూపగలమా? సరైన ప్రతిపక్షం లేని ప్రజాక్షేత్రంలో ఏర్పడే శూన్యాన్ని ఇతర శక్తులు భర్తీ చేసే ప్రమాదం కూడా ఉంది.

రెండు తెలుగు రాష్ట్రాలలో ఇంత విచ్చలవిడిగా ఫిరాయింపులు జరుగుతూ ఉంటే ఫిరాయింపుల నిరోధక చట్టం ఏమైనట్టు? దానిని అమలు చేయాల్సిన శాసనసభాధిపతులు ఏం చేస్తున్నట్టు? ఇది మరో విషాదం. నిజానికి ఈ చట్టం దాని స్ఫూర్తికి నిలబడిన సందర్భాలెన్ని? ఇప్పుడైతే, డజన్ల సంఖ్యలో ఫిరాయింపులు జరిగితే ఇంతవరకూ ఒక్కరంటే ఒక్కరిపైనన్నా అనర్హత వేటు పడలేదు.

రెండు రాష్ట్రాలలోనూ నేరుగా స్పీకర్ దగ్గరకు వెళ్లి రాజీనామా ఇచ్చి అక్కడికక్కడే దానిని ఆమోదింప చేసుకున్న 'అభివృద్ధి కాముకుడు' వీరిలో ఒక్కరూ లేరు. కొందరు రాజీనామా ఇచ్చి కూర్చున్నారు. కొందరు అదీ చేయలేదు. రాజీనామా లేఖలు, అనర్హత పిటిషన్లు నెలల తరబడి, ఏడాదికిపైగా స్పీకర్ల దగ్గర పెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణలో అయితే స్పీకర్ అన్నీ తన దగ్గర 'తగినంత' కాలం అట్టిపెట్టుకుని ఆనక ఓ శుభముహూర్తాన టీడీఎల్‌పీ టీఆర్ఎస్‌లో విలీనం అయినట్టు ప్రకటించేశారు. అంతకుముందు టీడీపీ సభ్యుడు తలసాని శ్రీనివాస యాదవ్ ఏడాదికిపైగా టీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగారు. తాను ఇచ్చిన రాజీనామాను ఆమోదించమని ఆయన స్పీకర్‌ను అడగలేదు, స్పీకర్ కార్యాలయంలో రాజీనామా పరిశీలన ఎంతకీ పూర్తికాలేదు. ఫిరాయించిన టీడీపీ సభ్యుల సంఖ్య టీడీఎల్‌పీలో మూడింట రెండు వంతులు దాటేంతవరకు ఈ తంతు సాగింది. ఆ తర్వాత ఒక్క దెబ్బకు ఫిరాయింపుదారులు దొరబాబులు అయిపోయారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో మెజారిటీ సాధించిన రాజకీయ పక్షం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. చట్టసభలో మెజారిటీ ఉంది కాబట్టి ఆ పార్టీ సభ్యుడే స్పీకర్‌గా ఎన్నికవుతారు. స్పీకర్ అనేది రాజ్యాంగబద్ధమైన పదవి కాబట్టి ఆ పదవిలో ఉన్నవారు పార్టీ రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి. కానీ మన మౌలంకర్‌లు, అయ్యదేవర కాళేశ్వరరావుల కాలంలో లేము. ఆ కాలంలో ఫిరాయింపుల నిరోధక చట్టమే అవసరం లేకపోయింది. ఈనాటి రాజకీయ విలువల మధ్య స్పీకర్ నుంచి మనం నిష్పాక్షిక న్యాయం ఆశించగలమా?

ఫిరాయింపుల నిరోధక చట్టం అమలు అధికారాన్ని స్పీకర్‌కు కట్టబెట్టటంలోనే అసలైన లోపం ఉంది. మొదట్లో ఈ చట్టం అమలు అంశాలపై అసలు న్యాయసమీక్షకే ఆస్కారం లేదు. తర్వాతికాలంలో సుప్రీంకోర్టు ఈ నిబంధన చెల్లదని ప్రకటించింది. అయితే ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి ముందు కాలవ్యవధిపై న్యాయసమీక్ష ఉండదని సుప్రీంకోర్టు తీర్మానించింది. అంటే ఇప్పుడు తెలంగాణ స్పీకర్ నిర్ణయం న్యాయ సమీక్షకు వెళ్లవచ్చుగానీ, ఆ నిర్ణయం రాకముందు ఆయన చేసిన జాప్యం న్యాయసమీక్షకు నోచుకోదు.

ఈ చట్టం వ్యవహారంలో 'విచక్షణ'కు ఎంత తావు ఉందీ దీనిని బట్టి అర్థం అయిపోతుంది. ఫిరాయింపుల నిరోధక చట్టం అమలు ప్రక్రియ న్యాయసమీక్షకు అతీతం అన్న దగ్గర్నుంచి ఇక్కడి వరకూ రావడం గుడ్డిలో మెల్ల మాత్రమే. ఈ చట్టం అమలు స్పీకర్ 'విచక్షణ'కు లోబడి వుండటం ఏమాత్రం సరికాదు. ఉత్తమ సంప్రదాయాలు, విలువలు సుప్రతిష్టమైన చోట విచక్షణ వన్నెకెక్కుతుంది. అసలు లోపం ఇదే. ఒక చట్టం అమలును విలువలకు, సంప్రదాయాలకు వదిలిపెడతామా! విలువలు ఎల్లకాలం పలచనకాకుండా ఉంటాయా? అందుకే ఫిరాయింపుల నిరోధక చట్టం అమలు అధికారం స్పీకర్ చేతిలో ఉండటం పైనే పార్లమెంటు దృష్టి సారించాలి. సారించకపోయిన పక్షంలో ఈ విషయం న్యాయసమీక్షకన్నా వెళ్లాలి.

మెజారిటీ రాజకీయాల సంకుచిత కోణానికి లొంగిపోయే శాసనవ్యవస్థ, ఆ శాసనసభలో మెజారిటీ ద్వారా అయిదేళ్లు పాలించే అధికారాన్ని చేజిక్కించుకున్న రాజకీయ కార్యనిర్వాహక వ్యవస్థ, ఆపై న్యాయవ్యవస్థ.. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన ఈ మూడు వ్యవస్థలూ ఫిరాయింపుల నిరోధక చట్టం స్ఫూర్తిని కాపాడటంలో విఫలమవుతున్నాయి. మన రాజ్యాంగం 'రీకాల్' సదుపాయాన్ని కల్పించలేదు కాబట్టి ప్రజలు ఈ విషయంలో నిస్సహాయులు. ప్రజలకు మరో ప్రత్యామ్నాయం లేదన్న సంగతి తెలును కాబట్టే రాజకీయ నాయకులు ఎంతటి దిగజారుడుతనానికైనా తెగిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్యానికి నాలుగో ఊతం అయిన మీడియా ఏం చేస్తున్నట్టు? ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం అటు తెలంగాణలో, ఇటు నవ్యాంధ్రలో అడ్డగోలుగా సాగుతున్న ఫిరాయింపుల విషయంలో మీడియా 'లేఖకుడి'కి మించి పాత్ర పోషించేందుకు తయారుగా లేదు. ఇది ప్రేక్షక పాత్రతోనే సమానం. ఈ ఫిరాయింపుల ప్రహసనాన్ని నిశితంగా విమర్శిస్తూ మీడియాలో సంపాదక వ్యాఖ్యలు రావడం లేదు. చెడును చెడు అని మీడియా అనకపోతే ఇంకెవరు అంటారు?

ఫిరాయింపుల బరితెగింపు మీద కాస్త ఆలస్యంగానైనా రెండు తెలుగు రాష్ట్రాల పౌరసమాజాల్లో కదలిక వచ్చింది. అయితే ఈ జాడ్యానికి వ్యతిరేకంగా బలమైన ప్రజాభిప్రాయాన్ని నిర్మించడం ఒక్క పౌరసమాజం వల్లనే సాధ్యం కాదు. ఈ ప్రయత్నాలకు మీడియా నాయకత్వం వహించాలి. ఇంకుడు గుంతలు తవ్వాలంటూ మొక్కలు నాటాలంటూ ఉద్యమాలు నడిపే మీడియా, మొత్తం ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం చేస్తున్న ఫిరాయింపులకు వ్యతిరేకంగా ఒక ఉద్యమ పిలుపునివ్వొచ్చు గదా! ఇప్పుడున్న పరిస్థితుల్లో తెలుగు మీడియా నుంచి ఇలాంటి మేలుకొలుపు ఆశించటం అత్యాశే. అయినా అనుకోకుండా ఎలా ఉండగలం?

పరిస్థితి చూస్తుంటే, ఇక ఫిరాయింపులు ఆగిపోయాయిలే అనుకునేందుకు వీలు లేకుండా ఉంది. అధికార పక్షం దాడికి నవ్యాంధ్రలో వైఎస్సార్ కాంగ్రెస్, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విలవిలలాడిపోతున్నాయి. నియోజకవర్గంలో తనను గెలిపించిన మెజారిటీ ఓటర్ల అభిమతానికి విరుద్ధంగా పార్టీ ఫిరాయించిన శాసనసభ్యులకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు ఆ పార్టీలు క్షేత్రస్థాయిలోకి వెళ్లలేకపోతున్నాయి. రాజకీయ పార్టీలో, పౌర సమాజమో, మీడియానో, ఎవరో ఒకరు వెళ్లాల్సిన అవసరం అయితే ఎంతైనా ఉంది. ప్రజల గొంతుక పైకి వినబడకపోయినా అసహ్యకరమైన ఈ పరిస్థితిని వారు ఛీకొడుతున్నారు. ఆ గొంతుకలను బయటకు తీసుకురావాలి. అందరూ కలిసి 'చెడు'ను 'చెడు' అని ప్రకటించాలి. 'బంగారు' పూత పూసినంత మాత్రాన, 'అభివృద్ధి' చెమ్కీలు అద్దినంత మాత్రాన రాజకీయ వ్యభిచారం పాతివ్రత్యంగా మారిపోదని నొక్కి వక్కాణించాలి.

(కర్టెసీ: ఆంధ్రజ్యోతి)


# ప్రజారోగ్య సంక్షోభం పాలకుల పాపమే!



రాష్ట్రంలో, దేశవ్యాప్తంగా కూడా వైద్యసేవలు అందించటంలో పాలకులు విఫలమయ్యారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. తమకు తలనొప్పి వస్తే ఎయిమ్స్, సూపర్ స్పెషాలిటీలు.. జనానికి జబ్బు చేస్తే మాత్రం యోగా అన్నట్టు ప్రధానమంత్రి, మంత్రులు వ్యవహరిస్తున్నారన్నారు. కేంద్రంలాగే ఏపీ ప్రభుత్వం కూడా బీమా చుట్టూ ఆరోగ్య పథకాలను అల్లుతోందని, ఇది తర్వాతికాలంలో మోయలేని భారంగా మారి ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. ఆరోగ్యరక్షకు 32 లక్షలమంది దరఖాస్తు చేసుకుంటారనుకుంటే, 1లక్ష మంది కూడా చేసుకోకపోవటానికి కారణమేమిటో చంద్రబాబు ప్రభుత్వంతోపాటు అన్ని రాజకీయ పార్టీలు, సమాజం ఆలోచించాలన్నారు. ఎదగటానికి కీలకమైన నాణ్యమైన వైద్యం, విద్య గురించి చర్చించటం, ఎన్నికలలో అడగటం వంటి సంస్కృతి లేని ఈసురోమనే స్థితిలో మన సమాజాన్ని దశాబ్దాలుగా కొనసాగిస్తున్నామన్నారు.

ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా పార్టీ నేతలతో కలిసి బాబ్జీ విజయనగరం జిల్లా కేంద్రాసుపత్రిని సందర్శించారు. వసతులు, ఆరోగ్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగుల సమస్యలను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదిక ప్రకారం, దేశంలో వైద్యసేవల కొరత భారీగా ఉందన్నారు. వైద్య కళాశాలల స్థాపన, ప్రభుత్వాసుపత్రులను ఆధునీకరించి పడకలను పెంచటం అవసరమని బాబ్జీ ఈ సందర్భంగా అన్నారు. ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలూ ఆరోగ్యరంగానికి జీడీపీలో 4 నుంచి 16శాతం దాకా ఖర్చు చేస్తుంటే, మనదేశం మాత్రం 1.1శాతం మాత్రమే వెచ్చిస్తోందన్నారు. ఆ డబ్బును కూడా అర్థరహిత స్కీములతో వృథా చేస్తోందన్నారు. ఏపీలో 31 ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాల్లో కనీస వసతులు కూడా లేవని 'కాగ్' ఎండగట్టిందని గుర్తుచేశారు. ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని జీడీపీలో 2-3శాతం వ్యయంతో అందించే విధానాన్ని లోక్‌సత్తా అందించిందని, దీన్ని అమలుచేస్తే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేతలు నాగభూషణం, చిన్నారావు, రాజారావు, సన్యాసినాయుడు, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# సభాపతి స్థానం సమస్యాత్మకం



- జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రాజకీయ పార్టీల మనుగడ మీద ఆధారపడి ఉంటుంది. ఆ పక్షాలు రెండు కావచ్చు, అంతకంటే ఎక్కువ ఉండవచ్చు. రెండు పక్షాలైతే నయం. అసలు రాజకీయ పక్షాలు లేని పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఎవరూ ఊహించలేరు. చాలా ప్రజాస్వామిక దేశాలు దిగువ సభల సభ్యత్వం కోసం పోటీ చేయడానికి ఇండిపెండెంట్లను అనుమతించవు. అలాగే పోలైన మొత్తం ఓట్లలో కొంత శాతం, అది ఐదు శాతం అనుకుందాం. కనీసంగా కొన్ని స్థానాలు గెలుచుకుంటే తప్ప సభలో ప్రవేశించడానికి ఆ దేశాలు అనుమతించవు కూడా. పైన ఉదహరించినట్టు కనీసంగా సభలో కొంతమేర ప్రాతినిధ్యం సాధించే స్థాయికి వచ్చే వరకు రాజకీయ పక్షాలకు అక్కడ ప్రవేశం లభించదు. ఇది చాలా ఆరోగ్యవంతమైన నిబంధన. ఒకరిద్దరు సభ్యులతో సభలోకి ప్రవేశిస్తూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రాజకీయ పార్టీలను నిరోధించడానికి దీనిని మనదేశంలో ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత కూడా కనిపిస్తుంది. రేపు మూడు వందల మంది ఇండిపెండెంట్లు, పుట్టగొడుగుల్లాంటి పార్టీలకు చెందినవారు ఒకటి నుంచి పదిమంది వరకు సభ్యులు లోక్‌సభకు ఎన్నికైతే ఇక పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించండి! దాని గురించి నేను ప్రత్యేకంగా వివరించనక్కర్లేదు.

### ఎక్కడైనా ప్రజాస్వామ్యమే గీటురాయి

ఒక పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థకు రాజకీయ పార్టీల మనుగడ అత్యవసరం కాబట్టి, ఆ రాజకీయ పార్టీల అంతర్గత నిర్మాణ వ్యవస్థలు సయితం ప్రజాస్వామికంగా ఉండటం కూడా అంతే అవసరం. తన అంతర్గత వ్యవహారాలలో ప్రజాస్వామ్యాన్ని అనుమతించని ఏ రాజకీయ పక్షమైనా, అది అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలనా వ్యవహారాలలో ప్రజాస్వామిక విలువలను పాటిస్తుందని ఆశించలేం. అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్ష అభ్యర్థి ఎంపిక తీరుతెన్నులు పరిశీలిస్తే పాఠం నేర్పే ఒక విషయం అవగతమవుతుంది. అధ్యక్ష అభ్యర్థి మొదట అన్ని రాష్ట్రాలలోను ప్రాథమిక పోరులో విజయం సాధించాలి. ఆ అభ్యర్థి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ విశ్వాసం పొందాలి. అప్పుడు అసలు పోరాటంలో దిగవలసి ఉంటుంది. అయితే మనదేశంలో ఏం జరుగుతోంది? దాని గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. కొందరు పుట్టుకతోనే ఘనులు, కొందరు గొప్పతనాన్ని సాధించుకుంటారు. ఇంకొందరు గొప్పతనాన్ని ఆపాదించుకుంటారన్న మాటను ఇక్కడ చెప్పుకోవచ్చు. కొన్ని దేశాలలో ఎన్నికల నిబంధనలు చాలా నిశ్శబ్దంగా పనిచేస్తాయి. జర్మనీ రాజ్యాంగం ఇందుకు ఉదాహరణ. అక్కడి నిబంధనలు పార్టీ పదవులకు అభ్యర్థుల ఎంపిక, ప్రభుత్వ పదవులకు పోటీపడే అభ్యర్థుల ఎంపికలను అన్ని స్థాయిలలోను అవి ప్రభావితం చేస్తాయి.

మన లోక్‌సభలో కావచ్చు, రాష్ట్రాల శాసన సభలలో కావచ్చు– చట్టసభ ఏదైనా అక్కడ రెండు లేదా అంతకుమించి రాజకీయ పక్షాలు ప్రాతినిధ్యం వహిస్తుంటాయి. ప్రభుత్వానికి

సంబంధించిన చట్ట నిర్మాణ వ్యవహారాలన్నీ చట్టసభలలోనే జరగాలి కాబట్టి అధికార, ప్రతిపక్షాల మధ్య విభేదాలు తలెత్తుతాయి. అవి కొన్ని సమయాలలో తీవ్ర స్థాయిలో కూడా ఉంటాయి. కాబట్టి సభా నిర్వహణ సజావుగా, మృదువుగా సాగేందుకు పార్టీలతో నిమిత్తం లేకుండా సభ్యులందరికీ సమంగా, నిష్పక్షపాతంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి సమయం కేటాయించే ఒక వ్యవస్థ అనివార్యమైంది. ఆ క్రమంలోనే స్పీకర్ పదవి ఆవిర్భవించింది. స్పీకర్ వ్యవస్థ యూకేలో ఏర్పడింది కాబట్టి, దాని ఆవిర్భావ చరిత్ర గురించి ఇక్కడ నేను చెప్పబోవడం లేదు. అయితే యునైటెడ్ కింగ్‌డమ్‌లో హౌస్ ఆఫ్ కామన్స్ స్పీకర్ పదవి అత్యున్నత విలువ కలిగినది. అలాగే సమున్నత గౌరవ ప్రతిష్టలు కలిగివుందన్న మాట చెబితే చాలు. 1980 వరకు మన దేశంలో స్పీకర్ పదవికి కూడా అన్ని పార్టీల సభ్యుల నుంచి గౌరవమర్యాదలు లభించేవి. స్పీకర్ పదవికి ఎంపికైతే, ఆ వ్యక్తి పక్షపాతరహితంగా, న్యాయంగా సభ కార్యకలాపాలను నిర్వహించాలి. అనుభవ జ్ఞానాలు, మచ్చలేని వ్యక్తిత్వం కలిగిన వ్యక్తినే స్పీకర్ పదవికి అభ్యర్థిగా ఎంపిక చేస్తారని ఆశిస్తాం. నిజానికి ఇంగ్లండ్‌లో ఒక సంప్రదాయం వాడుకలోకి వచ్చింది. అక్కడ స్పీకర్ పదవికి ఎంపికవుతున్న సభ్యుడు, తను ఏ పార్టీ టికెట్ మీద గెలిచి సభకు వచ్చాడో, ఆ పార్టీకి రాజీనామా ఇస్తాడు. అయితే, స్పీకర్ పదవీకాలం ముగిసిన తరువాత, ఆ వ్యక్తి మళ్లీ కోరుకుంటే అదే రాజకీయ పార్టీలో చేరవచ్చు. మనదేశంలో ఇలాంటి సంప్రదాయమంటూ ఏదీ అమలులోకి రాకపోయినా, కొన్నేళ్ల క్రితం ఒక ఉదాహరణ కనిపించింది. ఆ సభ్యుడు స్పీకర్ పదవికి ఎంపికైన తరువాత తను ఏ పార్టీ టికెట్ నుంచి సభకు ఎంపికయ్యారో, ఆ పార్టీకి రాజీనామా చేశారు. నేను సోమనాథ్ ఛటర్జీ గురించే ప్రస్తావిస్తున్నాను. స్పీకర్‌గా ఎన్నికైనవారు తన పార్టీకి రాజీనామా చేయడం అనివార్యమని నేను అనుకోవడం లేదు. ఆయన నిష్పక్షపాతంగా, రాజకీయ పార్టీల ఒత్తిడికి లంగకుండా స్వతంత్రంగా, న్యాయ నిర్ణేతగా వ్యవహరించగలిగితే అదే చాలు.

స్పీకర్ విధులు సభ నిర్వహణకు పరిమితమై ఉన్నంతకాలం స్పీకర్ కేంద్ర బిందువుగా వివాదాలు తలెత్తిన సందర్భాలు ఎక్కువగా కనిపించవు. అయితే 52వ సవరణ చట్టం ద్వారా రాజ్యాంగంలో పదో షెడ్యూల్‌ను పొందుపరిచినప్పటి నుంచి రగడ మొదలయింది. సభ్యులపై అనర్హత వేటుకు సంబంధించిన ఈ సవరణ చట్టాన్ని అదే సమయంలో 102వ (పార్లమెంట్), 191వ (రాష్ట్రాల శాసనసభలు) ఆర్టికల్స్‌కు కూడా వర్తింపచేశారు. పదో షెడ్యూలు కొన్ని ఉత్కృష్టమైన మార్గదర్శకాలను ప్రవేశపెట్టింది. అదే సమయంలో అత్యంత వివాదాస్పదమైన ఇంకొన్ని నిబంధనలను కూడా పొందుపరిచింది.

## పదో షెడ్యూల్‌కు దారితీసిన పరిస్థితులు

ఈ విషయానికి ఇక్కడ ఒకింత విరామం ఇచ్చి, 1985లో పదో షెడ్యూల్‌ను ప్రవేశపెట్టడానికి ఉన్న ముఖ్య కారణాలను చెబుతాను. 1967లో సాధారణ ఎన్నికలు, తరువాత సాధారణ ఎన్నికలు కూడా ఆయారామ్, గయారామ్ సంస్కృతిని ముందుకు తెచ్చాయి. ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి సభ్యులు తరచు సాగించిన ఫిరాయింపుల వల్ల పరిపాలనలో దారుణమైన అసమతౌల్యం వచ్చింది. దానితో రాజకీయ బేరసారాలు, అవినీతి, ధనబలం ప్రాబల్యం ఒకటేమిటి ఇలాంటివన్నీ మన రాజకీయ జీవితంలో చొరబడ్డాయి. ఈ దుష్పరిణామాన్ని చూసి, వెంటనే స్వస్తి పలికే విధానం తీసుకురావాలని పార్లమెంట్ యోచించింది. 'ఎవరైనా సభ్యుడు తను ఏ పార్టీ టికెట్ మీద గెలిచాడో, ఆ పార్టీ సభ్యత్వానికి స్వచ్ఛందంగా రాజీనామా ఇచ్చినా, తన పార్టీ ఇచ్చిన ఆదేశాల మేరకు ఓటు వేయకున్నా, ఓటింగ్‌కు గైర్హాజరైనా.. అలాంటి సభ్యుడు అనర్హుడవుతాడు' అని పదో షెడ్యూల్‌లో రెండో పేరా పేర్కొంటున్నది. మూడో పేరా పార్టీలో చీలిక గురించి ప్రస్తావించింది. అయితే దీనిని 91వ రాజ్యాంగ సవరణ చట్టం 2003 మేరకు ఉపసంహరించారు. నాలుగో పేరా అనర్హత వేటు పడకుండా పార్టీ విలీనం గురించి పేర్కొంటున్నది. ఇంతవరకు బాగానే ఉంది. తరువాత ఆరు, ఏడు పేరాలను కూడా ప్రవేశపెట్టారు. ఆరో పేరా ఉదహరించిన అంశం, ఇప్పటికీ అమలులో ఉన్న అంశం- అది, పదో షెడ్యూల్ మేరకు ఒక సభ్యుని అనర్హత అంశం వచ్చినప్పుడు దానిని ఛైర్మన్ లేదా స్పీకర్ పరిధిలోనికి వస్తే ఆయనదే తుది నిర్ణయమని పేర్కొంటున్నది.

ఏడో పేరా అయితే, ఈ షెడ్యూలు ప్రకారం అనర్హతకు సంబంధించిన ఏ ఒక్క అంశం ఏ కోర్టు పరిధిలోకి రాదు అని పేర్కొంటున్నది. అయితే కిహోతో హొల్లోహాన్ (1992 సప్ (2) ఎన్‌సీసీ 651) కేసులో కలగజేసుకుంటూ పదో షెడ్యూలు రాజ్యాంగ ప్రతిపత్తిని గౌరవిస్తూనే, ఏడో క్లాజును కొట్టివేసింది. ఆ క్లాజులో సుప్రీంకోర్టు, హైకోర్టుల అధికార పరిధిని అతిక్రమించే ఉద్దేశం ఉన్నదని, ఆర్టికల్ 368లోని క్లాజు 2 నిర్దేశించినట్టు ఏడో క్లాజుకు అవసరమైనమేర శాసనసభల సమర్థన లేదని, ఈ కారణంగానే కొట్టివేయడం జరిగిందని సుప్రీంకోర్టు పేర్కొన్నది.

## సమస్యగా మారిన సవరణలు

గడచిన కొద్దికాలంగా జరిగిన సంఘటనలను బట్టి ఆరో

పేరా ప్రకారం స్పీకర్‌కు అప్పగించిన అసాధారణ అధికారాలు అత్యంత వివాదాస్పదంగా మారినట్టు అర్థమవుతుంది. అసంఖ్యాకంగా కోర్టులు కలుగజేసుకోవలసిన పరిస్థితులు కూడా తలెత్తాయి. దురదృష్టవశాత్తూ, దేశంలోని శాసనసభల స్పీకర్లు కొంతమంది తమ బాధ్యతల అవసరాలకు తగినట్టు వ్యవహరించడం లేదు. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీని లేదా సభలో ఘర్షిస్తున్న బృందాలను బలపర్చడం లేదా వ్యతిరేకించే చర్చల్లో పాల్గంటూ వీరు రాజకీయ పార్టీలు తొక్కే అడ్డదారులకు తమ వంతు తోడ్పాటు అందిస్తున్నారు. వీరు న్యాయవిరుద్ధ నిర్ణయాలు తీసుకుంటున్నారు లేదా తమ అధికారాన్ని వినియోగించడాన్ని అలవోకగా తోసిపుచ్చుతున్నారు. శాసనసభ సభ్యుల అనర్హతకు సంబంధించి తమ ముందుకు వస్తున్న ఆరోపణలపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోకుండా కొంతమంది స్పీకర్లు సంవత్సరాలపాటు తొక్కిపెడుతున్న సందర్భాలు కూడా ఉంటున్నాయి. తమ అధికార పరిధిని ఉపయోగించుకోవడంలో వైఫల్యానికి ఇదొక స్పష్టమైన ఉదాహరణ. న్యాయవ్యవస్థ జోక్యానికి ఇదే భూమికను అందిస్తోంది. న్యాయస్థానం వ్యాఖ్యానాలు లేక ఆదేశాలు ఉన్నప్పటికీ, స్పీకర్ తనదైన నిర్ణయం తీసుకోవడానికి నిరాకరించి, శాసనసభ పూర్తికాలం పనిచేయడాన్ని అనుమతిస్తే మీరేం చేస్తారు? దీనికి ఎలాంటి చికిత్సా లేదు. తరచుగానే చెబుతున్నట్టుగా, తమ ఆమోదానికి పంపిన బిల్లును రాష్ట్రపతి లేదా గవర్నర్ సంవత్సరాల తరబడి తమ వద్దే ఉంచుకున్నట్టయితే.. ఇలాంటి పలు సందర్భాలలో ఏం చేయాలో రాజ్యాంగం సూచించలేదు. రాజ్యాంగ వ్యవస్థ స్ఫూర్తి, సంప్రదాయాల మేరకు అత్యున్నత స్థానాల్లోని వ్యక్తులు వ్యవహరించాలని వ్యవస్థ తలుస్తోంది.

పైన ప్రస్తావించినట్టుగా, కిహోతో కేసులో స్పీకర్ తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టు/హైకోర్టు జోక్యం చేసుకున్న కారణాల వద్దకు ఇప్పుడు మళ్లీ వెళదాం. 'అంతిమత్వం' లేదా అంతిమ నిర్ణయం అనేది శాసనం ద్వారా కాకుండా రాజ్యాంగ నియమం ద్వారా అనుసరిస్తున్నప్పుడు శాసన సంబంధ ట్రిబ్యునళ్ల ఉదంతంలో వర్తింపు అయ్యే ప్రమాణాలు స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధ అధికారికి కూడా వర్తించగలవా? ఈ అంతమత్వాన్ని రాజ్యాంగమే తనకుతానుగా రూపొందించింది. అలాంటప్పుడు న్యాయం, ధర్మవర్తన దృష్టితో సరైన వర్తనను స్థిరంగా అమలుచేయడం ఎలా? సమస్య ఏమిటంటే- ఇవి సంస్థాగత వైఫల్యానికి లేదా మరింతగా నొక్కిచెప్పాలంటే రాజ్యాంగం రూపొందించిన సాధనాల వైఫల్యానికి సంబంధించినవిగానే చూడాలి. వీటిలో కొన్నింటికి రాజ్యాంగంలోనే పరిష్కారాలు లేవు.

అత్యంత పాక్షిక పద్ధతిలో అనర్హతలను విధించడానికి సంబంధించిన సమస్యలు కూడా ఉంటున్నాయి. దీని ఫలితంగా కోర్టులు జోక్యం చేసుకుని, స్పీకర్ అధికారాన్ని క్రమబద్ధీకరించడానికి పలు నిబంధనలను విధించాల్సి వస్తోంది. ముందుగానే ప్రస్తావించినట్టు, సహజ న్యాయాన్ని పరిశీలించకుండానే స్పీకర్ ఏదైనా అనర్హత అంశంపై నిర్ణయం తీసుకున్నప్పుడు, ఆ నిర్ణయం చెడుఫలితాన్నిస్తుంది. దాన్ని న్యాయస్థానాలు తోసివేయడానికి కూడా దారితీస్తుంది. అదేవిధంగా, అతడి నిర్ణయం 'ఎలాంటి ఆధారం లేదనే' ప్రాతిపదికన దురుద్దేశంతో కూడి ఉన్నట్టయితే అప్పుడు కూడా కోర్టులు జోక్యం చేసుకుని దాన్ని తోసిపుచ్చే వీలుంది. ఇక్కడొక ఆసక్తికరమైన అంశం ఉంది. పదో షెడ్యూల్ కింద స్పీకర్ వ్యవహరించాల్సిన విధంగా కోర్టు నిజానికి ఒక పద్ధతిని కూడా విధించింది. రాజేంద్ర సింగ్ రాణా వర్సెస్ స్వామి ప్రసాద్ మౌర్య (2007 (4) సెక్షన్ 270) కేసులో జరిగిందేమిటంటే, ఎక్స్ పార్టీకి చెందిన 13మంది సభ్యులు ప్రతిపక్ష పార్టీ వై కి చెందిన నేతను ముఖ్యమంత్రిగా నియమించాలని కోరుతూ ప్రభుత్వాన్ని సంప్రదించారు. ఈ చర్యను ఫిరాయింపుగా ఆరోపించడంతో ఈ వ్యవహారం స్పీకర్ వద్దకు వెళ్లింది. కానీ స్పీకర్ ఎలాంటి చర్యా తీసుకోలేదు. ఈలోగా, 37మంది సభ్యులు (ఈ 13మంది సభ్యులతోపాటు) ఎక్స్ పార్టీ నుంచి వేరుపడినట్టు ప్రకటిస్తూ, ఎక్స్ పార్టీ మొత్తం సభ్యులలో తాము మూడింట ఒకవంతుగా ఉన్నందున ఫిరాయింపు చట్టంలోని 3వ పేరా ప్రకారం (అప్పట్లో ఇది అమలులో ఉండేది) తమకు అనర్హత వర్తించదని వారు పేర్కొన్నారు. స్పీకర్ వీరి అభ్యర్థనను తీసుకుని దాన్ని ఎత్తిపట్టారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు పార్టీలో చీలికకు సంబంధించిన వ్యవహారాన్ని ఆమోదిస్తూ స్పీకర్ చర్య తీసుకుంటూనే, మరోవైపు పెండింగులో ఉన్న 13మంది ఎమ్మెల్యేల అనర్హతను కోరుతూ వచ్చిన పిటిషన్‌ను అట్టిపెట్టుకోవడంలో తను నిర్వహించిన పాత్ర సమర్థనీయం కాదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. పార్టీలో చీలిక ఏర్పడినట్టుగా 37మంది ఎమ్మెల్యేలు చేసిన ప్రకటనకు సమాధానం ఇవ్వడంలో స్పీకర్ పూర్తిగా తప్పుదోవ పట్టినట్టు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంతకుముందు తన ముందుకొచ్చిన, 13మంది సభ్యుల అనర్హత అంశాన్ని కూడా స్పీకర్ వదిలేశారు. పైగా ఇది తన వద్ద పెండింగ్‌లో ఉంది కూడా. ఇది స్పీకర్ తన అధికార పరిధిని ఉపయోగించడంలో వైఫల్యంగానే భావించిన కోర్టు జోక్యం చేసుకుంది.

6వ పేరాలో పేర్కొన్న స్పీకర్ అధికారాలను క్రమబద్ధీకరించే విషయంలో కోర్టులు ఇతర సూత్రాలను కూడా నిర్దేశించాయి. అనర్హతపై శాసనసభ్యుడు ఆరోపణ చేసినప్పుడు మాత్రమే ఈ

అధికారాన్ని స్పీకర్ వినియోగించుకోవాలి, ఒక సభ్యుడి అనర్హత అంశాన్ని స్పీకర్ ఎన్నటికీ సుమోటోగా స్వీకరించరాదని కూడా పేర్కొన్నాయి. ఇటీవల అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో స్పీకర్ అధికారానికి కీలకమైన పరిమితిని న్యాయస్థానం విధించింది. ఆ రాష్ట్ర శాసనసభలోని కొంతమంది సభ్యులు స్పీకర్‌ను తొలగించాలన్న అభిప్రాయం వ్యక్తం చేసినప్పుడు దాన్ని స్పీకర్ నిర్లక్ష్యం చేయలేరు. అదేవిధంగా స్పీకర్‌ను తొలగించాలని పేర్కొన్న సభ్యులను కాని మరే ఇతర సభ్యుడిని కానీ అనర్హులుగా ప్రకటించే చర్యలకు స్పీకర్ పూనుకోలేరని కోర్టు స్పష్టీకరించింది. అసెంబ్లీలోని మెజారిటీ సభ్యులు ఇప్పటికీ తనపై విశ్వాసం చూపుతున్నారని స్పీకర్ తప్పక నిరూపించుకోవాలని, ఆ తర్వాతే ఫిరాయింపు/అనర్హత సమస్యపై నిర్ణయం తీసుకోవడానికి ప్రయత్నించాలని కోర్టు సూచించింది. స్పీకర్లు సరైన నిర్ణయం తీసుకోవడానికి ప్రయత్నించాలని కోర్టు సూచించింది. స్పీకర్లు సరైన నిర్ణయం తీసుకోవడానికి హామీ పడే ఉద్దేశంతోటే కోర్టులు ఈ నిబంధనలను విధించాయి. ఇలాంటి ఘటనల ప్రాతిపదికనే, సమాజంలో బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న పలువురు వ్యక్తులు ఈ అధికారాన్ని స్పీకర్‌కు లేకుండా చేసి, ఎన్నికల కమిషన్ వంటి స్వతంత్ర సంస్థకు కట్టబెట్టాలని సూచిస్తున్నారు. ఎలక్షన్ కమిషన్ చరిత్ర ఇంతవరకు పూర్తి స్వతంత్రతతోనూ, న్యాయబద్ధంగానూ కొనసాగడం మనదేశం చేసుకున్న అదృష్టమనే చెప్పాలి. 2000 సంవత్సరంలో రాజ్యాంగ పనివిధాన సమీక్ష కోసం నియమించిన జాతీయ కమిషన్ ఈ సిఫార్సును చేసింది. జగ్జిత్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ హర్యానా (2006 (11) సెక్షన్ 1) కేసులో సుప్రీంకోర్టు కూడా ఈ అంశంపై తన అభిప్రాయం ప్రకటించింది. పార్లమెంటరీ సంప్రదాయాల్లో స్పీకర్ అత్యున్నత స్థాయిని, గౌరవాన్ని ఆస్వాదిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే అనర్హతకు సంబంధించిన సమస్యపై నిర్ణయాధికారాన్ని స్పీకర్‌కే కల్పించినట్టు సుప్రీంకోర్టు చెబుతూనే అదనంగా ఇలా వ్యాఖ్యానించింది.

“దేశంలో ఏ ఒక్క స్పీకర్‌ని అగౌరవించకుండానే, ఇటీవల జరిగిన కొన్ని ఘటనలను గమనించాక, ఒక ట్రిబ్యునల్‌గా స్పీకర్ తన అధికార పరిధిలో రాజకీయ స్వభావం ఉన్న కొన్ని అంశాలపై తీసుకున్న నిర్ణయాలలో పక్షపాతానికి సంబంధించి కొన్ని ప్రశ్నలు తలెత్తాయి. దీన్ని అడ్డుకోకపోతే, స్పీకర్ అత్యున్నత స్థానాన్నే అంతిమంగా ఇది దెబ్బతీస్తుంది.”

**ఈసీకి అప్పగించటమే శరణ్యం**

అలాంటి అధికారాన్ని ఎన్నికల కమిషన్‌కు అప్పగించడంపై రాజ్యాంగాన్ని, ఇతర సుప్రసిద్ధ న్యాయమూర్తుల అభిప్రాయాలను సమీక్షించేందుకు జాతీయ కమిషన్ ఏర్పాటుపై వచ్చిన సిఫార్సును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది కూడా. వాస్తవానికి శాసనసభల్లోని కొందరు స్పీకర్ వైపు నుంచి జరిగిన వైఫల్యం కారణంగా రాజ్యాంగ వ్యవస్థలో అనేక వక్రీకరణలు కూడా చోటుచేసుకున్నాయి. రాజ్యాంగ వ్యవస్థలోనే శాసన, న్యాయ వ్యవస్థ పరిధులను సుస్పష్టంగా నిర్దేశించారు. ప్రభుత్వంలోని ఏ అంగమూ మరొక అంగానికి సంబంధించిన అధికార పరిధిని ఆక్రమించకూడదని భావించారు. శాసన కార్యాచరణ లేదా విశ్వాస తీర్మానం/అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన వ్యవహారాల్లో శాసనసభలో తలదూర్చే పద్ధతిలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవని నా అభిప్రాయం. అవిశ్వాస తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టినప్పుడు దానిపై శాసనసభ నిబంధనల ప్రకారం స్పీకర్ నిర్వహించాలి. కానీఈ స్పీకర్ పాత్రే ప్రశ్నార్థకమై నిలిచినప్పుడు అలాంటి పరిస్థితుల్లో ఏం జరగాలి? మీరు అంగీకరించినా, అంగీకరించకున్నా సరే.. అలాంటి పరిస్థితుల్లో కోర్టులు జోక్యం చేసుకున్నాయి. దీంతో శాసనసభకు నిర్దేశించిన రంగాన్ని న్యాయవ్యవస్థ ఆక్రమించిందన్న ఆరోపణలు పెరిగేందుకు కూడా అవకాశమేర్పడింది.

ఉత్తరప్రదేశ్‌లో ఇద్దరు వ్యక్తులు తమకుతాముగా ముఖ్యమంత్రిగా పేర్కొంటూ సభా విశ్వాసాన్ని తామే పొందుతున్నామని చెప్పుకున్న ఘటన జరిగింది. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు తలుపులు తట్టినప్పుడు, సభలో వారిద్దరికీ పరీక్ష పెట్టాలని, స్వతంత్ర పరిశీలకుడు వీరికి వచ్చిన ఓట్లను లెక్కించాలని, వచ్చిన ఫలితాన్ని సుప్రీంకోర్టు ప్రకటించి ఆమోదించాలని కోర్టు ఆదేశించింది. ఇలాంటి సందర్భాలు ఇటీవలి సంవత్సరాల్లో ఒకటికి మించి చోటుచేసుకున్నాయి. ఇది సంస్థాగత వైఫల్యమేనని, ఇవి వ్యవస్థాత్మక తప్పిదాలకు దారితీస్తాయని నేను మరోసారి చెబుతున్నాను. ఈ అంశం స్పీకర్ కార్యాలయ ప్రమాణాన్ని పెంచవలసిన అవసరాన్ని సూచిస్తోంది. ప్రత్యేకించి విశ్వాస/అవిశ్వాస తీర్మానాల సందర్భంగా స్పీకర్ పాత్రే అనుమానాస్పదంగా మారినప్పుడు దీన్ని ఎదుర్కొనే యంత్రాంగాన్ని రూపొందించాల్సి ఉంది. ఈ సెమినార్‌కు హాజరైనవారిలో పండితులైన మేధావులు ఎందరో ఉన్నారు. వీరిలో కొంతమందికి దశాబ్దాలుగా శాసనసభల్లో గడిపిన అనుభవం ఉంది. తమ జీవితం పొడవునా ఇలాంటి వ్యవహారాల్లో వీరు తలలు పట్టుకున్నారు కూడా. దీనికి సంబంధించిన పలు వ్యవస్థాగత వైఫల్యాలను అడ్డుకోవడానికి తగిన, సమర్థవంతమైన చర్యలను వీరు సూచిస్తారని నేను భావిస్తున్నాను.

**('ఫిరాయింపులు-స్పీకర్ల పాత్ర' అంశంపై హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో సమర్పించిన పత్రం. సాక్షి సౌజన్యంతో)**

*(పార్టీల ఫిరాయింపులు– స్పీకర్ పాత్రపై లోక్‌సత్తా, జనచైతన్య వేదిక, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్, అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫాంస్, అప్సా, ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్, జనవిజ్ఞాన వేదిక తదితర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రసంగం స్థూల పాఠమిది. సదస్సులో సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి, జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి, జస్టిస్ బి.శేషశయనారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కె.రామచంద్రమూర్తి కూడా మాట్లాడారు)*



# పార్టీల ఫిరాయింపులు - స్పీకర్ పాత్ర- పరిష్కారాలు

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**

పార్టీల ఫిరాయింపులు, స్పీకర్ పాత్రపై ఏర్పాటు చేసిన ఈ చర్చ కేవలం సాంకేతికాంశాల చుట్టూనే పరిమితం కాకూడదని కోరుతున్నాను. ఇప్పటిదాకా చర్చ చాలా భాగం పార్టీ ఫిరాయింపులు–రాజ్యాంగం–చట్టం చుట్టూ జరిగింది. రాజ్యాంగంలో పద్ధతి చాలా స్పష్టంగా ఉంది– నలుపు, తెలుపులాగా. కానీ దానికి, ఈవేళ రాజకీయంగా జరుగుతున్నదానికీ ఉన్న సంబంధమూ, మార్పులు తీసుకురావటానికి ఏం చేయాలీ అనే దాని మీద చర్చ జరిగితే.. ఈ దేశంలో మనం ఎదురుచూస్తున్న మౌలికమైన రాజకీయ, పాలనా సంక్షోభాలకు పరిష్కారం లభిస్తుందని అనుకుంటున్నాను.

ఎంచేతంటే, రాజకీయాల్లో నేరచరిత్ర ఉందని, అలాంటి నేరస్తులకు అవకాశం ఇవ్వకూడదు అని గట్టిగా వాదించి, పోరాడి విజయం సాధించినవాడిని నేను. రాజకీయాల్లో నేరచరిత్రులను పూర్తిగా ఆపకపోయినా కనీసం వాళ్ల వివరాలను బైటపెట్టే చట్టాన్ని 2003లో తేగలిగాం. 1999లో ఈ రాష్ట్రంలోనే ఎన్నికలలో పోటీచేసే నేరస్తుల వివరాలను బైటపెట్టి తర్వాత సుప్రీంకోర్టు దాకా పోయి ఆ చట్టాన్ని తీసుకురాగలిగాం. సుప్రీంకోర్టు ఆదేశం ఇచ్చినా ఒక పనికిమాలిన ఆర్డినెన్స్‌తో అడ్డుకునే ప్రయత్నం చేస్తే, అప్పుడు రాష్ట్రపతిగా ఉన్న కలాంగారిని అభ్యర్థించి ఆపగలిగాం. తర్వాత దాన్ని తిరుగుటపాలో మళ్లీ పంపే ప్రయత్నం చేస్తుండగానే సుప్రీంకోర్టు జోక్యం ద్వారా చివరికి మన తరపున పోటీచేసేవారి వివరాలు తెలుసుకునే హక్కు లభించింది. కానీ ఏనాడూ కూడా దాని వల్ల పెద్దగా ఈ దేశంలో రాజకీయం మారుతుందన్న భ్రమలు నాకు లేవు. నేరచరిత్ర అనేది కుళ్లిపోయిన రాజకీయానికి తిరుగులేని చిహ్నం. రాజకీయ పార్టీలు సమర్థించుకోలేని ఒకానొక వ్యాధి లక్షణం. కాబట్టి వ్యాధిని ఎదుర్కోవటం కోసం వ్యాధిలక్షణానికి మందేస్తేనే ఫలితం లభించదు. లోపల క్యాన్సర్ ఉంటే బైట మలాం వేస్తే పోదు. అయినా ఆ వ్యాధి లక్షణాన్ని బైటపెట్టాల్సిన అవసరం ఉంది. లేకపోతే, సమాజం ఆలోచించదు. అలాగే పార్టీ ఫిరాయింపుల చట్టం. ఫిరాయింపుల్ని నిరోధించటానికి 91వ రాజ్యాంగ సవరణ రావటానికి గట్టిగా దోహదం చేసిన వాళ్లలో నేనొకడ్ని. 52వ రాజ్యాంగ సవరణ.. వ్యక్తులుగా ఫిరాయిస్తే నేరం, సామూహికంగా చేస్తే చాలా గొప్ప అన్నట్టుండేది. మరీ అసహ్యంగా ఉందని, నేను గట్టిగా ఆనాడు పోరాడితే అన్ని పార్టీలూ 91వ రాజ్యాంగ సవరణకు అన్ని పార్టీలూ కలిసొచ్చాయి. న్యాయశాఖా మంత్రి అరుణ్ జైట్లీ, ప్రధాని వాజ్‌పేయి, ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ ఇలాంటి విషయాల పట్ల బాగా చొరవ తీసుకోవటం వల్ల ఆరోజుల్లో చాలా చట్టాలు వచ్చాయి. వాటిలో ఇంకో ఉదాహరణ, ఎన్నికల నిధుల చట్టం. తెహల్కా కుంభకోణం నేపథ్యంలో నును గట్టిగా

అన్ని పార్టీలనూ కలిసి, అందరినీ ఒప్పించి ఆ చట్టం రావటానికి దోహదం చేశాను. అంతమాత్రం చేత రాజకీయంలో డబ్బు ప్రభావం పోతుందనిగానీ, రాజకీయం రాత్రికిరాత్రి మారిపోతుందనిగానీ భ్రమలు లేవు. కానీ కొంతవరకు మార్పు వచ్చింది, ఒక మార్గం ఏర్పడింది. అలాగే నేరస్తుల వివరాల చట్టం పోరాడి సాధించాల్సి వచ్చింది. నిధుల చట్టం, 91వ రాజ్యాంగ సవరణ కలిసి తీసుకొచ్చాం.

ఇంతకుముందే అనుకున్నట్టు, 91వ రాజ్యాంగ సవరణ వచ్చినా ఇంకా ఎన్నో సమస్యలున్నాయి. కొంత పరోక్షంగా పెద్దలు జైపాల్‌రెడ్డిగారు ప్రస్తావించారు. దానిలోకొస్తాను. కానీ ఈ అంశాలపై ఇప్పుడున్న రాజకీయాల నేపథ్యంలో మనం కొంత లోతుగా ఆలోచించాలని పెద్దలందరినీ కోరుతున్నాను. ఆయారాం గయారాం గురించి మనకందరికీ తెలుసు. జైపాల్‌రెడ్డిగారు, సుదర్శన్ రెడ్డిగారు చెప్పారు– చాలాకాలం నుంచి ఈ పెడధోరణులు మొదలయ్యాయని. చాలా సందర్భాల్లో హర్యానా ఈ ఫిరాయింపులకు కేంద్రబిందువు– ఢిల్లీకి పక్కనుండటం వల్ల. ఆ తర్వాత దేశమంతా విస్తరించింది. నాకు బాగా గుర్తుంది– 1982లో భజన్‌లాల్ హర్యానాలో జనతా ప్లాట్‌ఫాం మీద ఎన్నికయ్యారు. కానీ ఆ తర్వాత ఇందిరాగాంధీ గెలవగానే ఆయనతోపాటు మొత్తం పార్టీ మార్చేశారు. ఈదేశంలో అలా జరిగిన మొట్టమొదటి సంఘటన అది. ముఖ్యమంత్రితోపాటు అందరూ పార్టీ మార్చేశారు. వికృత రాజకీయం ఆరోజే మొదలైంది. ఆ తర్వాత 1990లో చిమన్‌భాయ్ పటేల్ జనతాదళ్–బీజేపీ ప్రభుత్వానికి నాయకుడిగా ఉండి, ఢిల్లీలో జనతాదళ్ ప్రభుత్వం పడిపోగానే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ఛాయలు కనిపించగానే పార్టీవారందరితో కలిసి వేరే పార్టీలోకి ఫిరాయించేశారు. భజన్‌లాల్ దీనికి ఆద్యుడు. (2016లో అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు నేతృత్వంలో 43 మంది కాంగ్రెస్ సభ్యులు మూకుమ్మడిగా బీజేపీ నేతృత్వంలోని కూటమికి సంబంధించిన పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ ప్రదేశ్ (పీపీఏ)లోకి ఫిరాయించారు) 1982 ఎన్నికల్లో తపాసే అనే ఒకాయన గవర్నర్‌గా ఉన్నాడు. మన రమేష్ భండారీ, మన రాంలాల్ వీళ్లందరికీ గురువు ఆయన. తపాసే గవర్నర్‌గా ఉండగా ఒకాయన భజన్‌లాల్‌ని అడిగాడు–'సార్! వచ్చే ప్రభుత్వం ఎవరిది? ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు?'. దానికి భజన్‌లాల్ సమాధానమిస్తూ 'ఎన్నికల్లో ఎవరు గెలిస్తే నీకెందుకయ్యా, నేను ఎమ్మెల్యేనయితే నేనే ముఖ్యమంత్రిని' అన్నాడు. భజన్‌లాల్ పార్టీ ఎన్నికల్లో ఓడిపోయింది. దేవీలాల్ నాయకత్వంలోని జనతాపార్టీ గెలిచిందిగానీ మెజారిటీ రాలా. ఒకట్రెండు సీట్లు తక్కువతో అధికారానికి మాత్రం దగ్గరగా ఉంది. ప్రజల తీర్పు స్పష్టంగా జనతా వైపు ఉన్నా, తపాసే నిర్మొహమాటంగా భజన్‌లాల్ చేత ప్రమాణస్వీకారం చేయించాడు. దేవీలాల్ రాజ్‌భవన్‌లో గవర్నర్ చొక్కాపట్టుకున్నాడు. కొట్టలేదుగానీ, కొట్టినంత పనిచేశాడు. కానీ గవర్నర్ పెద్దగా సిగ్గుపడలా. ముఖం తుడిచేసుకున్నాడంతే. భజన్‌లాల్ ఆ తర్వాత ఐదేళ్లు 1987 దాకా కొనసాగాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1984లో మన రాంలాల్ భాగోతం గురించి మనకు తెలుసు. ప్రత్యేకించి ఇక్కడ చెప్పనక్కర్లా. కానీ జమ్మూకాశ్మీర్ గురించి మాట్లాడుకోవాలి. అప్పటిదాకా గవర్నర్‌గా ఉన్న డి.కె మీనన్ గురించి చెప్పుకోవాలి. పేరుకి ఇందిరాగాంధీకి బంధువు అయినా నిబద్ధతగలవాడు, నిజాయతీపరుడు. కేంద్రం నుంచి ఎంత ఒత్తిడి వచ్చినా జమ్మూకాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని పడగొట్టటానికి ఆయన సిద్ధపడలేదు. దాంతో జగ్‌మోహన్‌ని, ఆయనెలాంటివాడో మనకు తెలుసు, గవర్నర్‌గా చేసి.. జీఎం షా అని ముఖ్యమంత్రికి స్వయానా బావమరిదిని, వాడితో పాటు 12మందిని పార్టీ ఫిరాయించేలా చేసి ఆ 12 మందినీ మంత్రుల్ని చేశారు. ఫరూక్ అబ్దుల్లా స్థానంలో షా ముఖ్యమంత్రి కాగా, మిగిలిన 11మందీ మంత్రులయ్యారు. మంత్రులుకాని వారెవ్వరూ మిగలలేదిక. ఆనాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బైటి నుంచి మద్దతిచ్చి కొంతకాలం కథ నడిపింది. ఈవేళ కాశ్మీర్‌లో ఇంత ఛిద్రమైన పరిస్థితి ఉందంటే, ఉగ్రవాదం బరితెగిస్తోందంటే, వాటికి బీజం ఆనాడు పడింది. 1983లో నేను జమ్మూకాశ్మీర్‌లో పూర్తిగా తిరిగాను. వాళ్ల పోరాటం కేంద్రం మీద కాదు, కేంద్రీకృత పాలన మీద. నేనక్కడ ప్రజల్ని గుచ్చిగుచ్చి ప్రశ్నలడిగాను. మీరు సున్నీలా, షియాలా, ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తారు ఇలా అనేకరకాలుగా అడిగా. వాళ్లు ఆరోజు రెండు మాటలు చెప్పారు. అలాంటివి నేను ఎప్పుడూ జీవితంలో వినలా. నన్నడిగారు–మీరు ఎక్కడ్నుంచి అని. ఆంధ్రప్రదేశ్ నుంచి అన్నాను. వెంటనే హాత్ మిలావ్ అన్నారు. దేనికంటే, ఎన్టీఆర్ కేంద్రం మీద ఫైట్ చేస్తున్నారు కాబట్టి అన్నారు. మనమంతా సెక్యులర్ సార్ అన్నారు. మతంపరంగా షియాలంతా కాంగ్రెస్‌కు ఓటు వేశారు, హిందువులలో ఎక్కువమంది కూడా కాంగ్రెస్‌కు ఓటు వేశారు. కానీ ఆ ఓటు వేయటం మతం కారణంగా కాదు, రాజకీయ కారణాల వల్ల. సెక్యులర్ అన్న పదం మామూలు ముస్లింల నుంచి రావడం చాలా అరుదైన విషయం. కాబట్టి ఆవేళ పార్టీ ఫిరాయింపుల్ని ప్రోత్సహించటం ఈవేళ భారతదేశానికి ఎలాంటి విపత్కర పరిస్థితిని కల్పించిందో వేరే వివరించనక్కర్లేదు.

1998లో సంఘటన గురించి పెద్దలు జీవన్‌రెడ్డిగారు చెప్పారు. అక్కడ సుప్రీంకోర్టు జోక్యం అవసరం, అనివార్యం. సుప్రీంకోర్టు జోక్యం పరిమితంగా ఉండాలని బహిరంగంగా

చెప్పే కొద్దిమందిలో నేనొక్కడ్ని. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉన్న వేదిక మీదే చెప్పాను- సుప్రీంకోర్టు దేవుడు కాదు, కోర్టు తన పరిధిలో ప్రవర్తించి తన గౌరవాన్ని కాపాడుకోవాలి. సుప్రీంకోర్టు విశ్వసనీయత కోల్పోతే దేశానికి ప్రమాదం అని ఆనాడు, ఈనాడు నిర్వంద్వంగా వాదించాను. ఆనాడు అది చేయకపోతే ఇక రాజ్యాంగానికి, రాజకీయానికీ అర్థం లేదు. 1998లో ఉత్తర ప్రదేశ్‌లో జగదాంబికాపాల్‌ని అడ్డగోలుగా ముఖ్యమంత్రి గద్దెనెక్కించటంలో గవర్నర్‌గా రమేష్ భండారీ దిగజారి వ్యవహరించాడు. రాజకీయాలలోకి బాగా చదువుకున్నవాళ్లు, కనీసం గ్రాడ్యుయేట్లు రావాలని చాలామంది అంటుంటారు. కానీ రమేష్ భండారీ అనే వ్యక్తి ఫారిన్ సర్వీస్ ఆఫీసర్. గతంలో ఫారిన్ సెక్రటరీగా పనిచేశాడు. కానీ మూర్ఖంగా ఆలోచించి ఉత్తర ప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టాడు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఓటింగ్ జరిపితే, కళ్యాణ్‌సింగ్‌కు ఎక్కువ ఓట్లు వచ్చినా జగదాంబికాపాల్ గద్దె దిగటానికి ఒప్పుకోలేదు. మనదేశంలో అప్పటిదాకా ఎన్నికల్లో ఎన్ని అన్యాయాలు, దారుణాలు జరిగినా, ఎమ్మెల్యేలను కొనుక్కున్నా జరగనంత దిగ్భ్రాంతికర ఘటన అప్పుడు జరిగింది. ఓటింగ్‌లో ఓడిపోయినా జగదాంబికాపాల్ ముఖ్యమంత్రి ఛాంబర్‌లో కూర్చుని తాళం వేసుకుని బైటికి రానని భీష్మించుకు కూర్చున్నాడు. కొన్ని గంటలపాటు హైడ్రామా నడిచింది. పోలీసు అధికారులు, కార్యదర్శులు ఏం చెప్పారో, అరెస్టు చేయాల్సి ఉంటుందన్నారేమో తెలీదుగానీ, చివరికి రాజీనామా చేశాడాయన. ఆ జగదాంబికాపాల్ ఇప్పుడేం చేస్తున్నాడో మీకు తెలుసా? బీజేపీ ఎంపీగా పార్లమెంటులో ఉన్నాడు.

1985లో వచ్చిన 52వ రాజ్యాంగ సవరణ స్థానంలో 2003లో 91వ రాజ్యాంగ సవరణ వచ్చింది. ఈ సవరణ తర్వాత 2009లో మళ్లీ గెలిచాక వైఎస్ రాజశేఖర రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్‌కి తెరతీశారు. ఫిరాయింపులకు పాల్పడ్డవారు రాజీనామా చేయాలని జైపాల్‌రెడ్డి గారు అంటున్నారు. జైపాల్‌రెడ్డిగారు ఏ లోకంలో ఉన్నారు?.. రాజీనామాలు చేసినా స్పీకర్లు ఆమోదించటం లేదు! మనం ఎన్ని ద్వారాలు మూసేసినా ఇంకో ద్వారం తెరుచుకుంటూనే ఉంది. 91వ రాజ్యాంగ సవరణ వచ్చాక ఈ 12 ఏళ్లలో స్పీకర్‌కు చెందిన పార్టీలోకి ఫిరాయించినవాళ్లను అనర్హులుగా ప్రకటించిన ఘటన దేశచరిత్రలో ఒక్కటి కూడా లేదు. పొరపాటున ఎక్కడైనా ఉంటే మన్నించమని కోరుతున్నా. ఫిరాయింపులకు పాల్పడేవారిని అనర్హులుగా ప్రకటించే అధికారం ఎన్నికల సంఘానికే ఉండాలన్నది రాజ్యాంగస్ఫూర్తి. రాజ్యాంగంలో ఇది స్పష్టంగా ఉంది. అనర్హత వేటు నిర్ణయం స్పీకర్ నుంచి ఎన్నికల సంఘానికి ఇవ్వాలని ప్రైవేటుగా అందరూ అంగీకరిస్తారు. 1998లో 12మంది బీఎస్‌పీ శాసనసభ్యులు పార్టీ వీడితే, స్పీకర్ కైలాష్‌పతి మిశ్రా మొత్తం ఆనాడున్న బీఎస్‌పీ సభ్యుల సంఖ్య 45-47లో మూడవవంతును తేల్చటానికి రెండేళ్లకు పైగా సమయం తీసుకున్నారు. ఆయన అవినీతిపరుడు కూడా కాదు. స్పీకర్ సొంత ప్రయోజనాల కోసం కాకుండా కూడా తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. కాబట్టి స్పీకర్ నుంచి ఎన్నికల సంఘానికి అనర్హత వేటు అధికారాన్ని బదిలీ చేయాలనటంలో పెద్దగా చర్చకు ఆస్కారం లేదు. అనేకమంది నిపుణులు, సంఘాలు సమగ్ర విశ్లేషణ చేసి ఈ సిఫార్సును ధృవీకరించారు.

మరోవైపు, పార్టీ ఫిరాయింపులను ఆపే పేరుతో ఎన్నికైన సభ్యులను పార్టీ నాయకత్వం బానిసలుగా చూడకూడదు. కానీ, ఈవేళ అది జరిగింది దేశంలో. ఎమ్మెల్యేలు, ఎంపీలు నోరు తెరిచే హక్కును కోల్పోయారు. అసలు నిజంగా అసెంబ్లీ, పార్లమెంటు అవసరంలేని పరిస్థితి ఏర్పడింది. అక్కడ ఏం చర్చ జరుగుతుంది? ఎవరు అభిప్రాయాలను చెబుతారు? పార్టీల నిర్ణయాన్ని సభ్యులు సమర్థించటం, అంకెలను చూసుకుని ఆమోదముద్ర వేయటమేగా జరుగుతోంది! రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ముస్లిం మహిళల పోషణ బిల్లును తీసుకొచ్చారు. ఆ చట్టం అసంబద్ధమైనదని, దుర్మార్గమైనదని, రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమైనదని కాంగ్రెస్ పార్టీలో అత్యధికులు భావించారు. కానీ అప్పటికే 52వ రాజ్యాంగ సవరణ అమల్లో ఉండటంతో విప్‌ను ధిక్కరించే సాహసం చేయలేకపోయారు. ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తే విప్ వల్ల అందరి పదవులూ ఊడతాయి. అందుకే ఆ బిల్లుకు నోరుమూసుకుని ఓటు వేశారు. భారతదేశ రాజకీయాన్ని పెను ప్రకంపనలకు లోను చేసిన చట్టమది. దాన్నుంచే అయోధ్య శిలాన్యాసం మొదలైంది, దాన్నుంచే రామమందిరం-మసీదు వివాదం వచ్చింది, దాన్నుంచే దేశ రాజకీయాల మీద మతప్రభావం పెరిగింది. కబీర్ హుస్సేన్‌లాంటి వాళ్లు గొంతు విప్పి ఖండిస్తే, క్రమంగా కనుమరుగవ్వాల్సి వచ్చింది. సిద్ధాంతం కోసం నిలబడిన వాళ్ల రాజకీయ జీవితాన్ని సమాధి చేసింది ఈ పదవ షెడ్యూల్. అలాగే రామస్వామి అనే న్యాయమూర్తి అభిశంసన. మీరంతా ఓటింగ్‌లో పాల్గనవద్దు అని కాంగ్రెస్ పార్టీ విప్ జారీ చేసింది. దీంతో న్యాయమూర్తులను ప్రజలకు జవాబుదారీ చేసే ఒక ఏర్పాటును ఇప్పటివరకూ ఈ దేశం సాధించుకోలేకపోయింది. విప్‌లతో పార్టీలు ప్రజాప్రతినిధుల్ని ఎలా బానిసలుగా మారుస్తున్నాయో చెప్పటానికి జీఎస్‌టీ బిల్లు తాజా ఉదాహరణ. ఆ బిల్లును రూపొందించింది కాంగ్రెస్ పార్టీ,

ఆ బిల్లును పూర్తిగా సమర్థిస్తోంది ఆ పార్టీ. అయినా రాజకీయాల కోసం ఆ బిల్లును అడ్డుకోవాలంటూ సభ్యులకు విప్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో, పార్టీ ఫిరాయింపులను నియంత్రించటం పేరుతో ప్రజాప్రతినిధుల స్వేచ్ఛను అరికట్టకుండా ఏర్పాట్లు కావాలి. అవిశ్వాస, విశ్వాస తీర్మానాలకు మాత్రమే విప్‌ను పరిమితం చేయాలి. విప్‌ల పేరుతో ప్రజాస్వామ్యాన్ని, దేశ ప్రయోజనాలను దెబ్బతీసే రాజకీయాలను ఎటువంటి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదు.

ఇక స్పీకర్‌ను గురించి. ఇది స్వల్పకాలికం కాకుండా దీర్ఘకాలిక లక్ష్యంతో చేయాల్సిన చర్చ కాబట్టి అన్ని కోణాలనూ సమగ్రంగా చూడాలి. బ్రిటన్‌లో స్పీకర్ గురించి జైపాల్‌రెడ్డిగారు చెప్పారు. 1979లో మార్గరెట్ థాచర్ బ్రిటన్ ప్రధానిగా వచ్చినప్పుడు 1976 నుంచి స్పీకర్‌గా ఉన్న జార్జి థామస్‌ను మార్చాలని భావించారు. ప్రత్యర్థి పార్టీ వాళ్లు కాకుండా మన పార్టీ వాళ్లే స్పీకర్‌గా ఉండాలని ఆమె పట్టుబట్టారు. అయితే ఆమె సొంత కన్జర్వేటివ్ పార్టీలోని వారే దాన్ని వ్యతిరేకించారు. ఇది దుస్సంప్రదాయం, స్పీకర్ అన్ని పార్టీలకూ సంబంధించినవాడు, ఆయనకు పార్టీలతో సంబంధం లేదు అని తేల్చిచెప్పారు. అలాగే ఇప్పుడు బ్రిటన్ స్పీకర్‌గా ఉన్న .... 2009లో లేబర్ పార్టీ తరపున ఎన్నికయ్యారు. స్పీకర్‌కు సంబంధించి బ్రిటన్ స్థూలంగా మూడు సంప్రదాయాలను పాటిస్తోంది. 1) స్పీకర్ పార్టీని చూడకూడదు 2) స్పీకర్ అయ్యాక ఇక జీవితంలో ఏ పార్టీకీ చెందదు 3) స్పీకర్ మళ్లీ ఎంపీగా ఎన్నికల్లో పోటీచేస్తే ఆయన మీద ఏ పార్టీ పోటీ పెట్ట కూడదు. ఈ మాటల్ని చెబితే మనదేశంలో గ్రీకు, లాటిన్ భాషల్ని వింటున్నట్టుగా మొహం పెడతారు. ముందు ఈ సంస్కరణలు, సంప్రదాయాలు అర్థం కావాలి. అందుకు కొన్నేళ్లు పడతుంది.

జైపాల్‌రెడ్డిగారు అన్యాపదేశంగా డబ్బు కోసం ఫిరాయింపుల్ని ప్రస్తావించారు. రూ.5-10కోట్లు ఖర్చు పెట్టి ఎమ్మెల్యేగా, రూ.50 కోట్లు ఖర్చుపెట్టి ఎంపీగా ఎన్నికయ్యాక వాళ్ల దృష్టి సంపాదన మీద కాక మరి దేనిమీద ఉంటుంది? సంపాదనకు అధికారం, ప్రభుత్వం అండ కావాలి. కొందరు నిజాయతీగా ఉండాలనుకున్నా మనుగడ కోసం ఈ మార్గాన్ని అనుసరిస్తుంటారు. ఈ వాస్తవాలు రాజకీయ పార్టీలన్నిటికీ తెలుసు. అందుకే ఫిరాయింపులపై మీరు, నేను భావిస్తున్నట్టుగా రాజకీయ పార్టీలు భావించటంలా. ఈ పార్టీ, ఆ పార్టీ అని తేడా లేకుండా అవకాశమొస్తే ఆ పార్టీల్లో నాయకులంతా అదే పని చేస్తారు. మనం అధికార పార్టీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలవైపు కొంత మొగ్గు చూపుతుంటాంగానీ, వాస్తవానికి ఈ ఫిరాయింపుల గొడవంతా రాజకీయాన్ని వ్యాపారంగా మార్చిన ట్రేడ్ యూనియన్ల మధ్య గొడవ! వాళ్ల మధ్య తేడా వుంటుందని భ్రమపడనక్కర్లా.

అందుకే అనర్హత వేటును ఎన్నికల సంఘానికి బదిలీ చేయటం, విప్‌ను విశ్వాస, అవిశ్వాస తీర్మానాలు, బడ్జెట్‌లకు పరిమితం చేయటంతోపాటు కేంద్రంలో నిర్మాణాత్మక అవిశ్వాస తీర్మానాలనే అనుమతించాలి. 2008 జులైలో అణుఒప్పందం మీద కేవలం యూపీయే ప్రభుత్వాన్ని పడగొట్టటానికి సైద్ధాంతికంగా బద్ధవ్యతిరేకులమని చెప్పుకునే బీజేపీ, వామపక్షాలు ఏకమయ్యాయి. బీజేపీ అణుఒప్పందానికి పూర్తి అనుకూలం. ఒకవేళ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం పడిపోతే బీజేపీ, వామపక్షాలు ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేవు. ఎటువంటి సైద్ధాంతిక నిబద్ధత లేని ఇటువంటి చర్యలను అడ్డుకోవటానికి నిర్మాణాత్మక ప్రత్యామ్నాయం చూపితేనే జాతీయస్థాయిలో అవిశ్వాస తీర్మానాలను అనుమతించే ఏర్పాటు చేయాలి. లేకుంటే దేశం తీవ్రంగా నష్టపోతుంది. ఇక అన్నిటికంటే కీలకం రాష్ట్రాల్లో ప్రత్యక్ష ఎన్నికలు. ఎమ్మెల్యేల రాజ్యాన్ని, పెత్తనాన్ని తొలగించి ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాటు చేయటం వల్ల సమర్థులు రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉంటుంది. అధికారం అంతా ముఖ్యమంత్రి చుట్టూ కేంద్రీకృతం కావటం, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు లేకపోవటం కూడా ఈ ఫిరాయింపుల జోరుకు కారణం. ఏ చిన్న పని కావాలన్నా- రోడ్లు, పారిశుద్ధ్యం, సహకార సంఘాలు, మార్కెట్ యార్డులు, అనుమతులు అన్నిటికీ ముఖ్యమంత్రే. సీఎం సర్వంసహాధికారిగా మారటం, తన పదవి కోసం ఎమ్మెల్యేల మీద ఆధారపడటం వల్ల ఫిరాయింపులను పెకిలించటం కష్టమవుతోంది. ఇప్పుడున్న వ్యవస్థలో సమర్థులు గెలవలేరు, గెలిచేవారు సమర్థంగా పాలించలేరు. ముఖ్యమంత్రిగా గెలవటానికి మరీ రూ.3,000 కోట్లు ఖర్చు చేయలేరు కాబట్టి ప్రత్యక్షంగా ఎన్నుకుంటే అవినీతికి కొంత కళ్లెం పడుతుంది. దీనివల్ల అద్భుతాలు జరుగుతాయనుకోలేంగానీ, పరిస్థితి అదుపులోకి వచ్చి కొంత మార్పయితే మొదలవుతుంది.

మన యువత మంచి భవిష్యత్తు గురించి ఆలోచన చేస్తున్నారు. నేను ఆశావాదిని. ఈ ప్రజాస్వామ్య పరిణామక్రమంలో ఇదో దశ మాత్రమే అని గుర్తించాలి. మనం విషయాల్ని కాస్త లోతుగా అర్థం చేసుకుని మన వంతు బాధ్యతను నిర్వర్తించగలిగితే మనం ఆశిస్తున్న మార్పు ఖచ్చితంగా వస్తుంది. ❧




# ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి: జేపీ

అవినీతి, నల్లధనానికి మూలమైన మనదేశ ఎన్నికల వ్యవస్థలో మార్పులపై దేశవ్యాప్త చర్చ జరగాలని, సంస్కరణల్ని వేగంగా అమలు చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ఎన్నుకోవటం, జాతీయస్థాయిలో అధికార పార్టీ అంగీకరించదు అనుకుంటే.. కనీసం రాష్ట్రాలలో దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టటం తక్షణావసరాలన్నారు.

'సమర్థుల ఎన్నికకు, సుపరిపాలనకు అవరోధంగా మారిన మన ఎన్నికల వ్యవస్థలో తక్షణం రావాల్సిన సంస్కరణలు–కార్యాచరణ'పై అన్నా హజారే నేతృత్వంలోని ఇండియా ఎగనెస్ట్ కరప్షన్ (ఐఏసీ) వలంటీర్ల బృందం న్యూఢిల్లీలో నిర్వహించిన సదస్సులో జేపీ పాల్గన్నారు. సదస్సులో వివిధ వ్యవస్థల్లో అపార అనుభవమున్న ఫాలి నారిమన్, టీఎస్ఆర్ సుబ్రమణియన్, టీఎస్ కృష్ణమూర్తి, డా॥ ఎన్.గోపాలస్వామి, పీఎన్ కల్కి, ప్రొఫెసర్ జగదీప్ ఛోకర్, పరంజోయ్ గుహ తదితరులు కూడా మాట్లాడారు. అనారోగ్యం వల్ల హాజరు కాలేకపోయిన అన్నా హజారే తన సందేశాన్ని పంపారు.

జేపీ మాట్లాడుతూ, శాసనసభలో చట్టాలు చేయాల్సిన ఎమ్మెల్యేలు ఆ పని మానేసి ప్రభుత్వ కార్యాలయాలను గుప్పెట్లో పెట్టుకుని ఓటు బేరాలాడుతున్నారని, అక్కడ్నుంచి మొదలైన అవినీతి, నల్లధనం చెద.. కుటుంబ రాజకీయాలు, ఓట్ల కొనుగోలు, ఫిరాయింపులుదాకా చేరి ప్రజాప్రయోజనాలను కాలరాస్తోందన్నారు. ఆ ఎమ్మెల్యేరాజ్‌ను అంతం చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పైరవీలు లేకుండా ప్రజలకు హక్కుగా రోజువారీ పనులు జరగాలన్నారు.

పార్టీల విరాళాలకన్నా.. ఎన్నికల వ్యయంలో ఎక్కువ శాతం ఓట్ల కొనుగోలుకు ఖర్చవుతుందన్న విషయాన్ని మనం గుర్తించాలని జేపీ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడలో ఏప్రిల్ 9, 2017న ఓ మునిసిపల్ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో ఓటుకు ప్రధాన రాజకీయ పార్టీలు (తెదేపా, వైకాపా) దేశం కనీవినీ ఎరుగనిరీతిలో రూ.15,000 వరకూ పంచాయన్నారు. ఇలాంటి ఎన్నికల వ్యవస్థలో ఎవరు గెలిచినా పెద్ద తేడా ఉండదని, ప్రజలు నిరంతరం ఓడిపోతూనే ఉంటారని అన్నారు. రాజకీయ పార్టీలు, నేతలను దొంగలు అని తిట్టుకోవటం వల్ల లాభం లేదని, ఈ విషవలయంలో వాళ్లు కూడా చిక్కుకుపోయారన్నారు.

ఈ మొత్తాన్నీ ప్రక్షాళన చేయటానికి.. ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికల నిర్వహణ వంటి చిన్నచిన్న మార్పుల వల్ల ఫలితం ఉండదని జేపీ అన్నారు. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, ప్రతి ఓటుకూ విలువ ఉండేలా దామాషా ఎన్నికల వ్యవస్థను తేవటంతోపాటు.. తమ ఓటు విలువను ప్రతి పౌరుడూ, పౌరురాలూ తెలుసుకునేలా అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు చేర్చాలని అన్నారు. ఏదో మాట్లు వేయటంలా కాకుండా.. నిధుల్ని, అధికారాన్ని వార్డు స్థాయి వరకూ ప్రజలకు ఇవ్వాలన్నారు. తలసరి రూ.1,000–2,000 ప్రతి పౌరుని పేరా కేటాయించి, భాగస్వామ్యం కల్పిస్తే.. తన ఇల్లు, తన చుట్టుపక్కల శ్రద్ధ పెరిగి పాలనలో ఓటు విలువ అర్థమవుతుందన్నారు. రాజకీయాన్ని కుటుంబ ఆస్తిగా, ప్రైవేటు వ్యాపారంగా కాకుండా.. ప్రజల భాగస్వామ్యమున్న నిత్యచైతన్యవంతమైన కార్యక్రమంగా మార్చే ఎన్నికల సంస్కరణల్ని వేగంగా తీసుకురావటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పౌరసమాజం, మీడియా సమష్టి కృషి చేయాలని జేపీ విజ్ఞప్తి చేశారు. ☙

# తెలంగాణ సుపరిపాలన ప్రస్థానంలో మైలురాయి అవుతుంది 'పౌరసేవల' చట్టం: జేపీ

## -లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రచురించిన బుక్‌లెట్ ఆవిష్కరణ-

గతిలేక లంచం ఇచ్చే పౌరులను కూడా శిక్షించేలా అవినీతి నిరోధక చట్ట సవరణను మోదీ ప్రభుత్వం తీసుకొస్తోందని, ఇది సరికాదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. పెద్ద నోట్లను రద్దు చేసినా అవినీతి, నల్లధనం ఆగలేదని మోదీ గుర్తించాలన్నారు. పై స్థాయిలో చట్టపరంగా సరైన ఏర్పాట్లు, కిందిస్థాయిలో పౌర సేవల చట్టంతో మాత్రమే అవినీతిని నియంత్రించగలమని, వీటికి ఎన్నికల సంస్కరణలు వంటివి కూడా జోడిస్తే అవినీతిరహిత భారతదేశ కల సాకారమవుతుందన్నారు. మాటలకు పరిమితం కాకుండా ఈ ఆచరణాత్మక పరిష్కారాల వైపు పాలకులు దృష్టి సారించాలన్నారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు, ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి నిఖిల్, జీహెచ్ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము, లోక్‌సత్తా ఉద్యమ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, యువసత్తా అధ్యక్షుడు శివరామకృష్ణ తదితర నేతలతో కలిసి.. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర విభాగం రూపొందించిన హక్కుగా 'పౌర సేవల' చట్టం బుక్‌లెట్‌ను హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జేపీ ఆవిష్కరించారు.





ఇలాంటి చట్టం తేవాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ప్రయత్నిస్తుండటం పట్ల ఈ సందర్భంగా జేపీ హర్షం వ్యక్తం చేశారు.

“మనదేశంలో కోట్లాదిమంది ప్రజలు ఇప్పటికీ ఓ ప్రభుత్వాధికారిని చూస్తే వణికిపోతుంటారు. బ్రిటిష్ కాలం నాటి పాలనావ్యవస్థనే కొనసాగిస్తుండటం వల్ల అధికారుల ఆధిపత్య ధోరణులు ఇలా ప్రజలను వేధిస్తున్నాయి. లంచం, వేధింపులు, అవమానాలు లేకుండా ప్రజలకు సేవ చేసే ఉద్యోగులు, నాయకులు ఈదేశంలో చాలా అరుదు. సాంకేతికత పెరిగినా, అవినీతి మాత్రం అదుపులోకి రాలేదు. ఈ నేపథ్యంలోనే లోక్‌సత్తా 'ప్రజలే ప్రభువులు.. పాలకులు సేవకులే' అనే తన నినాదానికనుగుణంగా.. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలదించేందుకు ఉపయోగపడే సిటిజన్ ఛార్టర్ల కోసం 1998 నుంచి కృషి చేస్తోంది. వీటిపై ప్రజల్లో చైతన్యం తేవటానికి 'స్వరాజ్యం' పేరుతో పౌరసేవల పత్రాలను పుస్తకంగా ప్రచురించింది. లక్షల కాపీలను తక్కువ ధరకు సర్క్యులేట్ చేసింది. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా నిర్ణీత గడువులోగా పనులు చేసి పెట్టాలని, లేకుంటే రోజుకు రూ. 250కు తక్కువకాకుండా పరిహారం చెల్లించాలని లోక్‌సత్తా పోరాడుతోంది. పార్లమెంటరీ కమిటీ ఆహ్వానం మేరకు ఈ తరహాలోనే 'పౌర సేవల' చట్టాన్ని తయారుచేసి ఇచ్చింది. ఆ జాతీయ బిల్లు పార్లమెంటు ముందు ఉంది. ఈలోగా తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు గారు కూడా రాష్ట్రంలో ఇలాంటి చట్టం తేవాలనే ఆలోచనలో ఉన్నట్టు వార్తలు చూశాను. మంచి చేయటంలో ఆలస్యం చేయకూడదు గదా! వెంటనే కేసీఆర్‌గారిని అభినందిస్తూ, ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ఇప్పటికే

తయారుచేసిన పౌర సేవల (రైట్ టూ సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ) నమూనా చట్టం బిల్లును జత చేసి పంపాను. ఈ బిల్లు త్వరలో తెలంగాణలో చట్టం అవుతుందని ఆశిస్తున్నాను. సమాచార హక్కు చట్టం కంటే శక్తిమంతమైనది పౌర సేవల చట్టం! ఇది గనక పకడ్బందీగా అమలులోకి వస్తే, తెలంగాణ రాష్ట్ర సుపరిపాలన ప్రస్థానంలో మైలురాయి అవుతుందనటంలో సందేహం లేదు. ప్రజలకు రోజువారీ సేవల్లో ఎంతో వెసులుబాటు కలుగుతుంది. లోక్‌సత్తా బిల్లులో ఎలక్ట్రానిక్ సేవలను కూడా కలిపి తయారుచేశాం. వివరాలను సంక్షిప్తంగా ఈ పుస్తకం ద్వారా లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర నేతలు మీకు అందిస్తున్నారు. వీటిపై మీరు హేతుబద్ధ సూచనల్ని కూడా తెలియచేయవచ్చు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నేతల ప్రయత్నాన్ని అభినందిస్తూ.. పటిష్ట పౌరసేవల చట్టాన్ని తెలంగాణలో అమలులోకి తేవటానికి, పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవటానికి పార్టీలకతీతంగా మీరందరూ కలిసిరావాలి" అని జేపీ విజ్ఞప్తి చేశారు.

## విద్య కోసం రాజకీయమే పూలేకి నివాళి

మహాత్మాపూలే 191వ జయంతిని లోక్‌సత్తా పార్టీ ఖమ్మం నేతలు ఘనంగా నిర్వహించారు. విద్య చుట్టూ రాజకీయమే పూలేకి నిజమైన నివాళి అని, లోక్‌సత్తా కొత్త రాజకీయంలో విద్యకు తొలి ప్రాధాన్యత ఉందని అన్నారు. నాణ్యమైన విద్యలో తెలంగాణ దేశంలోనే వెనకబడి ఉండటం దారుణమని, బీసీ కులాల చుట్టూ ఓట్ల రాజకీయం చేస్తున్నారు తప్ప వారికి సరైన విద్య ఎలా అందివ్వాలని అని అసెంబ్లీలో చర్చించలేదన్నారు. ఆంధ్రాబ్యాంకు మేనేజర్ రాజు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొర్లకంటి బాలస్వామి, బాధ్యులు వెంకట్రావు,



పగడాల నగేష్, శ్రీనివాసరావు, బోనేపల్లి రాజా తదితరులు పాల్గొన్నారు.

## చంపారన్ వందేళ్ల పండుగ చేస్తాం



దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు వచ్చిన తరువాత గాంధీజీ నిర్వహించిన తొలి శాంతియుత పోరాటానికి ఈ ఏడాది వందేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని లోక్‌సత్తా పార్టీ నిర్వహిస్తుందని పార్టీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లేటి రమేష్ కుమార్ అన్నారు. నీలి పంటల పెంపకం పేరుతో బీహార్‌లోని చంపారన్ రైతులపై తెల్ల, నల్ల భూస్వామ్య దొరలు సాగిస్తున్న అణచివేతకు వ్యతిరేకంగా 1917 ఏప్రిల్ నుంచి సృజనాత్మక పోరాట పంథాలో గాంధీజీ ఉద్యమాన్ని చేపట్టి విజయం సాధించారని గుర్తు చేవారు. వలస పాలకులపై గాంధీ అనుసరించిన హర్తాళ్, బంద్, ఆమరణ నిరాహారదీక్ష వంటి పద్ధతులకు లోక్‌సత్తా వ్యతిరేకమని.. కానీ గాంధీ పాటించిన సృజనాత్మక ఒత్తిడి పోరాటపంథాను అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగ పద్ధతులలో లోక్‌సత్తా అనుసరిస్తుందని వివరించారు. అంతకుముందు, అంబేద్కర్ 126వ జయంతి వేడుకలను రమేష్ నిర్వహించారు. కనీస మానవ గౌరవానికి నోచుకోని కోట్లాదిమంది భారతీయులను అంబేద్కర్ షెడ్యూల్డ్ కులాలు, తెగల కింద సంఘటితం చేశారని, నాణ్యమైన విద్య, వైద్యం, రాజ్యాంగబద్ధ ఆందోళనా పద్ధతులతోనే బాబాసాహెబ్ ఆశయాలను సాధించగలమని అన్నారు. కార్యక్రమంలో కిరణ్, శ్రవణ్, సైదులు, భరత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రుణమాఫీ, ఉచితాల బదులు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి కొనాలి, ప్లెడ్జి రుణాలు ఇప్పించాలి: జేపీ



రుణమాఫీ, ఎరువులు వంటివి ఉచితంగా ఇవ్వటం వల్ల రాజకీయ పార్టీలకు ఓట్లు వస్తాయేమోగానీ రైతుల కష్టాలు తీరవని.. ఆ డబ్బుతో ధరల స్థిరీకరణ నిధి, గిడ్డంగుల నిర్మాణం, మార్కెట్ యార్డుల ఆధునీకరణ చేసివుంటే ఈ ఏడాది మిర్చి రైతులకు ఇన్ని కష్టాలు వచ్చేవి కావని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఒక ప్రాంతంలో నాలుగు లక్షల ఎకరాలలో సాగుచేసిన మిర్చి పంట రైతులకే ఒక్క సీజన్‌లో రూ. 5వేల కోట్లు నష్టం వస్తే.. రాష్ట్రంలో ఏటా 60-70 లక్షల ఎకరాలలో సాగు చేస్తున్న పంటలకు గిట్టుబాటు ధర రాకపోతే రైతులు ఏ స్థాయిలో నష్టపోతారో ఊహించుకోవచ్చన్నారు. 'రైతుకు ఆదాయం' వ్యవసాయ విధానంలో తొలి ప్రాధాన్యాంశం కావాలన్నారు. అందుకే, రుణమాఫీ, ఉచితాల హామీలతో ఎవరు వచ్చినా.. ఆ డబ్బును ధరల స్థిరీకరణ నిధికి కేటాయించేలా డిమాండ్ చేద్దామని, ఇందుకోసం రైతుసంఘాలు కలిసిరావాలని పిలుపునిచ్చారు.

ఆసియాలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందిన గుంటూరు మిర్చియార్డును జేపీ సందర్శించి పంట ధరల పతనంపై రైతులనడిగి వివరాలు తెలుసుకున్నారు. గుంటూరు జిల్లా రైతులతో పాటు.. ప్రకాశం జిల్లా, తదితర ప్రాంతాల నుంచి కూడా వచ్చిన రైతులు తమ గోడు చెప్పుకున్నారు. సాగు ఖర్చు గణనీయంగా పెరిగిందని, గిట్టుబాటు ధర కూడా లభించకపోవటంతో ఆర్థికంగా అల్లాడుతున్నామని కన్నీటిపర్యంతమయ్యారు. గత ఏడాది మేలురకం మిర్చి క్వింటాలుకు రూ. 13వేలకు విక్రయించామని, ఈ ఏడాది రూ. 5వేలు కూడా పలకకపోవటంతో ఖర్చులు కూడా రావటం లేదన్నారు. సాగు ఖర్చు ఎకరాకు లక్ష నుంచి లక్షన్నర అవుతుందని, కూలీల ఖర్చు అమాంతం పెరిగిపోయిందని, వర్షాభావం కారణంగా ఎకరాకు దిగుబడి 15 నుంచి 20 క్వింటాళ్లు మాత్రమే రావటంతో నష్టాల ఊబిలో కూరుకుపోతున్నామన్నారు. రైతులు తమ సమస్యలను వివరిస్తుండగా, ఒకదశలో యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. అయినా రైతులు ఆగలేదు. గత రెండు మాసాల నుంచి ఇదిగో కొంటాం, అదిగో కొంటాం అని ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని వివరించారు. లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భీశెట్టి బాబ్జీ, కల్లూరి బాలసుబ్రమణ్యం, స్టీరింగ్ కమిటీ సభ్యుడు మాదాసు భానుప్రసాద్ జేపీ వెంట ఉన్నారు.



యార్డంతా కలియదిరిగి మిర్చి కాయలను పరిశీలించిన అనంతరం జేపీ మాట్లాడుతూ.. మిర్చి రైతులు బిచ్చం వేయండని అడగటం లేదని, తమ పంటకు గిట్టుబాటు ధర మాత్రమే అడుగున్నారని అన్నారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న మిర్చి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని, వెంటనే రూ. 1000 కోట్లు మిర్చి కొనుగోలుకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్‌లను రంగంలోకి దించి కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. దేశవాళి మిర్చి రకాలను క్వింటా రూ. 7,500, సూపర్ క్వాలిటీ వెరైటీలను రూ. 9వేలకు కనీసం 25లక్షల టిక్కీలు కొనుగోలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన మిర్చి టిక్కీలను నిల్వ చేసేందుకు ఇతర రాష్ట్రాలలోని శీతల గిడ్డంగులను లీజుకు తీసుకోవాలని, నిల్వ చేసిన మిరపకాయలపై రైతులకు టిక్కీకి రూ. 1200 రుణం తీసుకునేలా బ్యాంకర్లతో మాట్లాడాలని సూచించారు. ఈ

చర్యలు చేపడితే మార్కెట్‌లో కొంత స్థిరత్వం వస్తుందన్నారు. పనికిమాలిన పనులకు వేలకోట్లు తగలేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఈ మాత్రం ఇవ్వలేవా? అని ప్రశ్నించారు. మిర్చి రైతుల సమస్యలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి చర్చిస్తానని తెలిపారు.

మిర్చి యార్డు పాలకవర్గ సభ్యులు, ఎగుమతి వ్యాపారులతో కూడా జేపీ సమావేశమయ్యారు. ఈ ఏడాది సాగువిస్తీర్ణం 20శాతం మేర పెరగటం, డిమాండ్ తగ్గటం వల్ల సమస్య తలెత్తిందని, గత కొన్ని రోజులుగా ఈ సమస్యకు సంబంధించిన అందరితో సమావేశాలు నిర్వహించి గత వ్యవసాయ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ప్రస్తుత మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ద్వారా ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపామని ఈ సందర్భంగా మన్నవ సుబ్బారావు జేపీకి వివరించారు. ఢిల్లీలో కేంద్ర వ్యవసాయమంత్రితోనూ చర్చలు జరుగుతున్నాయని, క్వింటాలుకు రూ. 1500 వరకూ రాష్ట్ర బోనస్ ప్రకటించటం వంటి చర్యల గురించి చెప్పారు. జేపీ జోక్యం చేసుకుంటూ, పంటల డిమాండ్ అంచనాల గురించి రైతులకు ముందుగానే వివరించటంలో ప్రభుత్వం విఫలమైందని, సీజన్ ప్రారంభం నుంచి మిర్చి ధరలు పడిపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. రైతులకు తెగ రాయితీలు ఇచ్చేస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వాలు ఏటా మార్కెట్ కమిటీల నుంచి వచ్చే వందల కోట్ల రూపాయలను పక్కదోవ పట్టిస్తున్నాయని, రైతుల ఆదాయానికి గండికొట్టి ఆహారధాన్యాల ధరలను తగ్గించటం తమ ఘనత అని మోసం చేస్తున్నాయని అన్నారు. రైతులను విపత్కర పరిస్థితుల్లో ఆదుకునేందుకు రూ. 5,000కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామన్న హామీని తెలుగుదేశం ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రుణమాఫీ



తర్వాత రైతులకు రుణాలు ఇవ్వటం తగ్గించిన బ్యాంకులు కోల్డ్‌స్టోరేజీల యజమానులకు మాత్రం ఇస్తున్నాయని, ప్రైవేటు గోదాముల అద్దెలను భరించలేక రైతులు అక్కడ నిల్వ చేసుకోలేకపోతున్నారని జేపీ అన్నారు. రైతులకు అందుబాటులో స్టోరేజీల సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించాలన్నారు. గిడ్డంగులు, ప్లెడ్జి రుణాలు, ధరలు తగ్గినప్పుడు ఈ నిధి ద్వారా ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకోవటం వంటి చర్యలుంటే రైతుల పరిస్థితి మరీ ఇంత దయనీయంగా మారదని, ఇవన్నీ చాలా తేలిగ్గా చేయగల పనులేనని అన్నారు.

తెలంగాణలో కూడా మిర్చికి, ఇతర కొన్ని పంటలకు ధర లభించక రైతులు అల్లాడుతున్నారని.. తమ పంటలకు న్యాయమైన ధరను సంపాదించుకునేందుకు రైతులంతా ఏకమై కాస్త అవగాహనతో పోరాడాలని జేపీ పిలుపునిచ్చారు.

మార్కెట్ యార్డు కార్యదర్శి దివాకర్, మిర్చి రైతుల వ్యాపారసంఘం నాయకుడు సాంబిరెడ్డి, ఎగుమతిదారుల సంఘం నాయకుడు దుగ్గరాజు, కోల్డ్‌స్టోరేజీ యజమానుల సంఘం నాయకుడు ప్రకాష్, లోక్‌సత్తా పార్టీ నాయకులు మోదుగుల శ్రీనాథ్‌రెడ్డి, కొనిశెట్టి దుర్గాదేవి, నరసింహారావు, సత్యనారాయణ, భూపతిరాజు, బషీర్, ఏసుబాబు, సాంబశివరావు తదితరులు కూడా పాల్గొన్నారు.

## అప్పుల ఊబిలో తెలుగు గ్రామీణులు

తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణులే దేశంలో అత్యధికంగా రుణాల ఊబిలో కూరుకుపోయినట్టు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి సంతోష్ గంగ్వార్ రాజ్యసభకు తెలిపారు. తెలంగాణలో అత్యధికంగా 59.06శాతం మంది గ్రామీణులు అప్పుల్లో ఉండగా, ఆ తర్వాతి స్థానంలో ఆంధ్రప్రదేశ్ (54.06శాతం) నిలిచిందన్నారు. ఇది జాతీయ సగటు 31.44శాతం కన్నా చాలా ఎక్కువన్నారు. ఈశాన్య రాష్ట్రాల గ్రామీణులపై అప్పుల భారం తక్కువగా ఉన్నట్టు చెప్పారు. అల్పాదాయం, ఆర్థిక అక్షరాస్యత లేకపోవటం, వర్షాభావం, అప్పులు వారసత్వంగా రావడం, వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు తీసుకోవటం ఇందుకు కారణాలన్నారు.

# రైతులు కలసివస్తే ఎంత పోరాటమైనా చేస్తా: జేపీ



"మీరంతా వర్గాలుగా విడిపోయి కొట్టుకోకుండా కలసికట్టుగా ముందుకు వస్తానంటే.. ఏ స్థాయి దాకానైనా పోరాటం చేసి మీ హక్కులను కాపాడతా" అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ రైతులకు భరోసా ఇచ్చారు.

మండలంలోని శ్రీరంగపట్నం గ్రామంలో కోరుకొండ దేవస్థానం భూముల వివాదంపై రైతుల సమావేశంలో జేపీ మాట్లాడారు. 2013లో వచ్చిన చట్టం ప్రకారం భూములు, ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి వందలమంది రైతులు రోడ్డున పడటం విచారకరమన్నారు. ఈ దేవస్థానం భూముల విషయంలో కొంత గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. గతంలో ఈనాంగా ఇచ్చినప్పటికీ 30 ఏళ్ల క్రితమే రైతుల పేరిట రిజిస్ట్రేషన్ జరిగి ఉంటే ఇక ఆ భూములకు పూర్తి హక్కుదారులు రైతులేనన్నారు. కోరుకొండ దేవస్థానానికి చెందినవిగా పరిగణిస్తున్న సుమారు 900 ఎకరాల భూమికి సంబంధించిన పూర్తి వివరాలు సిద్ధం చేయాలన్నారు. భూములు ఎప్పుడు కొన్నారు, వాటి లింకు దస్తావేజులు, ఎప్పుడు రిజిస్ట్రేషన్ అయ్యాయి తదితర వివరాలను ఎవరికివారు సిద్ధం చేసుకోవాలన్నారు. లోక్‌సత్తా ప్రతినిధి బృందాన్ని పంపిస్తానని, వారికి వివరాలు తెలియచేయాలని సూచించారు. ఈ వ్యవహారంపై కలెక్టర్, సంబంధిత మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని జేపీ తెలిపారు. లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, జిల్లా అధ్యక్షుడు ముదనూరి రాజ్ వర్మ, స్థానిక నాయకులు కాళ్లకూరి కృష్ణమోహన్, సూరిశెట్టి కుటుంబరావు, నాగులపాటి బాలాజీ, నాగులపాటి బాలాజీ, బుద్దా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వం ఎవరిదైనా.. ఈ పనులు మారవు**

ఏ పార్టీ ప్రభుత్వం వచ్చినా, ప్రభుత్వ లక్ష్యాలు ఏవైనా.. ప్రజల కోసం చేయాల్సిన కొన్ని మౌలికమైన పనులు మారవని జేపీ స్పష్టం చేశారు. వివక్ష లేకుండా ఎదిగేందుకు ప్రతి బిడ్డకూ అవకాశాన్నిచ్చే విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్య అత్యంత అధ్వాన్నంగా ఉందన్నారు. కాకినాడలో ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రతి సర్కారీ/ఎయిడెడ్ బడి విద్యార్థి మీదా ఏపీ ప్రభుత్వం ఏడాదికి రూ.45,000 ఖర్చు పెడుతోందని, కానీ ఫలితం మాత్రం 'బారెడు ఖర్చుకు మూరెడు నాణ్యత కూడా లేదన్నట్టుందని' జేపీ అన్నారు. విద్యకు బడ్జెట్ కేటాయింపు అంటే.. ఉపాధ్యాయులకు జీతాలివ్వటం మాత్రమే కాదన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభాపాటవాలు వికసించేలా, తలెత్తుకుని ఎక్కడైనా సొంత సంపాదనతో బతకగలిగేలా పాఠశాల విద్యావ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. విద్యపై వెచ్చించే ప్రతి రూపాయికీ విద్యార్థి జీవితంలో, సమాజంలో విలువ కనిపించేలా పకడ్బందీ విధానాలను అమలు చేయాలన్నారు. రాజకీయ ప్రయోజనాలను వీడి ఇప్పటికైనా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య మీద ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర వైద్య విద్యార్థులు ఇతర రాష్ట్రాలతో పోటీ పడకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒప్పందం ఉందని, దీనికి వ్యతిరేకంగా తాను అసెంబ్లీలో కూడా వాదించానని, ఇప్పటికైనా దీన్ని రద్దు చేసి వైద్య విద్యలో జాతీయస్థాయి పోటీకి అవకాశం కల్పించాలన్నారు. జాతీయస్థాయి పరీక్షల్లో సామర్థ్యాన్ని నిరూపించుకుని దేశవ్యాప్తంగా పలు కళాశాలల్లో సీట్లు సంపాదించుకునే సత్తా తెలుగు విద్యార్థులకు ఉందని జేపీ అన్నారు.

# హామీలు అమలుచేయకుంటే చర్యలుండాల్సిందే

ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు మేనిఫెస్టోల ద్వారా ఇచ్చే హామీల్ని నెరవేర్చకపోతే ఊరుకోకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ చేసిన వ్యాఖ్యలను లోక్‌సత్తా పార్టీ స్వాగతించింది. ఇదే విషయాన్ని లోక్‌సత్తా పలు సందర్భాలలో చెప్పిందని పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు గుర్తుచేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ముఖ్యనేతల సమావేశంలో ఖేహర్ వ్యాఖ్యల గురించి చర్చ జరిగింది.

రైతులకు స్వామినాథన్ కమిషన్ చెప్పినట్టు పంటఖర్చుకు యాభై శాతం అదనంగా మద్దతు ధర నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా వరకు మేనిఫెస్టోలోని పలు కీలకాంశాల విషయంలో ప్రజలను మోసం చేసిన బీజేపీ అగ్రనేతలు కూడా ఖేహర్ వ్యాఖ్యలను స్వాగతించటం విచిత్రంగా ఉందని పాండురంగారావు అన్నారు. మిర్చి, కందులు, ఉల్లి, చివరకు ధాన్యం రైతులకు కూడా న్యాయమైన ధర ఇప్పించకుండా ఫిరాయింపుల వంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న పాలకులే సంస్కర్తలన్నట్టు నటిస్తున్నారని, ప్రజలు ఇటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రలోభాలకు లోనుచేయకుండా ప్రజల నిజమైన అవసరాలకు తగ్గట్టు, వారు స్వేచ్ఛగా ఓటు వేసేలా మేనిఫెస్టోలను రూపొందించటం, వాటిని నూరుశాతం అమలుచేయకపోతే చర్యలు దిశగా ఇప్పటికైనా పటిష్టమైన ఏర్పాట్లు అవసరమన్నారు.

**ప్రజాస్వామ్యాన్ని అవమానించిన మోదీ**

సాక్షాత్తూ చట్టాలను చేసే పార్లమెంట్‌లో మంత్రి అశోక్‌గజపతిరాజుపై చేయి చేసుకోబోయిన శివసేన ఎంపీ, మంత్రి చర్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఖండించకపోవటం సిగ్గుచేటని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఎయిరిండియా డ్యూటీ అధికారిని చెప్పుతో కొట్టి కనీసం క్షమాపణ ఊసు కూడా ఎత్తకుండా, సభలో విమానయాన మంత్రి పట్ల కూడా నిర్లక్ష్యంగా మాట్లాడిన ఎంపీపై ప్రయాణ నిషేధాన్ని ఆఘమేఘాల మీద ఎత్తివేయటం ఎలాంటి సంకేతాన్నిస్తుందని ప్రశ్నించారు. ఎంపీలైనా, ఇతర ప్రజాప్రతినిధులైనా ప్రజాప్రయాణీకులలాంటివారేనని, భద్రత విషయంలో ఎవరినీ ఉపేక్షించకూడదన్నారు. సభలో ఇలాంటి సంఘటన పట్ల చర్యలు తీసుకోలేని అసమర్థ ప్రభుత్వం.. బడ్జెట్ సమావేశాలు గొప్పగా జరిగాయని జబ్బలు చరుచుకోవటం మీడియా రాజకీయం తప్ప ప్రజాస్వామ్య పాలన అనిపించుకోదన్నారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు చిన్నారావు, నాగభూషణం, రాజారావు, కోటేశ్వరరావు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

# గంగాధరంలాంటి వాళ్ల బినామీలు ఇక్కడా ఉన్నారు!

విజయనగరం జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి ఊడలూనుకుని విస్తరిస్తోందని లోక్‌సత్తా పార్టీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఆకుల దామోదరరావు అన్నారు. పైనుంచీ పాలన చేస్తుండటం వల్ల క్షేత్రస్థాయిలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. వేసిన చోటే రోడ్లు వేయటం, కాంట్రాక్టులకు రాజకీయ నాయకులే బినామీలుగా ఉండటం యథేచ్ఛగా కొనసాగుతోందన్నారు. ప్రజాప్రతినిధులు–అధికారులు కుమ్మక్కుకావటం వల్ల జిల్లాలో అభివృద్ధి, పౌరసేవలు కుంటుపడ్డాయన్నారు. రహదారులు, భవనాల శాఖ ఈఎన్‌సీ గంగాధరం సహా పలువురు అధికారుల అక్రమాస్తులు విజయనగరం జిల్లాలో కూడా ఉన్నాయని, పౌరసేవల చట్టం, బినామీ ఆస్తుల చట్టాన్ని పకడ్బందీగా అమలుచేస్తే బరియల్లోని




పందికొక్కులు బైటికొస్తాయని మీడియాతో మాట్లాడుతూ అన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, భీంపల్లి భాస్కరుడు పాల్గొన్నారు.



# విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి కోసం ఉస్మానియాలో జరిగిన పోరాటం

- అంపశయ్య నవీన్

***ఉస్మానియా విశ్వవిద్యాలయం నూరేళ్ల ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా 1966-67 సంవత్సరాల్లో ఆ వర్సిటీ స్వయంప్రతిపత్తి కోసం ఒక వైస్‌ఛాన్సలర్ జరిపిన పోరాటాన్ని గుర్తు చేసుకోవాలనిపించి ఈ వ్యాసం రాస్తున్నాను.***

ఉస్మానియా విశ్వవిద్యాలయానికి డి.ఎస్ రెడ్డి గారు రెండుసార్లు (1962 నుంచి 65 వరకు, 1965 నుంచి 68 వరకు) వైస్‌ఛాన్సలర్‌గా పనిచేశారు. నేను ఉస్మానియాలో ఎం.ఏ చదువుతున్న రోజుల్లో– అంటే 1962 నుంచి 1964 వరకు డి.ఎస్ రెడ్డిగారే వైస్‌ఛాన్సలర్‌గా ఉన్నారు. ఆయనకు మంచి పరిపాలనాదక్షుడని, వైస్‌ఛాన్సలర్‌గా పదవికి వన్నె తెచ్చారని ఉస్మానియాలో చదువుకుంటున్న విద్యార్థులు, అక్కడ పాఠాలు చెబుతున్న అధ్యాపకులు చెప్పుకునేవారు. అయితే ఆయనకు రెండోసారి వైస్‌ఛాన్సలర్ పదవి ఇచ్చినప్పుడు, ఆయన పదవీకాలం పూర్తికాకుండానే అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి గారు ఆయనను ఆ పదవి నుంచి తొలగించి, నరసింహారావు అనే ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఆచార్యుడిని ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్‌గా నియమించారు. డి.ఎస్ రెడ్డిగారిని ఇలా అర్థంతరంగా తొలగించటం అటు ఉస్మానియాలో పనిచేస్తున్న అధ్యాపకులకు, ఇటు అక్కడ చదువుకుంటున్న విద్యార్థులకు చాలా ఆగ్రహం తెప్పించింది. కొత్తగా నియమితుడైన నరసింహారావుగారు వైస్‌ఛాన్సలర్‌గా ఛార్జి తీసుకోవటానికి ఉస్మానియాకొస్తే విద్యార్థులాయన్ని అడ్డుకున్నారు. విశ్వవిద్యాలయాలకు రాజ్యాంగం ఇచ్చిన స్వయంప్రతిపత్తి (అటానమీ)కి ముఖ్యమంత్రిగా బ్రహ్మానందరెడ్డి గారు తీసుకున్న చర్యే గొడ్డలిపెట్టులాంటిదని డి.ఎస్ రెడ్డిగారొక స్టేట్‌మెంట్ ఇచ్చారు. అధ్యాపకులు, విద్యార్థులు డి.ఎస్ రెడ్డిగారికి తమ మద్దతు ప్రకటించారు. ఆయననే వీసీగా కొనసాగించాలని ఉద్యమాన్ని చేపట్టారు. అప్పుడే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కూడా రాజుకుంటోంది. ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన నరసింహారావును ఉస్మానియాకు వీసీగా నియమించటాన్ని ప్రత్యేక తెలంగాణవాదులు తీవ్రంగా వ్యతిరేకించి డి.ఎస్ రెడ్డిని సమర్థించారు. అంతకుముందు ఐదు సంవత్సరాలు వీసీగా పనిచేసిన క్రమంలో డి.ఎస్ రెడ్డి తన పరిపాలనలో అధ్యాపకులకు, విద్యార్థులకు అత్యంత ప్రీతిపాత్రుడవటం మాత్రమే కాకుండా.. తాను విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని కాపాడటం కోసం పోరాడుతున్నానని ప్రకటించటం కూడా ఉస్మానియా విద్యార్థులు ఆయనను బలపరచటానికి కారణం.

పోలీసు ప్రొటెక్షన్‌తో నరసింహారావుగారు ఉస్మానియా వైస్‌ఛాన్సలర్‌గా ఛార్జి తీసుకున్నప్పటికీ ఆయన ఎంతోకాలం ఆ పదవిలో కొనసాగలేకపోయారు. ఆయన వెళ్లిపోవాలని,

డి.ఎస్ రెడ్డిగారికే ఆ పదవిని కట్టబెట్టాలని విద్యార్థులు పెద్దఎత్తున ఉద్యమాన్ని నడిపారు. దాంతో నరసింహారావుగారు తన పదవికి రాజీనామా చేసి వెళ్లిపోవలసి వచ్చింది. ఈ విషయంలో హైకోర్టు కూడా జోక్యం చేసుకుని, డి.ఎస్ రెడ్డి పదవీ కాలం పూర్తి కాకుండానే తొలగించటం విశ్వవిద్యాలయ స్వయంప్రతిపత్తికి విఘాతం కలిగించే చర్య అని పేర్కొంది. ఆ విధంగా డి.ఎస్ రెడ్డినే తిరిగి వైస్‌ఛాన్సలర్‌గా నియమించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని కాపాడటం కోసం జరిగిన ఈ ఉద్యమమే తర్వాత 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమానికి దారి తీసిందని పలువురు విశ్లేషకులు భావించారు.

ఉస్మానియాలో విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి కోసం విద్యార్థులు జరిపిన పోరాటాన్ని గుర్చి ప్రస్తావిస్తూ అప్పటి భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్.. ఒక విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ తన పదవిని కాపాడుకోవటం కోసం విద్యార్థులను రెచ్చగొట్టి ఉద్యమబాట పట్టించారని, విద్యార్థులను ఇలా తమ పదవిని కాపాడుకోవడం కోసం ఉపయోగించుకోవడం తప్పని పేర్కొన్నారు.

డి.ఎస్ రెడ్డి పదవీకాలం ముగిశాక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణకు చెందిన వ్యక్తినే ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్‌గా నియమించాలన్న నిర్ణయం తీసుకొన్ని, రావాడ సత్యనారాయణ గార్ని ఆ పదవికి ఎంపికచేసింది. సత్యనారాయణ గారి పదవీకాలంలోనే, అంటే 1969లోనే తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. సత్యనారాయణ గారు బాహాటంగా ఆనాటి తెలంగాణ ఉద్యమాన్ని బలపరచిన సంగతి అందరికీ తెలిసిందే. మొత్తమ్మీద 1966-67 సంవత్సరాల్లో విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి కోసం ఉస్మానియాలో డి.ఎస్ రెడ్డి గారి ద్వారా జరిగిన ఈ పోరాటం చరిత్ర గతినే మార్చే పరిణామాలకు దోహదం చేసింది.

## ఆర్థిక సంఘాన్ని ఎందుకు రద్దు చేశారో చెప్పండి

పంచాయతీలకు నిధులు, అధికారాలు లేకుండా ఉత్సవ విగ్రహాల్లా తయారు చేశారని, ఆంధ్రప్రదేశ్‌లోని 12,918 పంచాయతీలలో ప్రజాప్రతినిధులకు బదులు అధికార పార్టీ కార్యకర్తలతో నింపిన జన్మభూమి కమిటీలు పెత్తనం చెలాయిస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. 73వ రాజ్యాంగ సవరణ జరిగి 23 ఏళ్లయినా, ఇప్పటికీ పంచాయతీలకు రావలసిన 29 అధికారాలను బదలాయించలేదని విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. రాష్ట్రంలో పంచాయతీల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు, అవసరమైన సలహాలు ఇచ్చేందుకు ఉపయోగపడే నాలుగో ఆర్థిక సంఘాన్ని ఎందుకు రద్దు చేశారు? అని ప్రశ్నించారు. గొప్ప పనితీరు కనబరుస్తానని ప్రతిజ్ఞలు చేస్తున్న పంచాయతీరాజ్ మంత్రి లోకేష్ వీటన్నిటి మీదా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు పతివాడ చంద్రరావు, బూడి సన్యాసినాయుడు, శిమ్మ శ్రీను, సత్యారావు, భాస్కర్, రాజారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల మిర్చి అమ్మిపెట్టండి ముఖ్యమంత్రి సారూ!



"ముఖ్యమంత్రి ఎకరాకు కోటి సంపాదిస్తారు..
ఆయన కొడుకు ఐస్‌క్రీమ్ అమ్మితే రూ.5లక్షలు వస్తయి..
కూతురు ఒక్క చీర అమ్మితే 10లక్షలు వస్తయి..
అల్లుడు అందరినీ మించినోడు..
అయ్యా, ముఖ్యమంత్రి గారూ! మీరు, మీ కుటుంబం ఒక్కసారి వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు వెళ్లి
రైతుల మిర్చి అమ్మిపెట్టండి దొరా..
మీరు ఎంతకైనా అమ్ముకోండి.. రైతులకు మాత్రం క్వింటాకు రూ.10వేలు ఇయ్యండి చాలు.."

– భవానీ పేరిచర్ల, లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర సీనియర్ నేత

# స్థిరాస్తి చట్టం ఉపాధికి నూతనోత్తేజమిచ్చేనా?

పెద్దఎత్తున ఉపాధి అవకాశాలకు కీలకమైన స్థిరాస్తి రంగం ఆర్థికమాంద్యం, డీమానిటైజేషన్ దెబ్బ నుంచి ఇంకా కోలుకోలేదు. ప్రభుత్వ ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి తోడు స్థిరాస్తి (నియంత్రణ, అభివృద్ధి) చట్టం అమలైతే.. గృహ, నిర్మాణ రంగాలకు నూతనోత్తేజం వచ్చి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చట్టం వల్ల స్థిరాస్తి రంగంపై నియంత్రణకు, పారదర్శకతను పెంపొందించేందుకు, తద్వారా దీర్ఘకాలంలో వినియోగదారులు, డెవలపర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు వీలుంటుందని.. ఈ ఏడాది మే 1 నుంచి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేయాలని కేంద్ర గృహనిర్మాణ శాఖా మంత్రి వెంకయ్య నాయుడు సూచించారు. ఈ చట్టంలోని కొన్ని నిబంధలను నీరుగార్చాలని కొన్ని రాష్ట్రాలు ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయని, ఇది వాస్తవం కాకూడదని భావిస్తున్నానన్నారు. నిబంధనలను పక్కదోవ పట్టించకుండా చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయాలని కోరారు. స్థిరాస్తి బిల్లులోని పలు అంశాల పట్ల లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ హర్షం వ్యక్తం చేశారు. దేశంలో అందరికీ సొంత ఇల్లు ఉండాలని, గృహనిర్మాణ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని అన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో నల్లధనాన్ని అరికట్టి ధరల్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు స్టాంప్ డ్యూటీ తగ్గింపు, భూముల విలువ మార్కెట్ స్థాయికి పెంపు, క్యాపిటల్ గెయిన్స్ పన్ను రద్దు వంటి చర్యలను కూడా అమలు చేయాలని కోరారు. ఈ సంస్కరణల్ని వేగంగా అమలు చేసి ఉపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

**స్థిరాస్తి (నియంత్రణ, అభివృద్ధి) చట్టం - 2016 లోని కొన్ని ముఖ్యాంశాలు :**

○ అప్పిలేట్ ట్రైబ్యునళ్ల ఆదేశాల్ని ఉల్లంఘిస్తే ప్రమోటర్లకు మూడేళ్లు, ఏజెంట్లు కొనుగోలుదార్లకు ఏడాది దాకా జైలుశిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చు ○ అన్ని స్థిరాస్తి ప్రాజెక్టులనూ నియంత్రణ ప్రాధికార సంస్థల వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రమోటర్, ప్రాజెక్టు, లేఅవుట్ ప్లాన్, భూమి స్థితి, అనుమతుల వివరాలు, ఒప్పందాలు, ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, ఆర్కిటెక్టులు, ఇంజినీర్ల వివరాలన్నీ అందించాలి ○ ఫిర్యాదుల పరిష్కారానికి అప్పిలేట్ ట్రైబ్యునళ్లు, నియంత్రణ ప్రాధికార సంస్థలకు కాలపరిమితుల్ని విధించారు ○ భూమి హక్కుకు బీమా కల్పిస్తుంది. భూమి హక్కుల్లో లోపాలున్నట్టు తేలినట్టయితే, వినియోగదారులు, డెవలపర్లు ఇద్దరికీ ప్రయోజనం దక్కాలి ○ నిర్మాణపరమైన లోపాలకు డెవలపర్ల జవాబుదారీతనాన్ని రెండు నుంచి ఐదేళ్లకు పెంచారు. కేటాయింపులు పొందినవారిలో రెండింట మూడోవంతు మంది అనుమతిలేనిదే ప్లాన్లను మార్చటానికి వీల్లేదు ○ ప్రాజెక్టులో ఆలస్యం జరిగితే వినియోగదారులు, డెవలపర్లు ఒకేస్థాయిలో వడ్డీ కట్టాల్సి ఉంటుంది ○ లావాదేవీల్లో తప్పులకు పాల్పడకుండా నివారించేలా కార్పెట్ ఏరియాపై స్పష్టమైన నిర్వచనం ఇచ్చారు ○ వాణిజ్య స్థిరాస్తి రంగాన్నీ బిల్లు పరిధిలోకి చేర్చారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులూ నియంత్రణ ప్రాధికార సంస్థ వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది ○ 70శాతం వసూళ్లను ప్రత్యేక ఖాతాలో ఉంచాలి ○ ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన నిబంధనల్ని సవరించారు.

# మహాత్మాపూలే ఆశయాలకు రాజకీయ రూపం లోక్‌సత్తా

సమాజంలో కుల, మత వివక్షను, పేదరికాన్ని తొలగించేందుకు విద్యే మార్గమని గుర్తించిన తొలి ఆధునిక సంస్కర్త జోతిబా ఫూలే అని లోక్‌సత్తా పార్టీ అంజలి ఘటించింది. మహాత్మాపూలే సామాజికంగా చేసిన కృషిని మరింత విస్తృతమైన రాజకీయరంగంలోకి తీసుకెళ్లి.. విద్యను రాజకీయానికి, ఎన్నికలకు, పాలనకు కేంద్రబిందువు చేయాలని కృషి చేస్తున్న తొలి రాజకీయ ఉద్యమం లోక్‌సత్తాయేనని పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఫూలే జన్మదినోత్సవ వేడుకలలో ఆయన మాట్లాడారు. ఫూలే ఆశయాల సాధనకు తమ పరిధిలో ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పార్టీ నేతలు సరోజాదేవి, అల్లేని నిఖిల్, ప్రసాద్, నందిపేట రవీందర్, రాందేశ్‌పాండే తదితరులు పాల్గన్నారు. లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము కూడా ఫూలేకు నివాళులర్పించారు.

## కుల, మత రాజకీయాలు ఆపి.. కొత్త జిల్లాల సమస్యలు పరిష్కరించండి



తెలంగాణలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు డిమాండ్ చేశారు. అంబేద్కర్ జన్మదినోత్సవం రోజున, నూతన జిల్లాల సమస్యల పరిష్కారంపై కార్యక్రమాన్ని పార్టీ ప్రారంభించింది. తొలుత కామారెడ్డి జిల్లాలో పరిశీలన చేశారు. రాజంపేట్‌లోని ఇందిరమ్మ గృహాలను పరిశీలించి అక్కడ నివసిస్తున్న వారితో సమస్యల గురించి తెలుసుకున్నారు. అర్హులైనవారందరికీ ఇందిరమ్మ ఇళ్లను అప్పగించి, రోడ్డు, తాగునీటి సౌకర్యాలను ఏర్పరచాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అక్కడి నుంచి కామారెడ్డి ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. జిల్లా ఆసుపత్రికి భవనం సరిపోవటం లేదని, వేరేచోట నూతన ప్రాంగణంలో అధునాతన సౌకర్యాలతో నిర్మించాల్సుందన్నారు. జిల్లా కేంద్రంలో వైవిధ్యభరిత కోర్సులతో విద్యాసంస్థల సంఖ్యను పెంచాల్సుందన్నారు. రైల్వే బ్రిడ్జి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం మాట్లాడుతూ.. పథకాల పేరుతో తెరాస ప్రభుత్వం పబ్బం గడుపుకుంటోందని, ఎటువంటి అవసరం లేకున్నా కులం, మతం కార్డులను ప్రయోగిస్తూ ప్రజలలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇలాంటి ప్రజావ్యతిరేక రాజకీయాలకు భారీ మూల్యం చెల్లించకతప్పదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేకుండా పౌర సేవల చట్టాన్ని వెంటనే తీసుకురావాలని, గ్రామజ్యోతికి నిధులివ్వాలని, విద్య, వైద్య ప్రమాణాలను మెరుగుపరచాలని, కొత్త జిల్లాల ఏర్పాటును అవకాశంగా వినియోగించుకుని జిల్లా కేంద్రంగా వికేంద్రీకృత పాలన జరిగేలా చూడాలని పాండురంగారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ కామారెడ్డి, నిజామాబాద్ ఇంఛార్జి ఎన్. సరోజాదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి నిఖిల్, జిల్లా అధ్యక్షుడు తాహెర్, కార్యదర్శి బోయిని స్వామి, పద్మ, చంద్రశేఖర్, విమలాదేవి, ఆంజనేయులు, అంజిరెడ్డి, మహ్మద్‌దావూద్, రాజేందర్ తదితర నేతలు పాల్గొన్నారు.

## రాజ్యాంగం ఆయుధంగా యువత పోరాడాలి







రాజ్యాంగం ఇచ్చిన ఓటు, భావ ప్రకటనా స్వేచ్ఛలను ఆయుధాలుగా చేసుకుని పాలకుల అవినీతిపై యువత పోరాటం చేయాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పిలుపునిచ్చారు. కులం, మతం, ప్రాంతం, భాషతో సంబంధం లేకుండా.. సమాజానికి మేలు చేసే సామర్థ్యాన్ని, విలువలను బట్టి మనిషిని అంచనా వేసే జాతిని నిర్మించాలన్న అంబేద్కర్ కలలు అప్పుడే నెరవేరతాయన్నారు. అలాంటి పోరాటంతో రాజ్యాధికారానికి ఈదేశంలోని బహుజనులంతా ఏకమవ్వాలన్నారు. అంబేద్కర్ 126వ జయంతి సందర్భంగా విజయనగరంలో బాబ్జీ నివాళులర్పించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు నాగభూషణం, చిన్నారావు, రాజారావు, రవికుమార్, బుల్లె రమణ, మోహన్, ఆదీశ్వరరావు, భాస్కర్, శ్రీను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో జరిగిన కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు మాదాసు భానుప్రసాద్ ఆధ్వర్యంలో బాబాసాహెబ్ అంబేద్కర్‌కు నివాళులర్పించారు.





# ప్రజలు - డాక్టర్ల మధ్య అపనమ్మకం సమాజానికి నష్టం



సేవాభావంలో ఉండాల్సిన వైద్యరంగం ఆదాయవనరుగా మారిపోవటం ఆందోళనకరమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కేవలం వైద్యఖర్చులు భరించలేక ఈ దేశంలో ఏటా 5 కోట్లమంది పేదరికంలోకి జారిపోతున్నారని, చికిత్సల వ్యయం పెరగటం వల్లే వైద్యులకు-ప్రజలకు మధ్య అపనమ్మకం పెరిగిపోతూ కొన్ని సందర్భాలలో డాక్టర్ల మీద దాడులు కూడా జరుగుతున్నాయన్నారు. అపనమ్మకంలేని ప్రజారోగ్య వ్యవస్థ కోసం.. ఐఎంఏ ప్రతినిధులు, వైద్యసిబ్బంది, సంస్థలతో కలిసి లోక్‌సత్తా కృషి చేస్తోందన్నారు. ఆధునిక వైద్య పరీక్షల పేరుతో రోగుల మీద భారం వేయకుండా, క్లినికల్ నైపుణ్యాలతో యువ వైద్యులు తక్కువ ఖర్చుతో మంచి చికిత్స అందించాలన్నారు. తల్లిదండ్రులు, సమాజం కష్టాన్ని ప్రతి వైద్యవిద్యార్థీ గుర్తుంచుకుని వ్యవహరించాలన్నారు.

1970లలో తాను చదువుకున్న గుంటూరు వైద్యకళాశాలలో గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నివారించదగ్గ బాధలు ఈ దేశాన్ని పట్టిపీడిస్తున్నాయని, ఏటా కోటిమంది మలేరియా బారిన పడుతున్నారని, కొత్తగా 30 లక్షల మంది టీబీ బారిన పడుతున్నారని, రోజుకు వెయ్యిమంది అంగవైకల్యంతో పుడుతున్నారని జేపీ అన్నారు. ఈ బాధలను తొలగించకపోతే మనందరం పాపం చేస్తున్నట్టేనన్నారు. కులం పేరుతో తనకు అన్యాయం చేస్తున్నారని సభలో ఒక విద్యార్థిని తనకు తెలిపి దాని గురించి మాట్లాడాలని కోరిందని... కులం పేరుతో వివక్ష చూపటం మనం చేస్తున్న మరో పాపం, అనాగరిక చర్యని అన్నారు. ప్రతిభాపాటవాలు, సమాజానికి ఆమెవల్ల జరిగే మేలుని బట్టే మాత్రమే ఒక మనిషిని అంచనావేసే సంస్కృతిని పనిగట్టుకునైనా పెంచుకోవాలన్నారు.

జాతీయస్థాయిలో వైద్య విద్య పరిరక్షణకు మెడికల్ కౌన్సిల్ పేరుతో వైద్యవృత్తితో సంబంధంలేని వారి చేతుల్లో పెట్టటం మంచిది కాదని ఈ సందర్భంగా జేపీ స్పష్టం చేశారు. వైద్య విద్య ప్రమాణాలు తగ్గినా, వైద్యులపై దాడులు జరిగినా అంతిమంగా సమాజమే నష్టపోతుందన్నారు. దేశంలో ఎంబీబీఎస్ విద్యార్థులకు తగిన సంఖ్యలో పీజీ సీట్లు అందుబాటులో లేకపోవటం శోచనీయమన్నారు. ఈ మొత్తం వైఫల్యాలలో ఎక్కువశాతాన్ని ప్రభుత్వాలే సరిచేయాల్సిందన్నారు. ఖండాంతర ఖ్యాతిని గడించిన గుంటూరు వైద్యకళాశాల విద్యార్థులు 'అందరికీ అందుబాటులో వైద్యం' కృషిలో భాగస్వాములు కావాలన్నారు.

ప్రిన్సిపాల్ డా॥ గుంటుపల్లి సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ డా॥ మెండా ఫర్నికుమార్, నల్లూరి మురళీకృష్ణ, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్, రమణ, యశస్వి, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొని విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. అనంతరం ప్రిన్సిపల్‌తో కలిసి జేపీ వైద్యవిద్యార్థులకు పట్టాలు అందచేశారు.

Posting Date 07-05-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on May1st, 2017

# నిజాలు మాట్లాడుకుందాం-19

## క్రిమినల్ అభ్యర్థుల జాతకాలను దేశంలోనే మొట్టమొదట బయటపెట్టింది లోక్ సత్తా



పొద్దున్న లేచిన దగ్గరనుండి ఒకరినొకరు దుమ్మెత్తి పోసుకుంటూ చాటుగా కలసి అక్రమ వ్యాపారాలు చేసుకునే సంప్రదాయ పార్టీల నేతలు పోలీసు వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకోబట్టే నేర నేతలు పుట్టగొడుగుల్లా పెరిగారు ఇది అబద్ధం అని అనగలిగే దమ్ము ధైర్యం ఏ అధికార ప్రతిపక్ష పార్టీ కి ,నాయకుడికి ఉన్నాయి ?

**షేర్ చేయండి . ప్రజలకు నిజాలు చేరవేయండి**

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad